శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

అణు ప్రమాద పరిహార బాధ్యతకు తూట్లు
రిజర్వేషన్ల బంతి బిజెపి కోర్టులో... లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 231 | ఆదివారం | 09-02-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00



## గ్రేటర్ అభివృద్ధిపై సిఎం ఫోకస్

- ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సమీక్ష
- రెండురోజుల్లో సమగ్ర సర్వేతో రావాలని ఆదేశం
- మీరాలం బ్రిడ్జిని ప్రముఖంగా తీర్చిదిద్దాలని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఫోకస్ పెట్టారు. గ్రేటర్ హైదరాబాద్‌లో చేపడుతున్న ప్రాజెక్టులు, నిర్మించనున్న ఫ్లైఓవర్‌లపై మరింత లోతుగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. రహదారుల విస్తరణపై అధికారులకు సిఎం మార్గనిర్ధేశం చేశారు. 'హెచ్ సిటీ' పథకం ద్వారా చేపట్టిన తరువాయి 2లో



## నిధుల చెల్లింపులను వేగిరపర్చండి

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌కు రాష్ట్ర డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి

ప్రజాపక్షం / హైదరాబాద్

వివిధ కార్పొరేషన్లు, ఎస్‌పివిల రుణ పునర్ వ్యవస్థీకరణ ఆర్థిక సంస్థలకు మార్గదర్శకాలు జారీ చేయాలని, తెలంగాణ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.4,08,48,54,461 నిధుల తిరిగి చెల్లింపును వేగవంతం చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌ను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి తరువాయి 2లో

# ఢిల్లీ పీఠం బిజెపి వశం

బిజెపి 48 | ఆప్ 22 | మ్యాజిక్ ఫిగర్ 36



## 27 ఏళ్ల తరువాత హస్తినలో అధికారాన్ని చేజిక్కించుకున్న కమలం పార్టీ

ఓడినా.. గౌరవప్రద సీట్లు, ఓట్లు దక్కించుకున్న ఆప్
మూడో'సారీ' కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బే

**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి విజయ కేతనం ఎగురవేసింది. 27 ఏళ్ల తరువాత హస్తినలో అధికారాన్ని చేపట్టనున్నది. అధికార ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సహా మనీష్ సిసోడియ, సోమనాథ్ భారతి, సౌరభ్ భరద్వాజ్‌లు ఓటమి చవిచూశారు. మొత్తం 70 సీట్లకుగాను బిజెపి మెజారిటీ ఫిగర్ 36ను దాటి 48 సీట్లను కైవసం చేసుకున్నది. ఆప్ కేవలం 22 సీట్లతో ఎంతో దూరంలో నిలిచింది. కాగా కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా దక్కకపోవడం గమనార్హం. ఢిల్లీ స్థానంలో పోటీచేసిన ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ బిజెపికి చెందిన పర్వేష్ వర్మ చేతిలో 4,089 ఓట్ల తేడాతో ఓడిపోయారు. పర్వేష్ మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు. ఓట్ల లెక్కింపులో ఆరంభంలో కేజ్రీవాల్ వెనుకబడినప్పటికీ తరువాత పుంజుకున్నారు. కానీ చివరి రౌండ్లతో మళ్లీ వెనుకబడి ఓటమి పాలయ్యారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ 4,568 ఓట్లతో మూడో స్థానానికి పరిమితమయ్యారు. 2015నుంచి అధికారంలో ఉన్న ఆప్‌కు ఈ ఓటమి పెద్ద దెబ్బ అని చెప్పవచ్చు. 2015 ఎన్నికలలో కాంగ్రెస్, బిజెపిలను తలదన్ని 67 సీట్లు గెలుచుకుని అధికారం చేపట్టిన ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) గత(2020) ఎన్నికలలోనూ 62 సీట్లు గెలుచుకుని ఆధిపత్యం నిరూపించుకుంది. అయితే మొహల్లా క్లినిక్స్, మోడల్ స్కూల్స్, ఉచిత మంచినీరు, ఉచిత విద్యుత్‌వంటి హామీలను తరువాయి 2లో




## ఓట్ల తేడా రెండు శాతమే !

ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించి బిజెపి అధికారం కైవసం చేసుకున్నప్పటికీ, అది ఘనవిజయమేమి కాదని ఓట్ల లెక్కలు చెబుతున్నాయి. మొత్తం పోలైన ఓట్లలో ఆప్‌కు , బిజెపికి మధ్య తేడా రెండు శాతం ఓట్లే. బిజెపికి 43,23,110 (45.56 శాతం) ఓట్లు పోలయ్యాయి. ఆప్‌కు 41,33,898 (43.57 శాతం) ఓట్లు పోలయ్యాయి. అంటే ఇరు పార్టీల మధ్య 1,89,212 ఓట్లు (2 శాతం ) మాత్రమే తేడా ఉంది. కాంగ్రెస్ పార్టీకి 6,01,922 ఓట్లు(6.34) శాతం లభించగా, జనతాదళ్ (యు)కు 1,00,580 ఓట్లు (1.06 శాతం) దక్కాయి. మిగతా పార్టీలకు ఒక్క శాతం లోపే ఓట్లు పోలయ్యాయి.

## ప్రజల శక్తే సర్వోన్నతం

ప్రజల శక్తే సర్వోన్నతం అని ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఉద్ఘాటించారు. ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో బిజెపి భారీ విజయంపై ప్రధాని మోడీ 'ఎక్స్' పోస్ట్‌లో ఆ విధంగా స్పందించారు. నగర సర్వతోముఖ అభివృద్ధి కోసం తమ పార్టీ ఏమాత్రం వెనుకాడదని, నగర వాసుల జీవితాలను మెరుగుపరుస్తుందని మోడీ స్పష్టం చేశారు. అభివృద్ధి, సుపరిపాలన గెలిచాయని ప్రధాని పేర్కొన్నారు. బిజెపికి చరిత్రాత్మక విజయం దక్కించినందుకు ఢిల్లీ వోటర్లకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. 'బిజెపికి ఇంతటి అఖండ విజయం చేకూర్చినందుకు నా సోదర సోదరీమణులు అందరికీ అభినందనలు' అని మోడీ తెలిపారు. 'ఢిల్లీ సర్వతోముఖాభివృద్ధికి, నగర ప్రజల జీవితాల మెరుగుదలకు తరువాయి 2లో

## ఆతిశీ గెలుపుతో ఆప్‌కు ఊరట



అసెంబ్లీ ఎన్నికలలో అధికార పార్టీ ఆప్ ముఖ్యమంత్రి ఆతిశీకి ఊరట విజయం లభించింది. పార్టీ ముఖ్య నేతలు ఓటమి పాలవగా, అవినీతి ఆరోపణలపై కేజ్రీవాల్ జైలుకు వెళ్లినపుడు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన అతిశి, కల్కాజి అసెంబ్లీ సీటును గెలుచుకోవడం ఆ పార్టీకి ఊరటనిచ్చే అంశం. ఆమె తన సమీప అభ్యర్థి రమేష్ బిధూరి(బిజెపి)పై 3,521 ఓట్లతో గెలుపొందారు. ఆప్ మంత్రులు గోపాల్ రాయ్, తరువాయి 2లో

## ప్రజల తీర్పు గౌరవిస్తాం : కేజ్రీవాల్



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి అనతరం ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ 'ప్రజల తీర్పును వినయంగా స్వీకరిస్తాం. విజయం సాధించిన బిజెపికి అభినందనలు. ఢిలీ ప్రజల ఆకాంక్షలను రాబోయే ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆశిస్తున్నాను' అని ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు. కేజ్రీవాల్ 4,089 ఓట్ల తేడాతో బిజెపికి చెందిన పర్వేష్ వర్మ చేతిలో ఓటమి చవిచూశారు. విజయం తరువాయి 2లో



## కాంగ్రెస్ తీరుపై 'ఇండియా'లో అసంతృప్తి

05

- ప్రతిపక్షం ఐక్యంగా ఉంటే ఫలితాలు వేరుగా ఉండేవి
- ఎనిమిది రాష్ట్రాలకే పరిమితమైన ప్రతిపక్ష ప్రభుత్వాలు




## డీప్ సీక్ దెబ్బ

- రేపు పారిస్‌లో ఎఐ కీలక సదస్సు
- మోదీ సహా 100 దేశాల ప్రతినిధులు హాజరు

**పారిస్ :** కృత్రిమ మేధ కార్యాచరణ సదస్సు పారిస్‌లో ఈనెల 10, 11 తేదీలలో అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు జరుగుతుంది. ఈ సదస్సుకు 100 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఈ సదస్సుకు హాజరవుతున్నారు. భారత్–ఫ్రాన్స్ దేశాలు సంయుక్తంగా ఈ సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్నాయి. కృత్రిమ మేధకు సంబంధించిన అత్యంత కీలకమైన సదస్సుగా దీనిని పేర్కొంటున్నారు. రాబోయేకాలంలో కృత్రిమ మేధ వినియోగంపై ఒక బృహత్తర ప్రణాళికను ఈ సదస్సులో తరువాయి 12లో

## అట్టడుగువర్గాలకు న్యాయానికి సలహాలు స్వీకరిస్తాం

- సిఎం దృష్టికి రాజకీయ రిజర్వేషన్లు, బిసి సాధికారత, బిసి డిక్లరేషన్‌పై బిసి సంఘాల సూచనలు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి
- బిసి సంఘాలు, మేధావులు, ప్రొఫెసర్లతో భేటీ
- కులగణన సర్వేపై సందేహాలు నివృత్తి

ప్రజాపక్షం /హైదరాబాద్

బిసి కుల గణన ద్వారా సామాజిక న్యాయం జరుగుతుందని, సమాజంలో అట్టడుగు వర్గాలకు న్యాయం చేయడానికి ఎవరు ఎలాంటి సలహాలు సూచనలు ఇచ్చినా స్వీకరిస్తామని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు తదితర రాజకీయ రిజర్వేషన్లు , బిసి సాధికారత, బిసి డిక్లరేషన్ అమలు వంటి అంశాలపై బిసి సంఘాలు ఇచ్చిన సలహాలు సూచనలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి, అమలయ్యేలా చూస్తామని చెప్పారు. బిసిలకు సామాజిక న్యాయం జరగడానికి తమ ప్రభుత్వం పార్టీ కట్టుబడి ఉంటుందని హామీ ఇచ్చారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావుతో కలిసి బిసి సంఘాల నేతలు ,మేధావులు ,ప్రొఫెసర్లతో శనివారం నాడు మంత్రి పొన్నం సమావేశమై, కులగణన సర్వేపై సందేహాలను నివృత్తి చేశారు. తమ ప్రభుత్వం విశాలదృక్పథంతో సలహాలు సూచనలు స్వీకరిస్తుందని, ఇందులో ఎలాంటి దాపరికాలు ,విమర్శలు లేవన్నారు. రాజకీయ లబ్ది కోసం కేంద్రం లో అధికారంలో ఉన్న బిజెపి, పదేళ్లుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ లు బిసిలను అణగదొక్కి సామాజిక న్యాయం చేయలేదన్నారు. వారిహయాంలో కుల గణన చేయలేదని, పారదర్శకంగా పని చేస్తున్న తమ ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ఏడాది ఫిబ్రవరిలో మంత్రివర్గం తరువాయి 2లో





## మద్యం విధానంతో మునిగిన ఆప్

05

- అభ్యర్థి సచ్ఛీలుడై ఉండాలి
- సామాజిక కార్యకర్త అన్నా హజారే



## ఐక్యతకోసం ఆలోచించాలి

03

- 'భారత కమ్యూనిస్టుపార్టీ వందేళ్ల ఉద్యమ ప్రస్థానం' గ్రంథావిష్కరణలో వక్తలు

# ధరల పతనం సంక్షోభంలో సాగు

ఆదిలో అధిక వర్షాల కారణంగా రెండు మూడు సార్లు మిర్చి మొక్కలను నాటాల్సి వచ్చింది. ఆ తర్వాత తెగుళ్లు, ఇతరత్రా కారణాలతో పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. రసాయనిక ఎరువుల ధరలు, క్రిమిసంహారక మందుల ధరలు విపరీతంగా పెరగడంతో రైతులు అప్పులు చేయాల్సి వచ్చింది. తీరా మార్కెట్‌కు వస్తే గతేడాది తాలు మిర్చి పలికిన ధర కూడా ఈ ఏడాది మొదటి కోత మిర్చికి ఆ ధర రాలేదు.



- రోజు రోజుకు పడిపోతున్న వ్యవసాయ ఉత్పత్తుల ధరలు
- పట్టించుకోని పాలకులు
- అప్పుల ఊబిలో రైతులు
- ఈ ఏడాది అన్నదాతకు ఆశనిపాతంలా పత్తి, మిర్చి ధర

ప్రజాపక్షం/ఖమ్మం/హనుమకొండ ప్రతినిధి

వ్యవసాయ రంగం పరిస్థితికి 'నానాటికి తీసికట్టు నానంబొట్టు' అన్న సామెతలా తయారైంది. రోజు రోజుకు మరింత సంక్షోభంలోకి కూరుకుపోతోంది. కలిసి రాని ప్రకృతి, సహకరించని పాలకులు, తగ్గిన దిగుబడులు, పెరిగిన పెట్టుబడులు, గిట్టుబాటు కాని ధరల నేపథ్యంలో రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతుంది. ఈ యేడు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో ఒక్క ధాన్యం మినహాయించి మిగిలిన వ్యవసాయోత్పత్తుల ధరల పరిస్థితి దయనీయంగానే ఉంది. ముఖ్యంగా వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి ధర ఈ ఏడాది రైతాంగానికి ఆశనిపాతంలా తగిలింది. తెలంగాణ రాష్ట్రంలో దక్షిణ తెలంగాణలో ప్రధానంగా పండించే వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి రైతులు ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయారు. గతేడాది తరువాయి 12లో



## చీడ, పీడలతోనూ మిర్చి రైతు పరేషాన్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో నానాటికీ మిర్చి సాగు తగ్గుముఖం పడుతున్నది. ధరలు తగ్గడంతో పాటు చీడపీడలు మిర్చి సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మిర్చి పంటకు పేరుగాంచిన ఉమ్మడి వరంగల్ లో మిర్చి పంట సాగుకు రైతులు ముందుకు రావడం తరువాయి 12లో



## స్పాడెక్స్‌లో సమస్యల్లేవ్

05

- మీడియా వార్తలకు 'ఇస్రో' ఖండన

# మరో ముగ్గురు బందీలు, 183 మంది ఖైదీలు విడుదల









**డైర్ ఎల్ బలాహ్ :** ఒప్పందం ప్రకారం హమాస్ ఉగ్రవాద సంస్థ మరో ముగ్గురు ఇజ్రాయెల్‌కు చెందిన బందీలను విడుదల చేసింది. దీనికి ప్రతిగా ఇజ్రాయెల్ ప్రభుత్వం కూడా 183 మంది బందీలను శనివారంనాటి ఉదయం రెడ్‌క్రాస్ ఇంటర్నేషనల్ కమిటీకి స్వాధీనం చేసింది. దీంతో ఇప్పటివరకూ హమాస్ 18 మంది ఖైదీలను విడుదల చేసింది. ఇజ్రాయెల్ కూడా 550 మంది ఖైదీలను విడుదల చేసింది. ఇలా విడుదలైన ఖైదీలలో 20 నుండి 61 ఏళుళ లోపు వయసుగల ఖైదీలు ఉన్నారు. ఇలా విడుదలైన ఖైదీలలో ఏడుగురు ఖైదీలను ఈజిప్టుకు ఇజ్రాయెల్ అప్పగిస్తుంది. ఇజ్రాయెల్ జైలులో 21 సంవత్సరాలపాటు ఖైదీగా బతికిన అబూ షగ్దమ్ (49) కూడా విఉడదలైవారిలో ఉన్నాడు. 2000 సంవత్సరంలో హమాస్ తరపున పోరాటం చేసి ఇజ్రాయెల్‌పై దాడులకు పాల్పడిన కేసులో షగ్దమ్ అరెస్టయి 21 ఏళ్ళు శిక్ష అనుభవించాడు. ఓహద్ బెన్ అమీ (56), ఎలి షరబి (52), ఓర్ లెవీ (34)లను శనివారంనాడు హమాస్ ఉగ్రవాదులు సెంట్రల్ గాజా లోని డైర్ ఎల్ బలాహ్‌లో ఏర్పాటు చేసిన వేదికపైకి తీసుకువెళ్ళి రెడ్‌క్రాస్ సంస్థకు స్వాధీనం చేశారు.వేదికపైన "మేం వరద–యుద్ధం మరునాడు కూడా మేమే" అని బ్యానర్లు కట్టి ఉన్నాయి. విడుదలైనవారికి రిలీజింగ్ సరిఫికెట్లను హమాస్ జారీ చేసింది. ఈ వేదికచుట్టూ క్వాజిమ్ బ్రిగేడ్స్, భారీ ఎత్తున ప్రజలు గుమిగూడారు. ప్రజలు హమాస్‌కు, క్వాజిమ్ బ్రిగేడ్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తుండగా ఈ బందీలను స్వాధీనం చేసే కార్యక్రమం జరిగింది. ఈ బం దీలు 16 నెలలపా టు హమాస్ చెర లో ఉండి దారు ణ పరిస్థితులను చవిచూశారు. వారిని వెంటనే ఇజ్రాయెలీ మిలిటరీ ఇంటిలిజన్స్ ఆఫీసర్లకు రెడ్‌క్రాస్ స్వాధీనం చేసింది. మరోవైపు ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌లో హోస్టేజ్ స్క్వేర్ వద్ద వేలాది మంది ప్రజలు గుమిగూడి తమ ప్రియతములైన కుటుంబ సభ్యుల విడుదల లైవ్ కార్యక్రమాన్ని ఎంతో ఉత్కంఠతతో చూశారు. 2023 అక్టోబరు 7వ తేదీన హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌లో జరిగిన ఒక మ్యూజిక్ ఫెస్టివల్‌పై దాడిచేసి 1200 మందిని కాల్చి చంపారు. మరో 250 మందిని బందీలుగా తీసుకుపోయారు. వారిని రెస్‌క్రాస్ తీసుకువెళ్ళ ఇజ్రాయెల్ సైసన్యానికి అప్పగించింది. ఈ అప్పగింతల కార్యక్రమం కోసం భారీ ఏర్పాట్లు భద్రత సమకూర్చారు. దీంతో ఇప్పటికి ఐదు విడతలుగా హమాస్–ఇజ్రాయెల్ సైన్యం మధ్య ఇటు బందీలు, అటు ఖైదీల విడుదల ప్రక్రియ పూర్తయింది. మధ్యవర్తుల చర్చల ద్వారా కుదిరిన ఒప్పందం ప్రకారం జనవరి 19వ తేదీ నుండీ 45 రోజులపాటు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందంతోపాటు మొదటి ఆరు వారాలలో హమాస్ 33 మంది బందీలను విడుదల, ఇజ్రాయెల్ ప్రభుత్వం కూడా 2000 మంది ఖైదీలను విడుదల ప్రక్రియ ఇప్పటివరకూ సజావుగా కొనసాగుతున్నది. ఈ కాల్పుల విరమణ ఒప్పందం మార్చి 2వ తేదీతో పూర్తి అవుతుంది. తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై కూడా ఇప్పటినుండే దోహాలో చర్చలకు రంగం సిద్ధం అవుతున్నది. ఇజ్రాయెల్ కూడా ఒక అధికారిక బృందాన్ని దోహాకు పంపేందుకు సిద్ధం చేసింది.

**ఇజ్రాయెల్‌కు 7.4 బిలియన్ డాలర్ల అమెరికా ఆయుధాలు**

ఇజ్రాయెల్–పాలస్తినా మధ్య సహజీవనం, శాంతి వర్థిల్లాలని ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా అందరూ కోరుకుంటుండగా మరోవైపు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్‌కు 7.4 బిలియన్ డాలర్లు విలువైన ఆయుధాలు విక్రయించేందుకు అంగీకారం తెలియజేశారు. గడచిన మంగళవారంనాడు వైట్‌హౌస్‌లో ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమన్ నేతన్యాహూతో ట్రంప్ సమావేశం తర్వాత ఈ తాజా నిర్ణయం వెలువడింది. శిథిలమయమైన పాలస్తినా నుండి స్థానిక ప్రజలను పూర్తిగా ఖాళీచేయించి గాజాను స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ చేసిన ప్రకటన పలు దేశాలను ఆగ్రహానికి గురిచేస్తున్న తరుణంలోనే ఇజ్రాయెల్‌కు భారీగా ఆయుధాల విక్రయ నజరానాను ట్రంప్ ప్రకటించారు.

# సూడాన్‌లో ఆర్మీ పైచేయి



**ఖార్టూమ్ :** ఆఫ్రికాదేశం సూడాన్‌లో రెండేళ్ళుగా జరుగుతున్న యుద్ధంలో సైన్యం పైచేయి సాధించింది. సూడాన్‌లో రెండు సైనిక గ్రూపులమధ్య అంతర్యుద్ధం జరుగుతున్నది.ఈ యుద్ధంలో ఆర్మీ అనేక ప్రాంతాలను స్వాధీనం చేసుకుంది. కీలక రాష్ట్రం జెజిరియాను స్వాధీనం చేసుకోవడంతో ఇక రాజధాని ఖార్టూమ్‌ను కూడా స్వాధీనం చేసుకోగలమన్న విశ్వాసంతో ఉంది. ఇక త్వరలో దేశ రాజధానిలో తిరుగుబాటుదారులనేవారే ఉండబోరని సైనిక నాయకుడు జనరల్ అబ్దెల్ ఫతా అల్ బుర్హాన్ ప్రకటించారు. ఇప్పటికే యుద్ధం వల్ల సూడాన్ దేశం అతలాకుతలమైంది. అంతర్యుద్ధం వల్ల కోటీ 20 లక్షలమంది ప్రజలు ఇళ్ళు వదలి, దేశం వదలి పారిపోయారు. ఒక్కరాజధాని ఖార్టూమ్‌లోనే 1,00,000 మంది ప్రజలు కరువుతో అల్లాడుతున్నారని ఐక్య రాజ్యసమితి సహాయబృందాలు వెల్లడించాయి. ప్రపంచంలో సూడాన్ దేశం అత్యంత దారుణమైన మానవతా సంక్షోభం తాండవించే దేశంగా సహాయ సంస్థలు ప్రకటించాయి. దేశంలో కరువుకాటకాలు తాండవిస్తున్నాయి. వీటి మధ్య పారామిలిటరీ దళాలతో జరిగిన యుద్ధంలో ఆర్మీ పైచేయి సాధించి అతిపెద్ద విజయం చేజిక్కించుకుంది. దేశ ధనాన్ని ముద్రించే 'మింట్'తో సహా అనేక కీలకమైన స్థావరాలను సైన్యం స్వాధీనం చేసుకుంది. ఒకప్పుడు సైనిక నాయకుడు జనరల్ బుర్హాన్, అయనకు సహచరుడుగా ఉన్న డిప్యూటీ ఆర్మీ జనరల్ మహ్మద్ హమ్దాన్‌కు మధ్య విభేదాలు వచ్చాయి. దీంతో హమ్దాన్ ఆర్ఎస్ఎఫ్ గ్రూపునకు నాయకత్వం వహించి యుద్ధానికి దిగారు.

## దక్షిణచైనా జలాల్లో విన్యాసాలకు కెనడా– ఫిలిప్పైన్స్ యత్నాలు



**మనీలా :** దక్షిణ చైనా సముద్ర జలాలలో ఉమ్మడిగా సైనిక విన్యాసాలు చేసే విషయంపై కెనడా – ఫిలిప్పైన్స్ దేశాలు రెండు చేపట్టిన చర్చలు ఒక కొలిక్కి వస్తున్నాయి. ఈ చర్చలు చివరి దశలో ఉన్నాయి. ఈ చర్చలు ఫలవంతమైతే ఇరు దేశాలు సంయుక్త విన్యాసాలు చేపడతాయి. దక్షిణ చైనా సముద్రంలో చైనా సైనికుల ప్రాబల్యం, రెచ్చగొట్టే చర్యలు పెరిగిపోవడంతో చిన్న దేశాలు తీవ్ర భయాందోళన చెందుతున్నాయి. వాటిమధ్య సయోధ్య యత్నాలు జరుగుతున్నాయి. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో కెనడా తిరిగి తన సైనికశక్తి ఉనికిని చాటుకోవాలని సన్నాహాలు చేస్తోంది. అంతర్జాతీయ చట్ట నిబంధనలు అమలు జరిగేట్టు చూడటంద్వారా వాణిజ్య పెట్టుబడుల విస్తరణ చేయాలని కోరుకుంటున్నది. తమ రెండు దేశాలమధ్య ఒప్పందం తుది దశలో ఉందని కెనడా రాయబారి డేవిడ్ హార్ట్‌మన్ చెప్పారు.

# వారం రోజుల్లో 16 పనులు చేసిన ట్రంప్ టీమ్



**వాషింగ్టన్ :** తన పరిపాలన మొదటి 100 రోజుల్లోనే భారీ మార్పులు తీసుకువస్తానని ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అందుకు తగ్గట్టుగానే జెట్ స్పీడుతో పనులు చేస్తున్నారు. దూకుడు నిర్ణయాలు తీసుకోవడం ఆ తర్వాత మళ్ళీ సంప్రదింపులు జరపడం ఇప్పుడు ఒక సంప్రదాయంగా మారిపోతున్నది. అధికార పగ్గాలు చేపట్టిన మూడోవారంలో ట్రంప్ టీము ఏకంగా 16 పనులు చేసింది. ఐతే ఈ నిర్ణయాలన్నీ ఆయన చేస్తాను... చేస్తాను....అంటూ ఏనాటి నుండో ప్రచారం చేస్తున్న విషయాలే. కానీ తప్పైనా, ఒప్పైనా చెప్పిన ప్రతి అంశాన్నీ ట్రంప్ తూ.చ తప్పకుండా అమలు చేస్తున్నారు. వీటిల్లో అత్యంత కీలకమైనవి యుఎస్ ఎయిడ్ (యుఎస్ ఏజన్సీ ఫర్ ఇంటరేనషనల్ దవలప్‌మెంట్)ను నిలిపివేయడంతోపాటు అమెరికా మహిళా క్రీడల్లో ట్రాన్స్ జెండర్లను నిషేధించడం. సైన్యంలో కూడా గే, ట్రాన్స్ జెండర్లను ఏరిపారేసి వెనక్కు తిప్పి పంపేందుకు ఫైలుపై సంతకం చేయడం. అమెరికాలో స్త్రీ–పురుష అనే ఇద్దరే ఉంటారనీ, మూడోవారికి చట్టపరంగా స్థానం లేదని ట్రంప్ తేల్చి చెప్పారు. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా యుఎస్ ఎయిడ్‌ను రద్దు చేయడం వెనుక అమెరికా సంపన్నుడు ఎలాన్ మస్క్ పాత్ర ప్రధానంగా ఉంది. ఈ నిధులు దుర్వినియోగం అవుతున్నాయనీ, తప్పుతోవన పోతున్నాయని మస్క్ గట్టిగా అభిప్రాయపడ్డారు. ఐతే 2,200 మంది యుఎస్ ఎయిడ్ ఉద్యోగులను సెలవుపై వెళ్ళనీయకుండా అమెరికా కోర్టు ఈనెల 14 వరకు ట్రంప్ ఉత్తర్వులను తొక్కిపట్టింది. ప్రభుత్వ ఖర్చులను తగ్గించడం, అమెరికాకు వచ్చే దిగుమతులపై టారిఫ్‌లు పెంచడంలో మస్క్ కీలక పాత్ర ఉంది. గడచిన మంగళవారంనాడు నేతన్యాహూతో కలిసి ఉమ్మడి పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, గాజాను తమ అధీనంలోకి తీసుకుంటామని సంచలన ప్రకటన చేశారు. యుఎస్ ఎయిడ్ కార్యాలయాల్లో ప్రపంచవ్యాప్తంగా పనిచేసే 10,000 మంది ఉద్యోగులు ట్రంప్ నిర్ణయం వల్ల నష్టపోయారు. అత్యవసర సిబ్బంది కొంతమందితప్ప మిగిలినవారంతా ఉద్యోగాలు కోల్పోయేవారే. శుక్రవారం అర్థరాత్రినుండీ ఈ సిబ్బంది లీవుపై వెళ్ళారు. చైనాపై 25 శాతం టారిఫ్‌లను అమలు చేశారు. కెనడా, మెక్సికో పొరుగుదేశాలపై 10 శాతం టారిఫ్‌లను నెలరోజులు వాయిదా వేశారు. ఫెడరల్ వర్కర్లు స్వచ్ఛందంగా ఉద్యోగాలు వదలి వెళ్ళిపోతే ప్రోత్సాహకాలు ఇస్తామని, ఆరునెలల జీతం అదనంగా ఇస్తానని ప్రకటించారు. అమెరికాపైన, ఇజ్రాయెల్ వంటి మిత్రదేశాలపైన ఆంక్షలు అమలు చేయడంలో ప్రధానపాత్ర పోషించిన అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి)లో పనిచేసే కొంతమంది సిబ్బంది, వారి కుటుంబాలపైన వీసా అంక్షలు, ఆర్థిక ఆంక్షలు ట్రంప్ విధించారు. సోమాలియాపై గగనతల దాడులు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. క్యూబాలో ఉన్న అమెరికా నావికాదళం నిర్వహిస్తున్న వలస నిర్బంధ కేంద్రం సామర్థ్యాని 30,000 మందికి పెంచాలని నిర్ణయించారు. ఉక్రేన్‌కు 300 బిలియన్ డాలర్లు ఆయుధ సాయం చేసినందుకు ప్రతిగా అక్కడ ఉన్న ఖనిజ వనరులను అమెరికాకు తరలించేందుకు హామీ తీసుకున్నారు. కాలిఫోర్నియా లోయలో ఉన్న రెండు డ్యాముల నుండి భారీగా నీరు విడుదల చేయాలని నిర్ణయించారు. వాతావరణ మార్పులకు సంబంధించిన రిఫరెన్స్‌లను ప్రభుత్వ వెబ్‌సైటుల నుండి తొలగించారు. ప్రైవేటు గోల్ఫ్ వివాదంలో జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించారు. మతిమరపుతో బాధపడుతున్న మాజీ అధ్యక్షుడు జో బైడెన్ దేశ రహస్యాలు తెలుసుకోవాల్సిన అవసరం లేదని ఉత్తర్వులు జారీ చేశారు.

**మెక్సికోకు 11 వేలమందిని తిప్పిపంపిన అమెరికా**

వాషింగ్టన్ : డోనాల్‌ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవి చేపట్టినప్పటినుండీ గడచిన 19 రోజుల్లో అమెరికా నుండి మెక్సికోకు 11,000 మంది అక్రమ వలస ప్రజలను తిప్పిపంపారు. ఇందుకోసం సైనిక విమానాలు ఉపయోగించారు. ఇక తదుపరి వలసలు పెరగకుండా మెక్సికో–అమెరికా సరిహద్దుల్లో వేలాది మంది అదనపు సైనిక బలగాలను ట్రంప్ మోహరించారు. ట్రంప్ చేసిన హెచ్చరికలు, టారిఫ్‌ల అమలు భయం నేపథ్యంలో మెక్సికో ప్రభుత్వం కూడా తన సరిహద్దుల్లో వలస ప్రజలను అడ్డుకునేందుకు అదనపు సైన్యాలను మోహరించింది. ఈ ఒప్పందంపైనే టారిఫ్‌లను నెలరోజులపాటు అమలు చేయకుండా ట్రంప్ వాయిదా వేశారు.

## శక్తే సర్వోన్నతం (మొదటి పేజీ తరువాయి)

ఏమాత్రం వెనుకాడబోమని గ్యారంటీ ఇస్తున్నాం. అభివృద్ధి భారతం నిర్మాణంలో ఢిల్లీ ముఖ్య పాత్ర పోషించేలా కూడా మేము చూస్తాం' అని మోడీ తెలిపారు. అటువంటి అఖండ విజయం కోసం రేయింబవళ్ళు శ్రమించిన బిజెపి కార్యకర్తలను చూసి తాను గర్విస్తున్నానని మోడీ తెలియజేశారు. 'మరింత శక్తితో ఢిల్లీ ప్రజలకు సేవ చేయడానికి మేము ఇక అంకితం అవుతాం' అని ఆయన ప్రకటించారు. ప్రధాని 'ఢిల్లీ గుండెలో ఉన్నారు' అని, వోటర్లు కేజ్రీవాల్ 'అద్దాల మేడ'ను ధ్వంసం చేశారని కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'వాగ్దానాలు నెరవేర్చనివారికి ఢిల్లీ గుణపాఠం నేర్పింది& తప్పుడు వాగ్దానాలు చేసే వారికి ఇది ఒక ఉదాహరణ కాగలదు' అని అమిత్ షా అన్నారు. బిజెపి 27 ఏళ్ల తరువాత ఢిల్లీలో తిరిగి అధికార పీఠాన్ని అధిష్ఠిస్తోంది. 70 మంది సభ్యుల శాసనసభలో బిజెపి దాదాపు మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించింది.

## ఆప్‌కు ఊరట (మొదటి పేజీ తరువాయి)

ముఖేష్ అహ్లావత్, ఇమ్రాన్ హుస్సేన్‌లు కూడా విజయాలు నమోదు చేశారు. హుస్సేన్ 29,823 ఓట్ల మెజారిటీతో బల్లిమారన్ నియోజకవర్గంలో, రాయ్ 18,994 ఓట్ల మెజారిటీతో బాబర్‌పూర్ నియోజకవర్గంలో, అహ్లావత్ 17,126 ఓట్ల మెజారిటీతో సుల్తాన్‌పూర్ మజ్ర నియోజకవర్గంలో గెలుపొందారు. గ్రేటర్ కైలాస్‌లో ఆప్ అభ్యర్థి, మాజీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ 3,188 ఓట్ల తేడాతో బిజెపికి చెందిన షికా రాయ్ చేతిలో ఓటమి చెందారు. ఆప్ పార్టీకి చెందిన వీరేందర్ సింగ్ కడియన్ ఢిల్లీ కంటెన్మెంట్ సీటును 2,029 ఓట్ల మెజారిటీతో గెలుచుకోగా, సాహిరామ్ 14,711 మెజారిటీతో తుగ్లకాబాద్ సీటును దక్కించుకున్నారు. తిలక్ నగర్‌లో జర్నైల్ సింగ్ 11,656 మెజారిటీతో విజయం నమోదు చేశారు. బిజెపి అభ్యర్థులు మోహన్ సింగ్ బిస్త్ 17,578 మెజారిటీతో ముస్తఫాబాద్‌లో, కపిల్ మిశ్రా 23,355 మెజారిటీతో కరవాల్ నగర్‌లో, రేఖ గుప్తా 29,595 మెజారిటీతో షాలిమార్ బాగ్‌లో, మంజిందర్ సింగ్ సిర్సా 18,190 మెజారిటీతో రాజౌరి గార్డెన్‌లో తిలక్ రామ్ గుప్త 15,896 మెజారిటీతో ట్రై నగర్‌లో, ఉమన్ బజాజ్1,231 మెజారిటీతో రాజిందర్ నగర్‌లో, చందన్ కుమార్ చౌదరి 344 స్వల్ప మెజారిటీతో సంగం విహార్ నియోజకవర్గాలలో విజయాలు నమోదు చేసుకున్నారు. వరసగా మూడోసారి కాంగ్రెస్ ఒక్క సీటునుకూడా గెలుచుకోలేకపోయింది.

## బిజెపి వశం (మొదటి పేజీ తరువాయి)

నెరవేర్చడంలో విఫలమవడంతో ఓటర్లు ఈసారి ఆప్‌ను తిరస్కరించారు.
ఎన్నికల ఫలితాల అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ స్పందిస్తూ, 'మెరుగైన పాలనకు ప్రజలు పట్టంకట్టారు. రాజధాని అభివృద్ధికి మేము అన్ని విధాల కృషి చేస్తాం' అన్నారు. గత యేడాది హర్యానా, మహారాష్ట్రలలో విజయాలు దక్కించుకున్న బిజెపి ఇపుడు ఢిల్లీ పీఠాన్ని కూడా చేజిక్కించుకుంది. గత లోక్‌సభ ఎన్నికలలో దేశవ్యాప్తంగా పలు పరాజయాలకు ఈ విజయం సాంత్వన చేకూర్చినట్టయింది. కేంద్ర బడ్జెట్‌లో పన్ను మినహాయింపులో మధ్య తరగతి ప్రజలకు ఊరట కల్పించడంకూడా బిజెపి విజయానికి కారణమైంది. ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడి 'ఆప్–ద' పద ప్రయోగం ఓటర్లను ప్రభావితం చేసిందని పరిశీలకులు భావిస్తున్నారు. ఎక్సైజ్ పాలసీలో అవినీతి ఆరోపణలపై ఆప్ నేతలు కేజ్రీవాల్, మనీష్ సిసోదియా జైలుకు వెళ్లడంకూడా బిజెపికి కలిసొచ్చింది.
అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో బిజెపి కార్యాలయాలులో ఉత్సవ వాతావరణం కనిపించింది. కార్యకర్తలు బైక్ ర్యాలీలతో, కాషాయ జెండాలతో, నేతల కటౌట్లతో ఊరేగింపు నిర్వహించారు. కేజ్రీవాల్‌పై విజయం సాధించిన పర్వేష్ వర్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎవరన్నది అధిష్ఠానం చూసుకుంటుందన్నారు. ఢిలీ బిజెపి చీఫ్ వీరేంద్ర సచేవ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తంచేశారు. పార్టీ విజయం కోసం కార్యకర్తలు అహర్నిశలు శ్రమించారన్నారు. అభివృద్ధివైపు ప్రజలు మొగ్గ చూపారన్నారు. ఈ విజయం ప్రధాని మోడీకి అంకింతమన్నారు. కాగా మరోవైపు కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం బోసిపోగా, ఆప్ కార్యకర్తలు దిగ్భ్రాంతిలో మునిగి ఉన్నాయి.

# ఆ వార్తలు నిజం కాదు..

### రేషన్ కార్డులకు బ్రేక్‌పై ఎన్నికల స్పష్టత




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులకు బ్రేక్ అంటూ వస్తున్న వార్తలపై ఎన్నికల కమిషన్ స్పష్టత ఇచ్చింది. ఆ వార్తలు నిజం కాదని స్పష్టం చేసింది. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులను, తప్పుల సవరణను నిలివేస్తున్నామంటూ తాము ఆదేశాలు జారీ చేస్తున్నట్టు కొన్ని సోషల్ మీడియా, వార్త సంస్థలు ప్రచారం చేస్తున్నాయని, తాము ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని ఈసీ స్పష్టత ఇచ్చింది. అయితే ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పలు వార్తా సంస్థలు కథనాలు ప్రసారం చేయగా, దీనిపై వివరణ ఇస్తూ ఈసీ ప్రకటన జారీ చేసింది. అయితే కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం శుక్రవారం వెల్లడించిన విషయం తెల్సిందే. గత నెల 26న గ్రామ సభల్లో దరఖాస్తు చేయని వారు కూడా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని అటు పౌరసరఫరాల శాఖ సైతం ప్రకటించింది. ప్రస్తుతం రేషన్ కార్డులు కలిగి కుటుంబ సభ్యుల పేర్లలో మార్పులు, చేర్పులు, చిరునామా వంటి వాటికి వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మీసేవా కేంద్రాల్లో కొత్త ఆహార భద్రత కార్డుల దరఖాస్తుల స్వీకరణను వెంటనే ప్రారంభిచాలని మరోవైపు ప్రభుత్వం కూడా ఆదేశించింది. దీంతో రేషన్ కార్డులు లేని పేదలు మీ కేంద్రాలకు వెళ్లారు. అయితే వారికి అక్కడ నిరాశ మిగిలింది. దరఖాస్తులు స్వీకరించడంలేదు. మీ సేవా సెంటర్లలో కొత్త రేషన్ కార్డుల పోర్టల్ ఓపెన్ కాలేదు. ఎందుకనే విషయం మీ సేవా కేంద్రాల నిర్వాహకులకు సైతం సమాచారం లేదు.

# మాంగ్ కులస్థులను గ్రూప్–బిలో చేర్చండి

### రాష్ట్ర ప్రభుత్వానికి మందకృష్ణ మాదిగ విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** షెడ్యుల్ కులాల వర్గీకరణ ప్రక్రియలో మాంగ్ కులస్తులను గ్రూప్–బిలో చేర్చి, వారికి న్యాయం చేయాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారకభవన్‌లో శనివారం కాంబ్లే బాలాజీ మాదిగ అధ్యక్షతన జరిగిన మాంగ్ కులస్తుల సదస్సులో ఆయన మాట్లాడారు. మాంగ్ కులస్థులు విద్యా, ఉద్యోగ రంగంలో వెనుకబాటుకు గురయ్యారని మంద కృష్ణ తెలిపారు. మహారాష్ట్ర నుంచి వలస వచ్చి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో మాంగ్‌లు నివాసముంటున్నారని తెలిపారు. ఎస్‌సి కులాల్లో అసమానతలు తొలగించాలని ఏకసభ్య కమిషన్ నివేదిక ఇచ్చినా అందరికీ సమన్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జనాభా ప్రకారం మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని, గ్రూప్–ఎ లోని పంబాల మన్నే కులాలను గ్రూపు–డిలో చేర్చాలని కోరారు. డక్కలి, బేడ బుడగ జంగం కులాలను గ్రూప్–ఎలో చేర్చాలని, నేతకాని మహార్ కులాలకు ప్రత్యేక క్యాటగిరిగా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో ఏ ఒక్క కులానికి అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని మందకృష్ణ పేర్కొన్నారు. సమావేశంలో పెద్దపల్లి మాజీ ఎంపి వెంకటేష్ నేతకాని, మాంగ్ కుల నాయకులు మోరే నర్సింగ్, సూర్య వంశీ తదితరులు పాల్గొన్నారు.

## వేగిరపర్చండి (మొదటి పేజీ తరువాయి)

మల్లు భట్టివిక్రమార్క కోరారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం 2014 లోని 94(2) మార్గదర్శకాల ప్రకారం తెలంగాణలోని వెనుకబడిన జిల్లాల కోసం ప్రత్యేక సహాయ నిధిని విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌ను సఫ్దర్ జంగ్ రోడ్డులోని ఆమె నివాసంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కలిసారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి వివిధ అంశాల్లో రావలసిన ఆర్థిక వనరులకు సంబంధించి విజ్ఞప్తి చేశారు. గతంలో ఈ అంశాలకు సంబంధించి రాసిన లేఖలను ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు డిప్యూటీ సిఎం అందజేశారు. 201415 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రయోజిత పథకాల నిధుల విడుదలలో, కేటాయింపులో జరిగిన పొరపాటును సరిచేయాలని ఆయన కేంద్ర మంత్రికి డిప్యూటీ సిఎం విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం 2014లోని 56(2) నిబంధన ప్రకారం రూ.208 కోట్లను తిరిగి చెల్లించాలన్నారు.ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి తెలంగాణ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు కేటాయించిన అదనపు బాధ్యతకు సంబంధించిన అంశంపై డిప్యూటీ సిఎం చర్చించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యుత్ సంస్థల మధ్య పెండింగ్‌లో ఉన్న నిధుల బకాయిల సమస్యను పరిష్కారం చేయాలన్నారు. డిప్యూటీ సిఎం వెంట రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, ఎంపీలు మల్లు రవి,చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్ తదితరులు ఉన్నారు.

## సిఎం ఫోకస్(మొదటి పేజీ తరువాయి)

పలు ప్రాజెక్టులపై శనివారం సిఎం తన నివాసంలో మున్సిపల్ శాఖ, జిహెచ్‌ఎంసి, హెచ్ఎండిఎ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మీరాలం చెరువుపై నిర్మిస్తున్న బ్రిడ్జి విషయంలో అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. వచ్చే 90 రోజుల్లో బ్రిడ్జి డిపిఆర్ రూపొందించాలని, 30 నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని సిఎం స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో అత్యంత ప్రముఖ ప్రాంతంగా మీరాలం బ్రిడ్జిని తీర్చిదిద్దాలని అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి సూచించారు. చిన్నపిల్లలను దృష్టిలో ఉంచుకుని బ్రిడ్జి పరిసరాలను రూపొందించాలన్నారు. మొత్తం 2.425 కిలోమీటర్ల బ్రిడ్జి నిర్మాణం కోసం అధికారులు మూడు ప్రతిపాదనలను సిఎంకు వివరించారు. కాగా రెండు రోజుల్లో ఇందుకు సమగ్ర సమాచారంతో రావాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్వీకరిస్తాం (మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం మేరకు అదే నెల 16వ తేదీన శాసనసభలో బిసి కులగనుల పైన తీర్మానం చేసినట్లు తెలిపారు. తర్వాత పార్లమెంటు ఎన్నికల కారణంగా కొంత ఆలస్యమైనట్టు వెల్లడించారు. ప్రభుత్వం బిసి కమిషన్ చైర్మన్ సభ్యులను నియమించిందని తెలిపారు. బిసి కమిషన్ దగ్గర మౌలిక వనరులు లేకపోవడంతో ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌కు సమగ్ర సర్వే పనిని అప్పగించామన్నారు. 150 ఇళ్ల ను ఒక గ్రూపింగ్ చేసి పదిమంది ఎన్యూమరేటర్లకు ఒక పరిశీలకుడు లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులు ఈ సర్వే నిర్వహించారని, రాష్ట్రస్థాయిలో సందీప్ కుమార్ సుల్తానియ ,హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి దీనిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారని తెలిపారు. సర్వే కోసం 1రూ.60 కోట్ల ప్రభుత్వం కేటాయించిందని గ్రామాల్లో సర్వే బాగా జరిగిందని హైదరాబాద్ లాంటి నగరాల్లో కొంత ఇబ్బంది ఏర్పడిందని సమావేశంలో చర్చించారు. రాహుల్ గాంధీ ఆలోచన ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కుల గణన పూర్తి చేసిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో దేశంలో అత్యంత పారదర్శకంగా రాజకీయ, సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా మేంఎంతో మాకుఅంత నినాదాన్ని నిజం చేయడానికి ఇంటింటి సమగ్ర కుల సర్వే నిర్వహించినట్లు పొన్నం తెలిపారు. దీనిని కొన్ని ప్రతిపక్ష పార్టీలు అభ్యంతరాలు లేవనెత్తి గోరంతను కొండంత చేస్తూ కుల సర్వేను తప్పుపడుతున్న తరుణంలో బిసి సంఘాలు , మేధావులు , ప్రొఫెసర్ల తో సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కుల గణన ద్వారా సామాజిక న్యాయం చేకూరుస్తూ దేశంలోనే మొదటిసారిగా కుల సర్వేను పారదర్శకంగా నిర్వహించిందని తెలిపారు. సమావేశంలో ఎంపి సురేష్ షెట్కర్ ,ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ , కాంగ్రెస్ సీనియర్ నేత మధుయాస్కీ గౌడ్,మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్,బిసి కమీషన్ చైర్మన్ నిరంజన్ , సభ్యులు రాపోలు జయప్రకాశ్ ,తిరుమలగిరి సురేందర్ ,బాలలక్ష్మి , కార్పొరేషన్ చైర్మన్ లు నూతి శ్రీకాంత్ గౌడ్ , జ్ఞానేశ్వర్, ఈరవత్రి అనిల్, మెట్టు సాయి కుమార్,జైపాల్ , వినయ్ కుమార్, సమావేశంలో పాల్గొన్న బిసి సంఘాల నేతలు ఆర్ కృష్ణయ్య , జాజుల శ్రీనివాస్ గౌడ్ , మాజీ బీసీ కమిషన్ చైర్మన్ వకులా భరణం కృష్ణమూర్తి , మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు ,మురళి మనోహర్, తాడూరి శ్రీనివాస్ , బాలరాజు గౌడ్, దాసు సురేష్ శ్రీనివాస్ పలువురు బీసీ సంఘం నేతలు ,ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## ప్రజల తీర్పు గౌరవిస్తాం : కేజ్రీవాల్ (మొదటి పేజీ తరువాయి)

సాధించిన పర్వేష్ వర్మ మాట్లాడుతూ 'ఇది నా విజయం మాత్రమే కాదు, ఢిల్లీ ప్రజలది. అబద్ధాలతో జరిగిన పోరులో ప్రజలు నిజానికి పట్టంకట్టారు. జిమ్మిక్కులకు బదులు సుపరిపాలనను, మోసానికి బదులు అభివృద్ధిని ఎంచుకున్నారు. నాపై విశ్వాసం ఉంచిన ప్రతి ఓటరుకు కృతజ్ఞతలు' అన్నారు. బిజెపి విజయానికి ప్రధాని మోడీకూడా విశేషంగా కృషి చేశారన్నారు. కేజ్రీవాల్ పరాజయం ఢిల్లీ రాజకీయాలలో కీలక మలుపు కానున్నది. 12 ఏళ్ల ఆప్ పాలనకు బిజెపి చరమగీతం పాడి 26 ఏళ్ల తరువాత హస్తినలో అధికారం చేపట్టనున్నది.

# ప్రజలు మార్పును కోరుకున్నారు

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక

**వాయనాడ్(కేరళ) :** 'ఢిల్లీ ప్రజలు మార్పును కోరుకున్నారు. విసుగు చెందిన ప్రజలు భిన్నమైన తీర్పునిచ్చారు' అని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, వాయనాడ్ ఎంపి ప్రియాంక గాంధి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై వ్యాఖ్యానించారు. జరుగుతున్న పరిణామాలపై ప్రజలు విసుగు చెంది ఉన్నారని, ప్రజలు విశిష్టమైన తీర్పునిచ్చారన్నారు. ఢిల్లీ ప్రజలు జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నారని, అందుకే వారు భిన్నమైన తీర్పును అందించారని అన్నారు. గెలుపొందిన అభ్యర్థులకు ప్రియాంక అభినందనలు తెలిపారు. తమ పార్టీ ప్రజల మన్నన పొందేందుకు ఇంకా తీవ్రంగా కృషి చేయాల్సి ఉందని, ఇకపై ప్రజలకు చేరువగా ఉండి, సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు. ప్రియాంక ప్రస్తుతం కేరళలో మూడు రోజుల పర్యటనలో ఉన్నారు. ఇండియా బ్లాక్‌లో విభేదాలే ఢిల్లీ ఎన్నికలలో కాషాయ పార్టీ విజయానికి కారణమైందని సిపిఐ(ఎం), ఇండియన్ ముస్లిం లీగ్(ఐయుఎంఎల్) పార్టీలు అభిప్రాయం వ్యక్తం చేశాయి. ఈ రెండు పార్టీలు ఇండియా బ్లాక్‌లో భాగస్వాములు. మార్క్సిస్ట్ పార్టీ నేరుగా ఓటమికి కాంగ్రెస్ పార్టీదే బాధ్యత అని విమర్శించగా, ముస్లిం లీగ్ నేరుగా కాంగ్రెస్ పార్టీని ప్రస్తావించనప్పటికీ ఇండియా బ్లాక్‌లో పార్టీలు కలిసికట్టుగా పనిచేసి ఉంటే బిజెపి అధికారంలోకి వచ్చేది కాదన్నది పేర్కొన్నది. కాంగ్రెస్ పార్టీ తక్కిన పార్టీలతో కలిసి పనిచేసినట్టయితే బిజెపిని ఓడించి ఉండేవారని సిపిఐ(ఎం) నాయకుడు టి.పి.రామకృష్ణన్ అన్నారు. కాంగ్రెస్‌నుంచి ఇతర భాగస్వామ్య పార్టీలకు మద్దతు కొరవడిందన్నారు. ఐయుఎంఎల్ నాయకుడు పి.కె.కున్హలి కుట్టి అదే అభిప్రాయం వ్యక్తంచేస్తూ ఇండియా అలియన్స్ ఏకతాటిపై పనిచేస్తే బిజెపిని ఓడించి ఉండేవారన్నారు. ఏ రాష్ట్రంలోనూ బిజెపికి బలమైన ఓటు బ్యాంకు లేదని, ఇతర పార్టీల విభేదాలను అనువుగా మలచుకుని విజయం సాధిస్తోందన్నారు. ఇండియా అలియన్స్ పార్టీలు కలిసికట్టుగా ఉంటే ఫలితాలు మరోలా ఉండేవన్నారు. ఇందుకు ఒకే పార్టీని తప్పు పట్టలేమని, కూటమి భాగస్వాములందరూ ఈ అంశంపై సమీక్షించుకోవాలన్నారు.




## సోలమన్ దీవుల్లో అతిపెద్ద పగడం!



పసిఫిక్ మహాసముద్రానికి నైరుతి దిశలోని ఒక చిన్న దేశమైన సోలమన్ దీవుల్లో అతి పెద్ద పగడాన్ని కనుగొన్నారు. ఆరు అగ్నిపర్వత ద్వీపాలు, దాదాపు 1000 చిన్న ద్వీపాలతో కూడిన ఈ దేశపు తీరంలో కనుగొన్న పగడం ఇప్పటివరకూ బయటపడిన పగడాల్లో అతి పెద్దది. సాధారణంగా పగడాలు పూసల మాదిరి, దాదాపు అదే సైజులు ఉంటాయి. కానీ, సోలమన్ దీవుల తీరంలో లభించిన పగడం పొడవు 32మీటర్లు (105అడుగులు), వెడల్పు 34మీటర్లు (110 అడుగులు), ఎత్తు 6 మీటర్లు (20 అడుగులు). ఇది అంతరిక్షం నుంచి చూడా చూడగలిగేంత పెద్దదిగా... నీలి తిమింగ లం కంటే పొడవుగా ఉందని చెప్తున్నారు. నిజానికి పగడాలు సముద్రపు అడుగుభాగంలో నివసించే చిన్న జంతువుల సమూహాలు. ఈ సమూహంలో ఒకదానిని పాలిప్ అంటారు. కాల్షియం కార్బొనేట్ నుండి ధృఢమైన అస్థిపంజరాలను నిర్మించడానికి కొన్నిరకాల పాలిప్స్ కలిసి ఉంటాయి. కొత్తగా దొరికిన పగడాన్ని దాదాపు ఒక బిలియన్ పగడపు పాలిప్స్ నిర్మించాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. పగడాలు అనేక సముద్ర జాతులకు ఆవాసాలను అందిస్తాయని పగడపు శాస్త్రవేత్త ఎరిక్ బ్రౌన్ పేర్కొన్నారు. అతను ఈ పెద్ద పగడాన్ని కనుగొన్న నేషనల్ జియోగ్రాఫిక్ సొసైటీ బృందంలో సభ్యుడు. పగడపు దిబ్బల పర్యావరణ వ్యవస్థలు సముద్ర విస్తీర్ణంలో కేవలం 0.2 శాతం మాత్రమే ఉంటాయి. అయినప్పటికీ భూమిపై ఉన్న సముద్ర జాతులలో అవి 25 శాతానికి పైగా ఉండడం విశేషం.

## మొసలి తెలివి..



ఇండోనేషియా సముద్రంలో ఒక మొసలి తన ఎరను ట్రాప్ చేయడానికి నీళ్లలో మునిగిపోతున్నట్టు నటించిన వీడియో వైరల్ అయింది. అందులో కనిపిస్తున్న దృశ్యాలను తిలకిస్తే, ఒక పిల్లవాడు నీళ్లలో మునిగిపోతున్నట్టు చేయిని పోలిన ఆకారం కనిపిస్తుంది. నిజానికి మొసలి తన ముందు పాదాలను నీటి నుంచి బయటకుతీసి, ఆ విధంగా పిల్లవాడు మునిగిపోతున్నట్టు కనిపించేలా ఒక దృశ్యాన్ని ఆవిష్కరించింది. ఇది నిజమనుకొని ఎవరైనా నీళ్లలోకి దూకిన వెంటనే, ఆహారంగా చేసుకోవాలన్నది ఆ మొసలి ఆంతర్యంగా కనిపిస్తున్నది. జంతువులు తరచు వేట కోసం వింత పద్ధతులను అవలంబిస్తాయి. కొన్ని సందర్భాల్లో ఇవి ఆశ్చర్యకరంగా ఉంటాయి. కొన్ని జంతువులు తమ చాకచక్యంతో ఎరను మోసగించగా, కొన్ని తమ శారీరక సామర్థ్యాలను ఉపయోగించుకుంటాయి. అయితే, ఈ వీడియోలో మాదిరి మొసళ్లు ఒక పిల్లవాడు మునిగిపోతున్నట్టు కనిపించేలా నటించడం గతంలో ఎవరూ చూడలేదనే చెప్పాలి. అయితే, ఈ వీడియోను ఎవరు, ఎక్కడ తీశారన్న వివరాలు లేవు. ఇది గ్రాఫిక్ సృష్టి కావచ్చన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

## భయపెట్టిన ఎలిగేటర్ దొరికింది..



ఫ్లోరిడావాసులను భయపెట్టి, కొంతకాలంగా నిద్రకు దూరం చేసిన ఎలిగేటర్ (చిన్నతల గల పెద్ద మొసలి) ఎట్టకేలకు దొరికింది. 1980 దశకంలో వచ్చిన 'ఎలిగేటర్' సినిమా మాదిరి, ఒక తుపాను కాలువలో ఉన్న ఈ ఎలిగేటర్ పొడవు పదిన్నర అడుగులు. కల్వర్టులో ఎలిగేటర్ ఉన్న విషయాన్ని స్థానికులు చెప్తుండగా, అగ్నిమాపక సిబ్బంది దానిని పట్టుకోవడానికి శతవిధాల ప్రయత్నించారు. కానీ, ఇరుకైన ప్రాంతంలో దాని దగ్గరకు వెళ్లడం సాధ్యం కాలేదు. ఈలోగా, ఆహారం కోసం జంతువులు, మనుషులపై అది దాడిచేసే ప్రమాదం ఉందన్న వార్తలు చక్కర్లు కొట్టడంతో ఫ్లోరిడా నగరవాసులు ఆందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది అతి కష్టంమీద భారీ కల్వర్టు మూతను తీసి, ఎలిగేటర్‌ను రక్షించారు. దీనితో కథ సుఖాంతమైంది.

## జూలో జంతువులకు ఐస్‌క్రీమ్!



రియో డి జెనీరో (బ్రెజిల్) జంతుప్రదర్శనశాలలో జంతువు లు ఐస్‌క్రీమ్ తింటున్నాయి. శీతల పానీయాలు తాగుతున్నా యి. వీటిని చూడడానికి వచ్చిన సందర్శకులు కూడా ఉత్సాహంతో వాటిని కొనిపెడుతున్నారు. బ్రెజిల్‌లో ఇప్పటికే వేసవికాలం మొదలైంది. సగటున 40 డిగ్రీల సెల్సియస్ (104 ఫారెన్హీట్) ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఫలితంగా రియో జూపార్క్‌లోని జంతువులు, ముఖ్యంగా ఎలుగుబంటి, చిరుత, తోడేలు, కోతులు వంటి ప్రాణులు ఎండకు అల్లాడిపోతున్నాయి. కొన్ని ఎయిర్ కూలర్లను ఉంచారు. ఎప్పటికప్పుడు నీరు చల్లుతున్నారు. పరిస్థితిని గమనించిన అధికారులు వాటికి ఆహారంతోపాటు చల్లని పదార్థాలు కూడా ఇవ్వాలని నిర్ణయించారు. ఆ విధంగా జంతువులకు ఉపశమనం లభిస్తే మంచిదే.

**బిఎస్ఎస్ మైత్రేయి**

# బిజెపి నిరీక్షణ ఫలించింది

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ ఊపిరి పీల్చుకుంది. 27 సంవత్సరాల అలవికా ని నిరీక్షణకు ఢిల్లీ ఓటర్లు తెరదించారు – కేంద్రపాలిత ప్రాంతం ఢిల్లీ (నేషనల్ క్యాపిటల్ రీజియన్) పాలనా పగ్గాలను ప్రధాని నరేంద్రమోదీ చేతికి అందించారు. ఆయన అభిమాన పాత్రుడెవరో ముఖ్యమంత్రి అవుతారు. ఎందుకంటే బిజెపి ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండా ఎన్నికల క్షేత్రంలో దిగింది. మోదీయే బిజెపి ముఖంగా ఎన్నికల ప్రచారం జరిగింది. దేశాన్ని పాలిస్తున్న రాజు దేశమంతటా స్వారీచేసి ఇంటిముందు బోర్లా పడినట్లు బిజెపి 11ఏళ్లుగా దేశాన్ని ఏలుతూ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోతూ వచ్చింది. 70 సీట్లుగల అసెంబ్లీలో బిజెపి 2015 ఎన్నికల్లో 3, ఆ తదుపరి 2020 ఎన్నికల్లో 8 సీట్లకే పరిమితమైంది. కాని పార్లమెంటు ఎన్నికల్లో 7సీట్లూ గెలుస్తూ వచ్చింది. అందువల్ల తాజా విజయం బిజెపికి నిజంగా తీయని అనుభూతి. పార్లమెంటు ఎన్నికల్లో కనీస మెజారిటీకి నోచుకోక మిత్రపక్షాలపై ఆధారపడి మూడవసారి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నరేంద్రమోదీని వరుసగా హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి విజయాలు పార్టీలో, వెలుపల ప్రజల దృష్టిలో బలసంపన్నుణ్ణి చేశాయి. అయితే ఢిల్లీ ఫలితాలు ప్రధాని సహా ఆ పార్టీ నాయకులు గొప్పలకు పోతున్నంత ఘనంగా లేవు. ఆమ్ ఆద్మీ పార్టీ పాలనపై, వ్యక్తిగతంగా దాని నేత కేజ్రీవాల్‌పై బిజెపి వారెన్ని దూషణలు చేసినా, అవినీతి పరుడిగా నిందించినా ఢిల్లీ ఓటర్లు ఆప్‌కు లోగడ రెండు ఎన్నికల్లో ఇచ్చినట్లు బిజెపికి ఏకపక్ష తీర్పు ఇవ్వకపోవటం గమనార్హం. 2010–12లో కాంగ్రెస్ ప్రభుత్వాని కి వ్యతిరేకంగా అన్నా హజారే ను ముందుపెట్టి పలు శక్తులు సాగించిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో నాయకత్వాన్ని సొంతం చేసుకున్న అరవింద్ కేజ్రీవాల్ ఆప్ పార్టీ ప్రకటించి 2013 అసెంబ్లీ ఎన్నికల్లో 28సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ మద్దతుతో తొలిసారి ఢిల్లీ ముఖ్యమంత్రి అయినారు. జిమ్మిక్కులు తప్ప ఏ సిద్ధాంతంలేని కేజ్రీవాల్ శాసనసభను రద్దు చేసి 2015లో ఎన్నికలకు వెళ్లగా ఓటర్లు ఏకంగా 67 సీట్లు కట్టబెట్టారు. తిరిగి 2020 ఎన్నికల్లో 62సీట్లతో అధికారం నిలుపుకున్నాడు. ఆ విజయాలతో పోల్చితే ప్రస్తుత బిజెపి విజయం ఏపాటి? బిజెపి 48 సీట్లు గెలుపొందగా, ఆప్ 22 సీట్లు దక్కాయి.ఇకపై అన్ని రాష్ట్రాల్లో విజయం బిజెపిదేనని విర్రవీగటం నేలవిడిచి సాము చేయటమే అవుతుంది. పోలైన ఓట్లలో బిజెపికి 45.88శాతం, ఆప్‌కు 43.62శాతం లభించాయి. ఓట్ల శాతంలో తేడా కేవలం 2.26శాతం. ఆప్ బలమైన ప్రతిపక్షంగా వ్యవహరించే అవకాశాన్ని ఓటర్లు ఇచ్చారు. కాని కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్‌లను ఓడించారు. ముఖ్యమంత్రి ఆతిశీని గెలిపించారు. కాంగ్రెస్ ఈ దశాబ్దకాలంలో ఢిల్లీలో కోలుకోలేదు. ఈ ఎన్నికల్లో 6.36 శాతం ఓట్లు లభించాయి. 2020 ఎన్నికలతో పోల్చితే సుమారు 2శాతం ఎక్కువ – అంతే.

ఏ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆప్, కాంగ్రెస్ కలిసి పోటీ చేయలేదు. అవి రాజకీయ ప్రత్యర్థులని విస్మరించరాదు. కాంగ్రెస్ వ్యతిరేకత లోనుంచి ఆప్ పుట్టింది. హిందీ బెల్టులోని ఇతర రాష్ట్రాల్లోకూడా కాంగ్రెస్‌ను దెబ్బకొట్టి ఎదగటమే ఆప్ వ్యూహం. అయితే గత సంవత్సరం లోక్‌సభ ఎన్నికలకు ముందు బిజెపిపై ఐక్యంగా పోరాడే వేదికగా ఏర్పడిన ఇండియా కూటమిలో కాంగ్రెస్, ఆప్ భాగస్వాములుగా ఉన్నప్పటికీ ఈ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థులుగానే పోటీ చేశాయి. గతేడాది లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో సీట్లు సర్దుబాటు చేసుకున్నా రెండు పార్టీల మధ్య ఓట్లు బదిలీ కాలేదు.

ఇండియా కూటమి ఉన్నట్టా, లేనట్టా; ఉంటుందా, ఊడుతుందా అనే ప్రశ్నలు చర్చనీయాంశంగా ఉన్నాయి. ఢిల్లీ ఎన్నికలకు ముందే కూటమికి కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీ వ్యతిరేకించాయి. ఆప్ అయితే ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్‌ను బహిష్కరించాలంది. ఢిల్లీ ఎన్నికల్లో ఎస్‌పి, తృణమూల్, ఎన్‌సిపిలు ఆప్‌కు అనుకూలంగా ప్రచారంలో పాల్గొన్నాయి. బిజెపికి వ్యతిరేకంగా ఐక్యంగా పనిచేసే లక్ష్యంకన్నా కాంగ్రెస్‌ను ఎదగనీయకుండా తాము బలపడాలన్న ప్రాంతీయ పార్టీల ఆకాంక్ష, తాను బలం పుంజుకునేందుకు కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాల మధ్య ఘర్షణ ఉంది. కాబట్టి ఇండియా కూటమి భవితవ్యం త్వరలో చర్చనీయాంశం కావచ్చు.

ప్రజాపక్షం
09-02-2025, ఆదివారం

# అణు ప్రమాద పరిహార బాధ్యతకు తూట్లు

**పి.సుధీర్**

అణుశక్తి ఇంధన చట్టాన్ని, సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డేమేజ్ చట్టం, 2010(సిఎల్ఎన్‌డిఎ)ను సవరించాలని ప్రభుత్వం తలపెట్టినట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తమ బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. మన్మోహన్‌సింగ్ 2008లో ప్రతిష్టకుపోయి అమెరికాతో అణుశక్తి ఇంధన సహకారానికి ఒప్పందం చేసుకున్నారు. మన అణుశక్తిరంగంలో అమెరికన్ ప్రైవేటు కార్పొరేట్‌ల ప్రవేశానికి అది వీలు కల్పిస్తున్నది. అయితే అవి నెలకొల్పే అణు విద్యుచ్ఛక్తి వసతుల్లో దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదం సంభవించి మానవ ప్రాణాలకు, పర్యావరణకు హాని జరిగిన సందర్భంలో సంబంధిత కంపెనీయే పరిహారం చెల్లించాలని ఆదేశించిన – పైన పేర్కొన్న చట్టాన్ని 2010లో పార్లమెంటు ఆమోదించింది. అందుకు అమెరికన్ కార్పొరేట్లు అంగీకరించలేదు. దాంతో అమెరికాతో అణుశక్తి సహకార ఒప్పందం ఇంతవరకు అమలులోకి రాలేదు. తమకు అనుకూలంగా నష్టపరిహార చట్టాన్ని సవరించి, అణు ఒప్పందం అమలులోకి తేవాలని అమెరికా ప్రభుత్వం కొంతకాలంగా మోదీ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నది. ఆ ఒత్తిడికి ప్రభుత్వం తలొగ్గినట్లు ఆర్థికమంత్రి ప్రకటన సూచనప్రాయంగా తెలియజేస్తోంది. అణు ఇంధన ఉత్పత్తిలోకి ప్రైవేటురంగాన్ని అనుమతించాలనేదే చెడ్డ ఆలోచన. ప్రభుత్వరంగంలో లేదా ప్రైవేటురంగంలో అయినా సరే అణు ప్రమాదానికి గురైనప్పు డు చెల్లించే పరిహారాన్ని నీరుగార్చే విధంగా సిఎల్ఎన్‌డిఎ చట్టాన్ని సవరించే ఆలోచన మరింత ప్రమాదకరం.



భారతదేశంలో నెలకొల్పే నిమిత్తం విదేశీ అణుశక్తి రియాక్టర్లు సరఫరా చేయాలంటే అటువంటి వాణిజ్యానికి సివిల్ న్యూక్లియర్ లయబిలిటీ చట్టం అవసరం. అణుశక్తి ఒప్పందంలో భాగంగా అమెరికా నుంచి 10వేల మెగావాట్‌ల అణు రియాక్టర్లు కొనుగోలుకు నాటి యుపిఎ ప్రభుత్వం అమెరికాకు హామీ ఇచ్చింది. అయితే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టినపుడు, అణుశక్తి ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు సత్వరం పరిహారం చెల్లించే నిమిత్తం తగు నిబంధనలు చట్టంలో ఉండాలని ప్రతిపక్ష సభ్యులనుండి గట్టిగా డిమాండ్ వచ్చింది. ఇందుకుగాను రియాక్టర్ ఆపరేటర్‌లపై మాత్రమే గాక రియాక్టర్లు, సంబంధిత సామాగ్రి సరఫరా చేసిన వారిపై కూడా పరిహార చెల్లింపు బాధ్యత మోపుతూ చట్టంలో 17(బి) క్లాజును చేర్చటం జరిగింది. ఆ క్లాజును సవరించటం ద్వార చట్టాన్ని నీరుగార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. కాని ముఖ్యంగా వామపక్ష ఎంపిల ప్రతిఘటనతో ప్రభుత్వం వెనక్కు తగ్గింది.

ఆ సమయంలో ప్రభుత్వంపై ప్రజల ఒత్తిడికి సుప్రీంకోర్టు తీర్పు ఒకటి దోహదం చేసింది. భోపాల్ గ్యాస్ లీకేజి విషయం గుర్తు చేసుకోవాలి. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ శివారులో క్రిమిసంహారక మందులు తయారుచేసే యూనియన్ కార్బయిడ్ ఫ్యాక్టరీలో 1984 డిసెంబర్ 2 అర్ధరాత్రి దట్టమైన పొగ రూపంలో విషవాయువు లీక్ అయిన ప్రమాదంలో మూడురోజుల్లో 10వేలమంది చనిపోయినట్లు అంచనా. ఆ అమెరికన్ బహుళజాతి కంపెనీ నుంచి న్యాయమైన పరిహారం సాధించటం సాధ్యం కాలేదు. 4 దశాబ్దాలు గడిచినా బాధిత కుటుంబాలకు న్యాయం జరగలేదు. ఆ శిథిలాలను ఆ గ్రౌండ్‌నుంచి తొలగించటం కూడా సాధ్యం కాలేదు. ఒక పారిశ్రామిక డంప్‌యార్డ్‌కు శిథిలాలను తరలించేందుకు కొద్దిమాసాల క్రితం జరిగిన ప్రయత్నాలను స్థానికులు అడ్డుకున్నారు. అదలా ఉంచితే యూనియన్ కార్బయిడ్ నుంచి బాధితులకు హెచ్చు పరిహారం ఆదేశించాలన్న ప్రభుత్వ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరిస్తూ, చట్టం ప్రకారం అటువంటి డిమాండ్ చేసేందుకు ప్రాతిపదికలేదని చెప్పింది. సిఎల్ఎన్‌డిఎ ఆమోదించిన కొద్దినెలల తర్వాత – 2011 మార్చినెలలో — జపాన్‌లోని ఫుకుషిమలో అణు ప్రమాదం జరిగింది. దాంతో అణు పరిహార చట్టంలో కఠినమైన నిబంధనల అవసరం బలంగా ముందుకు వచ్చింది. 17(బి) వంటి నిర్దిష్టమైన నిబంధనలు లేకపోతే అణుశక్తి పరికరాలు సరఫరా చేసే విదేశీ కంపెనీలనుంచి, ఏదైనా విపత్తు సమయంలో పరిహారం వసూలు చేయటం సాధ్యం కాదని స్పష్టమైంది.

సిఎల్ఎన్‌డిఎని పార్లమెంటు ఆమోదించాక, న్యూక్లియర్ రియాక్టర్లు తయారు చేసే బహుళజాతి కంపెనీలు, ముఖ్యంగా అమెరికా కంపెనీలు అణుశక్తి రియాక్టర్లు విక్రయించటానికి, ఆ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు తిరస్కరించాయి. సరఫరాదారులనుంచి పరిహారం వసూలు చేయటం అంతర్జాతీయ వ్యాపార సూత్రాలకు, కాంట్రాక్టు బాధ్యతలకు వ్యతిరేకమని అవి వాదించాయి. మనదేశంలో విదేశీ అణుశక్తి రియాక్టర్లు నెలకొల్పటానికి, ఆపరేట్ చేయటానికి విదేశీ కంపెనీల వైఖరి ప్రధాన అవరోధమైంది.

సరఫరాదారుల లయబిలిటీని అధిగమించటానికి, వమ్ము చేయటానికి ఉత్తరోత్తర సంవత్సరాల్లో అనేక ప్రయత్నాలు జరిగాయి. 2015లో అధ్యక్షుడు ఒబామా భారతదేశ సందర్శన సందర్భంలో మోదీ ప్రభుత్వం సిఎల్ఎన్‌డిఎ సవరించబోమన్న వైఖరిని స్పష్టం చేసింది. పరిహారం చెల్లింపు కోసం సమగ్రమైన రిస్క్ మేనేజిమెంట్ స్కీమ్‌లో భాగంగా ఇండియా న్యూక్లియర్ ఇన్సూరెన్స్ పూల్ ఏర్పాటును సూచించింది. అది కూడా విదేశీ అణుపరికరాల సరఫరాదారుల నుంచి సానుకూల స్పందన రాబట్టలేదు.

సిఎల్ఎన్‌డి చట్టం సవరణకోసం అమెరికా ప్రభుత్వం భారత ప్రభుత్వంపై నిరంతరంగా ఒత్తిడి తెస్తోంది. మోదీ ప్రభుత్వం ఎట్టకేలకు ఆ ఒత్తిడికి తలొగ్గినట్లు కనిపిస్తోంది. అణు రియాక్టర్ల నిర్మాణం, ఆపరేషన్ కోసం ప్రైవేటురంగాన్ని అనుమతించటం అణు ప్రమాదాల రిస్క్ పెంచుతుంది. మన దేశంలో ఇప్పటివరకు అణు విద్యుచ్ఛక్తి ప్రభుత్వరంగంలో ఉంది. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మంచి భద్రత రికార్డుతో అణు రియాక్టర్లు నడుపుతున్నది. అణుశక్తి కర్మాగారాలు ప్రైవేటురంగంలోకి వస్తే, సిఎల్ఎన్‌డిఎను సవరించిన మీదట అతివ్యయంతో కూడిన విదేశీ అణుశక్తి రియాక్టర్లు మన దేశంలోకి వస్తాయి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే దాని రిస్కును ఆపరేటర్లు భరించాల్సి ఉంటుంది. అంతిమంగా, భారత రాజ్యం బాధ్యత అవుతుంది, విదేశీ సరఫరాదారులు ఏ బాధ్యతలేకుండా తప్పించుకుంటారు.

సిఎల్ఎన్‌డి బిల్లును పార్లమెంటు చర్చించినపుడు, సప్లయిర్స్ లయబిలిటీని చేర్చటాన్ని బిజెపి సమర్థించింది. ఆ పార్టీ ప్రభుత్వం ఈ రోజున ఆ సమర్థననుండి వెనక్కి వెళుతున్నది. అలా చేయటం ద్వారా ''భారతీయుల ప్రాణాలకు విలువలేదనే'' సందేశాన్ని అది పంపుతున్నది.

(ఐపిఎ సర్వీస్)

# రిజర్వేషన్ల బంతి బిజెపి కోర్టులో...

**రాజధాని సందడి**
**– బొమ్మగాని కిరణ్‌కుమార్**

ఫిబ్రవరి 4వ తేదీన రాష్ట్ర శాసనసభ ప్రత్యేక సమావేశంలో కులగణన సర్వే సారాంశాన్ని, ఎస్‌సి వర్గీకరణపై ఏక సభ్య కమిషన్ నివేదికను సభ ముందుంచారు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి. బిసి రిజర్వేషన్‌ల పెంపు, ఎస్‌సి వర్గీకరణకు సంబంధించి ఎన్నో దశాబ్దాల ఉద్యమాలు, పోరాటాలు, ప్రజల ఆకాంక్షల నేపథ్యంలో ఇదొక కీలక మలుపు. ఈ రెండు అంశాలు ఆచరణలోకి తీసుకురాగలిగితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చరిత్ర పుటల్లో నిలబడుతుంది. కుల గణన చేపట్టాలని భారత్ జోడో యాత్ర సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విస్తృతం ప్రచారం చేశారు. కుల గణన అనేది సామాజిక ఎక్స్ రే అని భాష్యం కూడా చెప్పారు. అది ప్రజల్లోకి చొచ్చుకుపోయింది. తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో, పార్లమెంటు ఎన్నికల్లో స్థానాలు కాంగ్రెస్ పార్టీకి పెరిగేందుకు అది కూడా ఒక కారణమే.

2023 నవంబర్ 10న శాసనసభ ఎన్నికల నామినేషన్‌లకు చివరిరోజు. నాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ద్వితీయ స్థానంగా పోటీ చేస్తున్న కామారెడ్డి నియోజకవర్గం నుంచి ఆయనతో ప్రత్యక్షంగా తలపడేందుకు నాటి టిపిసిసి ఛీఫ్ రేవంత్‌రెడ్డి ఆ స్థానానికి అదే రోజు నామినేషన్ వేశారు. ఆ వెంటనే కామారెడ్డిలో భారీ సభ జరిగింది. దానికి దేశవ్యాప్తంగా బిసి నేతగా గుర్తింపు పొందిన కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో పాటు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, టిజెఎస్ అధ్యక్షులు కోదండరామ్‌లు హాజరయ్యారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన కామారెడ్డి సభావేదిక నుంచే కాంగ్రెస్ పార్టీ బిసి డిక్లరేషన్‌ను ప్రకటించింది. తాము అధికారంలోకి వచ్చాక బిసిలకు ఏమి చేస్తామనే హామీలను అందులో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే కుల గణన, బిసి కమిషన్ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్‌లు 22 నుంచి 42 శాతానికి పెంచుతామని చెప్పింది కాంగ్రెస్. దీంతో బిసిలకు పంచాయతీలు, మున్సిపాలిటీలలో కొత్తగా 23, 973 మందికి రాజకీయ ప్రాతినిధ్యం కలుగుతుందని, జ్యోతిబాపూలే పేరుతో బిసి సబ్‌ప్లాన్ ఏర్పాటు చేస్తామని, బిసిలకు ఐదేళ్ళలో లక్ష కోట్లు కేటాయిస్తామనే వరాల జల్లు కురిపించింది. అంతకుముందు ఆగస్టులో చేవెళ్ళలో జరిగిన ఎస్‌సి డిక్లరేషన్ సభలో ఎస్‌సిల వర్గీకరణ చేస్తామని ప్రకటించింది. ఈ రెండిటికి కూడా కులగణనే కీలకం. ఆ రెండు హామీలను నిలబెట్టుకునేందుకు రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి, పూర్తి చేసింది. కులగణనతో సమాంతరంగా మంత్రివర్గ ఉపసంఘాలు, బిసిల రిజర్వేషన్ పెంపునకు డెడికేటెడ్ కమిషన్, ఎస్‌సి వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అఖ్తర్ కమిషన్‌ను నియమించింది.

కుల సర్వే వివరాలు, ఎస్‌సి వర్గీకరణ నివేదికను ఫిబ్రవరి 4న మంత్రివర్గం ఆమోదించి, అదే రోజు శాసనసభ ముందుంచింది. అయితే, బిసి జనాభా లెక్కలపైనే కొంత వివాదం తలెత్తింది. టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన 2014 లో ఒకే ఒక్క రోజులో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో బిసిల జనాభా 52 శాతం ఉంటే, తాజా కులగణన సర్వేలో కేవలం 46 శాతమే ఉందని బిసి సంఘాలు, నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నాటి టిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే సాధికారమైనది కాదని, మంత్రివర్గ ఆమోదం కూడా లేదని, అయినప్పటికీ, అందులో ప్రకటించిన బిసి జనాభా 52 శాతంలో బిసి(ఇ) కింద ఉన్న ముస్లిం మైనారిటీకి చెందిన కులవృత్తుల వారి జనాభా కూడా కలిపే ఉందని శాసనసభలో వివరణ ఇచ్చారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. తమ ప్రభుత్వం ప్రకటించిన కులగణన సర్వేలో బిసిల జనాభా నాటికంటే పెరిగిందని, కేవలం బిసిలు 46.25 శాతం ఉండగా, ముస్లిం బిసిలు 10.08శాతం కలిపితే వచ్చిన 56.33శాతం బిసిల మొత్తం జనాభా, నాటి కంటే ఐదు ఎక్కువేనని ఉద్ఘాటించారు. అటు స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్ల పెంపు, ఇటు ఎస్‌సి వర్గీకరణకు తదుపరి చర్యలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమని శాసనసభ వేదికగా హామీ ఇచ్చారు. బిసిల జనాభా తగ్గిందనే వాదన నుంచి లబ్ధి పొందేందుకు ప్రయత్నించిన బిఆర్ఎస్, తాము అధికారంలో ఉండగా చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో బిసిల వివరాలను కులాల వారీగా ప్రకటించలేదు. ముస్లిం బిసిలను కూడా అందులో కలిపిన విషయాన్ని చెప్పడం లేదు. గతంలో మాదిరిగా బిసి(ఇ)లోని ముస్లింలను బిసిల జనాభాలో కలపకుండా ప్రత్యేకం గా ముస్లిం మైనారిటీలలో బిసిలుగా 10శాతాన్ని ప్రత్యేకించి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చూపింది. ఇది మైనారిటీ ఓటర్లను తమవైపు పదిలపరుచుకునే రాజకీయ ఎత్తుగడే. బిజెపి సైతం పరిస్థితిని తమకు అనుకూలంగా తిప్పుకునేందుకు హిందూ బిసిలు, ముస్లిం బిసిలని చూపడమేమిటని ప్రశ్నిస్తున్నది

**బిసి సంఘాల సందేహాలు**

కుల సర్వే వివరాలపై బిసి సంఘాల నుంచి వెన్వెంటనే విమర్శలు వచ్చాయి. గతం కంటే సంఖ్య తగ్గిందనే వాదనకు ముఖ్యమంత్రి జవాబుతో కొంత ఉపశమనం కలిగినప్పటికీ, అనుమానాలు పోలేదు. ముస్లిం బిసిలను కలపకుండానే బిసి జనాభా 50 శాతాన్ని మించుతుందని బిసి సంఘాల వాదన. అందుకు బ్రిటీష్ కాలంలో 1931లో చివరి సారిగా చేసిన కుల గణన అంకెలే సాక్ష్యం అంటున్నాయి. అలాగే, కుల సర్వేలో 3,56,323 కుటంబాలను సర్వే చేయకపోవడంతో బిసి జనాభా శాతం ఉండాల్సిన దానికంటే తక్కువ కనిపించిందని ఆరోపణ.చాలా మంది తమ ఇళ్ళకు సర్వే బృందాలు రాలేదని కూడా చెబుతున్నాయి. లెక్కల్లో లేని కుటుంబాలు అధికంగా జిహెచ్‌ఎంసి, ఇతర నగర ప్రాంతాలలో ఉన్నాయని ప్రభుత్వమే తెలిపింది. ఈ నేపథ్యంలో జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తికి రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ ఫిబ్రవరి 7న ఒక లేఖ రాశారు. అందులో బిసి కమిషన్ తరుపున కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. లోతుగా సర్వే నిర్వహించడంలో జిహెచ్‌ఎంసి గట్టిగా వ్యవహరించని కారణంగా జనాభాలో బిసి ల శాతం చాలా తగ్గిపోయిందని, దీనికి గల కారణాలపై జిహెచ్‌ఎంసి వివరణ ఇవ్వాలని కూడా కోరింది. ఈ వ్యాఖ్యలు కూడా బిసి సంఘాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు ఊతమిచ్చినట్లయింది.



దీనిని అధిగమించాలంటే రాష్ట్ర ప్రభుత్వం మరింత పారదర్శకంగా వ్యవహరించాల్సిందే. శాసనసభలో కుల వివరాలను స్థూలంగా చెప్పారు తప్పితే, సమగ్రంగా లేవు. ఇదే విషయాన్ని ఎంఐఎం పక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఓవైసీ, సిపిఐ శాసనసభా పక్ష నాయకుడు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు కూడా. మొత్తం కుల గణన సర్వే వివరాలను సభ ముందుంచాలని ఓవైసీ డిమాండ్ చేసారు. అలాగే ఆ వివరాలను గ్రామాల వారీగా గ్రామ సభలో ఉంచి, మార్పులు చేర్పులు చేయాలని కూనంనేని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా, జిల్లాలు, మండలాలు, నియోజకవర్గాల వారీగా కుల సర్వే వివరాలు వెల్లడించడం ద్వారా పారదర్శకత వస్తుందని బిసి సంఘాలు చెబుతున్నాయి. వ్యక్తిగత వివరాలు విడిచి, కులాల వారీగా వివరాలు వెల్లడించడం ద్వారా ప్రభుత్వ చిత్తశుద్ధికి అదనపు బలం చేకూరుతుంది. సర్వేలో వివరాలు నమోదు కాని వారికి ప్రత్యేక డ్రైవ్ కింద మరో అవకాశం కల్పించడం లేదా బిహార్‌లో రీసర్వే చేయాలనే డిమాండ్‌లపై ఆచరణీయ నిర్ణయం తీసుకుంటే ప్రభుత్వానికి మేలు.

ఇక ఎస్‌సి వర్గీకరణపై మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న మందకృష్ణమాదిగ శాసనసభలో వర్గీకరణపై ప్రభుత్వం చేసిన ప్రకటనను స్వాగతిస్తూనే, మాదిగలు, ఉపకులాల ఉన్న కేటగిరికి జనాభా కంటే తక్కువ శాతం కేటాయించడాన్ని ప్రశ్నించారు. ఇక్కడ సుప్రీం కోర్టు కూడా వర్గీకరణకు సానుకూల తీర్పు ఇస్తూ, క్రీమీలేయర్‌పై సుముఖత వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం దానిని తిరస్కరించింది. ఇప్పుడు సుప్రీం కోర్టు తీర్పుపై అప్పీలు ఉన్నప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం వర్గీకరణపై వడివడిగా ముందుకే అడుగులు వేస్తోంది.

**కేంద్రం ఎలా స్పందిస్తుందో?**

ఇప్పుడు బిసి రిజర్వేషన్‌లను 42 శాతానికి, ఎస్‌సి, ఎస్‌టిలకు కూడా జనాభాకు అనుగుణంగా పెంచితే, మొత్తం రిజర్వేషన్‌లు దాదాపు 70 శాతానికి చేరుతాయి. 1992లో సుప్రీం కోర్టు ఇందిరా సహానీ కేసులో రిజర్వేషన్‌లు 50 శాతం పరిమితి దాటొద్దని తీర్పునిచ్చింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తాజా నిర్ణయాలతో రిజర్వేషన్‌ల పరిమితి 50 శాతం దాటుతోంది. అయితే, ఇది పెద్ద సమస్యేమి కాదంటున్నారు హైకోర్టు మాజీ న్యాయమూర్తి, జాతీయ బిసి కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య. తమిళనాడులో రిజర్వేషన్‌లు 50శాతం పరిమితి దాటి 69 శాతంగా ఉందని, దీనికి ఇందిరా సహానీ కేసులో తీర్పు వచ్చిన తరువాతనే తమిళ ప్రజల ఉద్యమాలకు తలొగ్గి కేంద్రం 1994లో తొమ్మిదవ షెడ్యూలులో రాజ్యాంగ సవరణ ద్వారా రక్షణ కల్పించిందని చెబుతున్నారు. అదే బాటలో మన రాష్ట్రం కూడా రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల అమలులో భాగంగా ఆర్టికల్ 31 సి వెలుతురులో శాసనసభలోనే రిజర్వేషన్‌ల పెంపు చట్టం చేసి, రాష్ట్రపతి ఆమోదం కోసం పంపితే సరిపోతుందని సాధికారంగా అంటున్నారు. త్వరలోనే కులగణనకు సంబంధించి చట్టబద్ధత కల్పిస్తామని ఢిల్లీలో సిఎం సైతం వెల్లడించారు. ఆ చట్టం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుకూలంగా ఉంటేనే రాష్ట్రపతి సంతకం కోసం దానిని పంపుతుంది. అంటే రాష్ట్ర రిజర్వేషన్‌ల పెంపుదల బంతి బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కోర్టులో ఉన్నట్లే. అసలు బిసి రిజర్వేషన్‌లు పెంచకపోవడానికి కులగణన లేకపోవడం ప్రధాన కారణం. చివరి సారిగా 1931లో బ్రిటీష్ హయాంలో చేసిన జనగణనలోనే చివరిసారిగా కులాల వారీగా వివరాలు ఉన్నాయి. వాటి ఆధారంగానే 1952లో కాకా కాలేకర్ నేతృత్వంలోని కమిషన్, 1978లో వేసిన మండల్ కమిషన్ బిసి రిజర్వేషన్‌ల శాతాన్ని ప్రతిపాదించాయి. 2011లో యుపిఎ హయాంలో జనగణనతో పాటు కుల గణన కూడా చేశారు. వివరాలు సమగ్రంగా లేవని కులాల వారీ వివరాలను వెల్లడించలేదు. 2021లో దవ వర్ష జనగణన జరగాల్సి ఉన్నా, బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కులగణన తెరపైకి వస్తుందనే ఆ ప్రక్రియను తొలుత కోవిడ్ పేరుతో ఆ తరువాత ఏదో ఒక సాకుతో వాయిదా వేస్తూ వస్తుందని ఆరోపణ. జనగణనతోనే కులగణన, రిజర్వేషన్‌ల పెంపు, చట్టసభల్లో మహిళా రిజర్వేషన్‌లు, లోక్‌సభ, శాసనసభ స్థానాల పునర్విభజన ముడిపడి ఉన్నాయి. కానీ, కుల గణన చేపట్టడం బిజెపికి సుతరామూ ఇష్టం లేదు. మత ఆధారిత రాజకీయాలకు కుల గణన బ్రేకులు వేస్తుందనే భయం. జనగణనకు రూ.12వేల కోట్లు అవసరమైనప్పటికీ, వారం క్రితం ప్రతిపాదించిన 2025–26 కేంద్ర బడ్జెట్‌లో కేవలం రూ.574 కోట్లు కేటాయించడంతో దశాబ్ది జనగణన నిర్వహణపై సందేహాలు ముప్పిరిగొన్నాయి.

# కాంగ్రెస్ తీరుపై 'ఇండియా' కూటమిలో అసంతృప్తి

ప్రతిపక్షం ఐక్యంగా ఉంటే ఫలితాలు వేరుగా ఉండేవి

ఎనిమిది రాష్ట్రాలకే ప్రతిపక్ష ప్రభుత్వాలు పరిమితం





**న్యూఢిల్లీ :** ఢిల్లీలో ఆమ్ ఆద్మీపార్టీ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో దేశంలో 'ఇండియా' కూటమి పాలక ప్రభుత్వాలు ఎనిమిది రాష్ట్రాలకే పరిమితమయ్యాయి. కాంగ్రెస్ తీరుపై వామపక్షాలు సహా కూటమిలో పలు పార్టీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. సిపిఐ(ఎం) సీనియర్ నాయకుడు టి.పి.రామకృష్ణన్ మాట్లాడుతూ, ''ఇండియా'' కూటమి సమర్థవంతంగా పనిచేసేందుకు కాంగ్రెస్‌పార్టీ సరైన సహకారం అందించడంలేదని విమర్శించారు. కూటమి ని సమైక్యంగా ఉంచేందుకు కాంగ్రెస్ తన బాధ్యతలు సరిగ్గా నిర్వహించడంలేదని విమర్శించారు. ఐయుఎంఎల్ పార్టీ నేరుగా కాంగ్రెస్‌పార్టీపై విమర్శలు గుప్పించింది. ఐయుఎంఎల్ సీనియర్ నాయకుడు పి.కె.కున్హాల్‌కుట్టి మాట్లాడుతూ, 'ఇండియా' కూటమిలో పార్టీలు సమైక్యంగా ఉండి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేదికాదని అ న్నారు. కూటమిలో ప్రతిపార్టీ ఐక్యతకు కట్టుబి ఉండి ఉంటే ఈ ఫలితాలు వేరుగా ఉండేవన్నారు. కాంగ్రెస్ ఒక్కటే ప్రధానకారణమని అంటారా? అని ప్రశ్నించగా ఏ ఒక్కపార్టీనీ పూర్తిగా నిందించలేమని కున్హాల్‌కుట్టి అన్నారు. ఇలాంటి పరిస్థితులు మళ్ళీ తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఐతే కాంగ్రెస్–ఆప్ మధ్య భవిష్యత్తులో కూడా పునరాలోచనకు సంసిద్ధత కనిపించని అనిశ్చితి నెలకుని ఉంది. గడచిన జూన్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి పార్టీలు మంచి విజయాలు నమోదు చేశాయి. కానీ మహారాష్ట్ర ఎన్నికల్లో, తర్వాత తాజాగా శనివారంనాడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎన్‌డిఎ విజయభేరీ మోగించింది. మహారాష్ట్రలో కేవలం ఐదు నెలల వ్యవధిలోనే హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర జనాభా అంతమంది కొత్తగా ఓటర్ల జాబితాలోకి ఎక్కడంవల్లనే ఎన్‌డిఎ కూటమి విజయం సాధించిందని కాంగ్రెస్‌పార్టీ ఇప్పటికే పార్లమెంటులో పరోక్షంగా తీవ్ర విమర్శలు గుప్పించింది. ప్రస్తుతం కర్ణాటక, జమ్మూ కశ్మీర్, తెలంగాణ, కేరళ, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సభ్యులు పాలకపార్టీలుగా కొనసాగుతున్నారు. బిజెపిని ఓడించాలనే లక్ష్యంతో భావసారూప్యతగల ప్రతిపక్షాలన్నీ 'ఇండియా' కూటమిగా ఏర్పడ్డాయి. ఇప్పటికే బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ కూటమి మూడోసారి కూడా కేంద్రంలో అధికారం చేపట్టింది. 2014, 2019 2024 లలో మూడుసార్లు మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టింది. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు 'ఇండియా' కూటమిలో సభ్యులుగా ఉన్నప్పటికీ ఢిల్లీ ఎన్నికల్లో మాత్రం ఒకరిపై ఒకరు పోటీ పడ్డారు. బహిరంగ సభల్లో అరవింద్ కేజ్రీవాల్‌ను కాంగ్రెస్‌పార్టీ పచ్చి అవినీతికర పార్టీగా ప్రచారం చేసింది. కానీ ఈ ఎన్నికల్లో అటు కేజ్రీవాల్, ఇటు కాంగ్రెస్‌పార్టీ రెండూ తీవ్రంగా నష్టపోయాయి. బిజెపి లబ్ధిపొందింది. 'ఇండియా' కూటమి పార్టీలు ఐక్యంగా ఉండేందుకు కాంగ్రెస్‌పార్టీ కృషి చేయాలని వామపక్షలు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ సీట్ల సర్దుబాట్ల విషయంలో కూటమి పార్టీలతో రాజీపడి కాంగ్రెస్ వెనక్కు తగ్గకపోవడంవల్ల కొంత నష్టం జరిగింది. 'ఇండియా' కూటమిలో కాంగ్రెస్‌పార్టీయే అతిపెద్ద భాగస్వామిగా ఉంది. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ వాద్రాలు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా అరవింద్ కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించారు. మద్యం అవినీతి విధాన రూపశిల్పి అరవింద్ కేజ్రీవాల్ అని విమర్శించారు. ఐతే సమాజ్‌వాదీపార్టీ, తృణమూల్ కాంగ్రెస్ వంటి 'ఇండియా' కూటమి పార్టీలు ఢిల్లీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. దీంతో ఈ కూటమితో పెద్ద పార్టీ కాంగ్రెస్‌కు, ఇతర చిన్న పార్టీలకు మధ్య దూరం పెరుగుతున్నది. కాంగ్రెస్‌పార్టీ సీట్లసర్దుబాట్ల విషయంలో చిన్నపార్టీలకు అవకాశం ఇవ్వడంలేదనే అసంతృప్తి పెరుగుతున్నది. ఐనప్పటికీ కూడా రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల నాటికి కూడా 'ఇండియా' కూటమి చెక్కుచెదరకుండానే ఉంటుందన్న సంకేతాలు ఉన్నాయి. రాబోయే సంవత్సరాలలో ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో జరిగే ఎన్నికలు 'ఇండియా' కూటమికి పెద్ద అగ్నిపరీక్ష కానున్నాయి. 'ఇండియా' కూటమిలో పరిణామాలపై జమ్మూ కశ్మీరు ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తూ, ''ఒకరిపై ఒకరు పోరు సాగించండి'' అని విమర్శించారు. సిపిఐ(ఎం), ఇండియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్)పార్టీలు కూడా 'ఇండియా' కూటమిలో ముసురుకుంటున్న విభేదాలపట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. దేశరాజధానిలో ఈ బలహీనత కారణంగానే కాషాయ కూటమి విజయభేరి మోగించిందని విమర్శించాయి.

### కేజ్రీవాల్‌పై వ్యతిరేకతవల్లే తప్ప మోదీ పాలన ఫలితం కాదు : కాంగ్రెస్

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు అరవింద్ కేజ్రీవాల్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత వల్ల వచ్చినవేగానీ, నరేంద్రమోదీ పాలనాఫలితం కాదని కాంగ్రెస్‌పార్టీ వ్యాఖ్యానించింది. 2015 2020 లలో నరేంద్రమోదీ ప్రభ వెలిగిపోతున్న సమయంలో కూడా ఢిల్లీలో ఆప్ పార్టీ నిర్ణయాత్మకమైన విజయం సాధించింది, ప్రస్తుత ఎన్నికల ఫలితాలు చూస్తే ఢిల్లీలో కేజ్రీవాల్ పరిపాలన, ఆయన విధానాలు, ఆయనపై ఉన్న అసంతృప్తివల్ల వచ్చినవేతప్ప ప్రధానమంత్రి పరిపాలన వల్ల కాదని తెలుస్తున్నది, కేజ్రీవాల్ మోసపూరిత రాజకీయాలను ప్రజలు తిరస్కరించారు అని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. ఐతే 'ఇండియా' కూటమి తిరిగి విజయభేరీ మోగించాలంటే వ్యక్తిగత విభేదాలను విస్మరించాల్సి ఉంటుంది.

## రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకు
# శతవిధాలా కేంద్రం యత్నం

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ విమర్శ



**వయనాడ్ :** భారత్‌లో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని బలహీనపర్చేందుకు కేంద్రంలో ఉన్న ప్రభుత్వం అన్ని ప్రయత్నాలూ చేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపి ప్రియాంకాగాంధీ విమర్శించారు. శనివారం ఆమె మనంతవాడి అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన బూత్‌స్థాయి నేతల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రకృత ప్రకోపానికి భారీగా కొండచరియలు విరిగి పడగా, ఊర్లకు ఊర్లే విధ్వంసమైనప్పటికీ, నిలువనీడలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు నేటికీ తగిన పరిహారం అందజేయలేదని మండిపడ్డా రు. లోక్‌సభలో తాము చేసిన ప్రయత్నాల ఫలితంగా వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనను కేంద్ర ప్రభుత్వం కనీసం జాతీయ విపత్తుగా ప్రకటించిందని, దీని వల్ల బాధితులకు పు రావాసం కల్పించేందుకు అధిక నిధులు అందుతాయని తాము ఆశిస్తున్నామన్నారు. అదే విధ ంగా వయనాడ్‌లో జిల్లాలో అడవి జంతువులు దాడి చేయడం వల్ల పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలను కూడా ప్రియాంకా గాంధీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. మానవులు – జం తు సంఘర్ష ణ కూడా జీవనోపాధి కోల్పోవడానికిదారి తీస్తుందన్నారు. తాను క్రితం సారి వయనాడ్‌కు వచ్చినప్పుడు మానువులు–జంతు సంఘర్ష ణను తగ్గించేందుకు మరిన్ని నిధులు అవసరమవుతాయని జిల్లా అధికార యంత్రాంగం చెప్పిందని ఆమె గురుచేశారు. సమస్య పరిష్కారానికి తాను కృషి చేస్తానని చెప్పానని, అందువల్ల ఎన్ని నిధులు అవసరమైతాయో గుర్తించేందుకు అంద రం కలిసి పనిచేద్దామన్నారు. సమస్యకు వినూత్న పరిష్కారానికి కొనగొనాలని చెప్పారు. గిరిజనుల అవసరాలు, మనంతవాడిలో వైద్యకాలేజీ కొరత, రాత్రి ప్రయాణాల్లో నిబంధనలు, జిల్లాలో పర్యాటకానికి ప్రోత్సాహం, ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తానని హామీ నిచ్చారు. కాగా, లోక్‌సభ ఉప ఎన్నికల్లో తన విజయానికి దోహదపడిన బూత్‌లెవల్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కేవలం ఎన్నికలప్పుడే కాకుండే ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ప్రియాంక గాంధీ సూచించారు. ఇదిలా ఉండగా, ఉదయం ఆమె కన్నూర్ విమానాశ్రయానికి చేరుకుని అక్కడి వయనాడ్‌కు రోడ్డుద్వారా వచ్చారు. మనంతవాడితో పాటు సుల్తాన్ బతేరీ, కాలెట్ట అసెంబ్లీ నియోజకవర్గాలో బూత్‌స్థాయి నాయకులతో ప్రియాంక సమావేశాలు నిర్వహిస్తారని పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆదివారం కూడా ఆమె ఎర్నాడ్, తిరువంబాడి అసెంబ్లీ నియోజకవర్గాల్లో బూత్‌లెవల్ నేతలతో సమావేశం కానున్నారు. అదే విధంగా సోమవారం వండూర్, నీలాంబర్ నియోజకవర్గాలో బూత్‌లెవల్ సమావేశాలు నిర్వహించనున్నారు. అడవి జంతువుల దాడుల బారిన పడిన బాధితులను పరామర్శించనున్నారు. ప్రియాంక ఎంపిగా గెలుపొందిన తరువాత వయనాడ్‌లో పర్యటించడం ఇది రెండవసారి.

# నిరూపితమైన ఎగ్జిట్‌పోల్స్

**DELHI ASSEMBLY ELECTIONS**
TOTAL SEATS - 70

| | |
|---|---|
| BJP | 45-55 |
| AAF | 15-25 |
| CONG | 0-1 |
| OTHERS | 0-1 |

**వాయనాడ్(కేరళ) :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై పలు సంస్థలు వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్ సరైనవేనని నిరూపితమయ్యాయి. వీటిలో యాక్సిస్ మై ఇండియా సంస్థ ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్ సంఖ్యలు ఎన్నికల ఫలితానికి చేరువగా ఉన్నాయి. ఎన్నికలలో ప్రధాన పోటీ బిజెపి, ఆప్ మధ్యే ఉన్న నేపథ్యంలో యాక్సిక్ మై ఇండియా బిజెపి 44–55 సీట్లను, ఆప్ 15–25 సీట్లను గెలుచుకుంటుందని తెలిపింది. ఫలితాలు కూడా దీనినే రుజువు చేశాయి. టుడేస్ చాణక్య సంస్థ బిజెపి 45–57 సీట్లు, ఆప్ 13–25 సీట్లు గెలుచుకుంటుందని అంచనా వేసింది. పీపుల్స్ ఇన్‌సైట్ సంస్థ బిజెపి 40–44 సీట్లు, ఆప్ 25–29 సీట్లు, పి–మార్క్ సంస్థ బిజెపి కూటమి 39–49 సీట్లు, ఆప్ 21–31 సీట్లు, జెవిసి సంస్థ బిజెపి కూటమి 39–45 సీట్లు, ఆప్ 22–31 సీట్లు, చాణక్య స్ట్రాటజీస్ సంస్థ బిజెపి కూటమి 39–44, ఆప్ 25–28 సీట్లు గెలుచుకుంటాయని జోస్యం చెప్పాయి. కొందరు విశ్లేషకులు కూడా బిజెపికే మద్దతు పలికారు. కేవలం రెండు సంస్థలు మాత్రమే ఆప్ ఆధిక్యం నిలబెట్టకుంటుందని పేర్కొన్నాయి. వీ ప్రిసైడ్ సంస్థ ఆప్‌కు 46–52 సీట్లు, బిజెపి 18–23 సీట్లు దక్కించుకుంటాయని చెప్పగా, మైండ్ బ్రింక్ మీడియా సంస్థ ఆప్‌కు 44–49 సీట్లు, బిజెపి21–25 సీట్లు గెలుచుకుంటాయని పేర్కొన్నది. ఎక్కువ సంస్థలు కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కదని తెలుపగా, కొన్ని సంస్థలు ఒకటి, రెండు సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని పేర్కొన్నాయి.

# మద్యం విధానంతో..మునిగిన ఆప్

సామాజిక కార్యకర్త అన్నా హజారే



**ముంబయి :** ఢిల్లీ పీఠాన్ని దాదాపు 26 ఏళ్ల తరువాత బిజెపి కైవలం చేసుకోవడంపై సామాజిక కార్యకర్త అన్నా హజారే స్పందించారు. ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం మద్య విధానం, దానివల్ల వల్ల నగుదపై దృష్టి పెట్టడంలోనే మునిగిపోయిందన్నారు. అవినీతి వ్యతిరేక కార్యకర్త అన్నా హజారే కేజ్రీవాల్‌పై విమర్శలు సంధించారు. అభ్యర్థి సచ్ఛీలుడై ఉండాలని, త్యాగ ధర్మాలను తెలుసుకుని ఉండాలన్నారు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక యుద్ధం నుంచి పుట్టిందే ఆమ్ అద్మీ పార్టీ అని అందరికీ తెలిసిందే. అయితే శనివారం నాడు వెలువడిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బిజెపి ముందు విజయం సాధించలేక చతికిలపడిపోయింది. 70 అసెంబ్లీ స్థానాలకు గానూ 22 సీట్లకే పరిమితమైంది. ఆప్ సీనియర్ నేత, మాజీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియా జంగ్‌పురు నియోజకవర్గంలో ఓటమి పాలయ్యారు. పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ కూడా న్యూఢిల్లీ సీట్‌లో గెలవలేకపోయారు. ఈ నేపథ్యంలో అన్నా హజారే ముంబయిలోని తన స్వగ్రామమైన రాలేగాన్ సిద్ధి గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీలో నగదు విధానం భారీగా నగదు తెచ్చిపెట్టిందని, అయితే దానివల్లే నేడు ఎన్నికల గెలవలేక మునిగిపోయిందన్నారు. ఆప్ ప్రతిష్ట పరువు పోయిందని పేర్కొన్నారు. కేజ్రీవాల్ సచ్ఛీలత గురించి మాట్లాడుకోవడం, ఆ తరువాత మద్యం గురించి కూడా ప్రజలు చూశారన్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాల్సిన అవసరాన్ని అర్థం చేసుకోవడంలో విఫలమై తప్పుడు మార్గాన్ని ఎంచుకున్నందున ఆప్ ఓడిపోయిందని హజారే అన్నారు. 'డబ్బు ముందు స్థానంలో నిలిచింది, ఇది ఆప్ ప్రతిష్టను దెబ్బతీసింది, దాని ఓటమికి దారితీసింది' అని ఆయన అన్నారు. 2012లో ఆప్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్న తర్వాత హజారే, కేజ్రీవాల్ విడిపోయారు. 2021–22 సంవత్సరానికి ఢిల్లీ ఎక్సైజ్ విధానాన్ని సవరించేటప్పుడు అక్రమాలు జరిగాయని, లైసెన్స్ హోల్డర్లకు అనుచిత ప్రయోజనాలు కల్పించారని కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ), ఇడి తేలింది. ఢిల్లీ ప్రభుత్వం నవంబర్ 17, 2021న ఈ విధానాన్ని అమలు చేసింది, కానీ అవినీతి ఆరోపణల నేపథ్యంలో 2022 సెప్టెంబర్ చివరిలో దానిని రద్దు చేసింది. ఆప్ స్థాపించబడినప్పుడు తా ను రాజకీయాలకు దూరంగా ఉన్నానని హజారే చెప్పారు. 'ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి వ్యక్తిత్వం శుభ్రంగా, మచ్చలేనిదిగా ఉండాలని నేను మొదటి నుంచీ చెబుతున్నాను. అభ్యర్థి త్యాగ సద్గుణాలను తెలుసుకోవాలి. అవమానాలను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉండాలి. '(అభ్యర్థులలో) ఈ లక్షణాలు అభ్యర్థి తమ కోసం ఏదైనా చేస్తాడని భావించే ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటాయి. నేను ఇలా చెబుతూనే ఉన్నాను కానీ వారు (ఆప్) దానిని అర్థం చేసుకోలేదు' అని ఆయన అన్నారు. ఆరోపణలు వచ్చినప్పుడు, ఈ ఆరోపణలు తప్పు అని ప్రజలకు చెప్పడం అవసరమని హజారే అన్నారు.

# ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తాం




ఢిల్లీ ఫలితాలపై రాహుల్, ఖర్గే

**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ప్రజల తీర్పును వినయంగా గౌరవిస్తామని, ఎన్నికల సమయంలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు కృతజ్ఞతలు అని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ అన్నారు. ఢిల్లీ అభివృద్ధికి ఎప్పటివలెనే పోరాటం కొనసాగిస్తామని, కాలుష్యం, అధిక ధరలు, అవినీతికి వ్యతిరేకంగా పోరాడతామని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ వరుసగా మూడోసారి ఖాతా తెరవడంలో విఫలమైంది. 70 సీట్ల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోరులో కాంగ్రెస్ ఒక్క సీటుకూడా గెలుచుకోలేకపోయింది. అంతేగాక ప్రధాన నియోజవర్గాలలోసైతం కాంగ్రెస్ అభ్యర్థులు చిత్తుగా ఓడారు. ఈ యేడాది లోక్‌సభ ఎన్నికలలో ఆప్‌తో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్‌కు చేదు ఫలితం ఎదురైన సంగతి తెలిసిందే. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జు ఖర్గే ఎక్స్ వేదికగా హిందీలో స్పందిస్తూ అధికార ఆప్ పార్టీకి ప్రతికూల వాతావరణం సృష్టించడంలో సఫలమైనా, తాము ఆశించిన విధంగా ప్రజలు తమకు అధికారం కట్టబెట్టేందుకు ఆసక్తి చూపలేదన్నారు. ఢిల్లీ ప్రజల తీర్పును స్వాగతిస్తున్నామని, ప్రజలకు మరింత చేరువై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

# మిల్కిపూర్ ఉప ఎన్నికలోఎస్‌పి అభ్యర్థిపై పాశ్వాన్ గెలుపు



**అయోధ్య:** ఉత్తరప్రదేశ్ మిల్కిపూర్ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికల్లో సమాజ్ వాదీపార్టీ అభ్యర్థి అజిత్ ప్రసాద్ (42) పై బిజెపికి చెందిన చంద్ర భాను పాశ్వాన్ (38) 61,000 కుపైగా ఓట్ల తేడాతో గెలిచారు. ఆయన మొత్తం 61,710 ఓట్లు అధికంగా సాధించారని ఎన్నికల సంఘం వెబ్ సైట్ వెల్లడించింది. పాశ్వాన్‌కు మొత్తం 1.46 లక్షల ఓట్లు రాగా, అజిత్ ప్రసాద్‌కు 84,687 ఓట్లు లభించాయి. మొదటి నుండీ పాశ్వాన్ లెక్కింపులో నిర్ణయాత్మకమైన ఆధిక్యతతో కొనసాగారు. 29 రౌండ్లు కౌంటింగ్ తర్వాత పాశ్వాన్‌కు 1,45,685 ఓట్లు లభించాయి. అదేవిధంగా ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరామ్)కు చెందిన సంతోష్‌కుమార్‌కు 5,158 ఓట్లు లభించాయి. స్థానిక ఎంఎల్‌ఎ అవధేశ్ ప్రసాద్ లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి మిల్కిపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో అయోధ్య జిల్లాలో మిల్కీపూర్ నియోజకవర్గాన్ని మాత్రమే బిజెపి కోల్పోయింది. ఇప్పుడు గెలుచుకుంది. ఈ ఉప ఎన్నికల్లో బిఎస్‌పి, కాంగ్రెస్ పోటీ చేయకుండా సమాజ్‌వాదీపార్టీ అభ్యర్థికి మద్దతు ఇచ్చింది.

### ఎన్నికల యంత్రాంగం దుర్వినియోగం : అఖిలేశ్

బిజెపి ఎన్నికల యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసిందని మిల్కిపూర్ ఉపఎన్నికపై సమాజ్‌వాదీపార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ మండిపడ్డారు. ఇది బూటకపు విజయమని విమర్శించారు. వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, దళితుల (పిడిఎ) బలం ఓట్ల ప్రాతిపదికపై పెరుగుతూ ఉండటంతో ఆ బలాన్ని బిజెపి ఎదుర్కోలేక ఎన్నికల యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసి ఉప ఎన్నికలో విజయం సాధించిందని విమర్శించారు. ఏదో ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో మోసం చేసి గెలవడం సాధ్యమేమోగానీ, ఉత్తరప్రదేశ్‌లో ఉన్న మొత్తం 403 నియోజకవర్గాలలోనూ ఈ విధంగా ఎన్నికల యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసి గెలవడం సాధ్యం కాదని ఆయన హెచ్చరించారు. ఇలాంటి బూటకపు విజయాలను అద్దంలో చూసుకుని బిజెపి ఎప్పటికీ విజయోత్సవాలు చేసుకోలేదని విమర్శించారు. అధికారులు ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. వారిని త్వరలోనో, ఆ తర్వాత ఖచ్చితంగా శిక్షించి తీరుతామన్నారు. ''బిజెపి వాళ్ళను ఉపయోగించుకుంది, సరే కానివ్వండి, ఇంకెన్నాళ్ళో వారు బిజెపికి రక్షణగా ఉండలేరు, వారు ఉద్యోగాలు కోల్పోయినప్పుడు, పెన్షన్లు కోల్పోయినప్పుడు ఇబ్బందులు పడతారు, సమాజంలో, కుటుంబంలో వారి పిల్లలమధ్య ఉండి జీవితశిక్ష అనుభవిస్తారు'' అని విమర్శించారు.

# ఢిల్లీ సచివాలయానికి తాళం

## ఫైళ్లు, రికార్డులు భద్రపరచాలని ఆదేశం..




**న్యూఢిల్లీ :** దాదాపు 26 ఏళ్ల తర్వాత ఢిల్లీ పీఠం కమల దళం చేతికి చిక్కింది. వరుసగా రెండు సార్లు అధికారం అనుభవించిన ఆమ్ ఆద్మీ పార్టీ పరాజయం పాలైంది. ఆప్ అధినేత అయిన అరవింద్ కేజ్రివాల్ కూడా తన నిజయోజకవర్గంలో ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ సచివాలయ ఉద్యోగులకు లెఫ్టినెంట్ గవర్నర్ నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. దీంతో ఢిల్లీ సెక్రటేరియట్‌ను సీజ్ చేశారు. సచివాలయం నుంచి ఏ ఒక్క ఫైల్, రికార్డు, హార్డ్ డ్రైవ్ బయటకు వెళ్లకూడదని లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు. ఎటువంటి ఫైల్స్, డాకుమెంట్స్, కంప్యూటర్ హార్డ్ వేర్ లాంటివి ఢిల్లీ సెక్రటేరియట్ కాంప్లెక్స్ నుంచి బయటికి తీసుకెళ్లడానికి అనుమతి లేదు. ఒకవేళ అత్యవసరమైతే జెనెరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్ మెంట్ నుంచి అనుమతి తీసుకోవడం తప్పనిసరి. ఈ విషయంలో సెక్రటేరియట్‌కు చెందిన అన్ని విభాగాల అధిపతులు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాంబూబూ అంటూ ఢిల్లీ గవర్నర్ కార్యాలయం నుంచి నోటీసు జారీ అయింది.

# ఢిల్లీ ముఖ్యమంత్రి నిర్ణయం బిజెపి అధిష్టానిదే

కేజ్రీవాల్‌ను ఓడించిన విజేత పర్వేష్ వర్మ స్పష్టత

ఇది 'దేశ రాజధాని ప్రజల విజయం' అని వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు ఆశ్చర్యకర తీర్పును ఇచ్చారు. మాజీ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవివంద్ కేజ్రీవాల్‌ను న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఓడించిన బిజెపి దిగ్గ జ విజేత పర్వేష్ వర్మ ఇప్పుడు వార్తల్లోని వ్యక్తి అయ్యారు.ఢిల్లీ తదుపరి ముఖ్యమంత్రి ఎవరు అనేది బిజెపి నాయకత్వం నిర్ణయిస్తుందని అన్నారు. పర్వేష్‌వర్మ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి సాహిబ్‌సింగ్ వర్మ కుమారుడు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన మాట్లాడుతూ ఢిల్లీ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఫలితాలను 'దేశరాజధాని ప్రజల విజయం' ఇది అని ఆయన వ్యాఖ్యానించారు. 'ఇది కేవలం నా విజయం మాత్రమే కాదు, ఇది ఢిల్లీ ప్రజల విజయం. వారు అబద్ధాలాడే వారిని పక్కనపెట్టి నిజం మాట్లాడే వారిని ఎంచుకున్నారు. పరిపాలనలో జిమ్మికులు చేసేవారిని, అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసేవారిని ఓడించారు. నన్ను విశ్వసించిన ప్రతీ ఓటరుకూ నేను వినయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను' అని వర్మ చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షా, బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి.నడ్డా బలమైన నాయకత్వంలో మేం అలుపెరుగకుండా పనిచేసి ఢిల్లీలో నిజమైన మార్పును తీసుకువస్తామని పర్వేష్‌వర్మ చెప్పారు. ప్రజలు నిజాయితీని, పారదర్శకతను, అభివృద్ధితో ప్రయాణించే రాజకీయాలను కోరుకున్నట్లు ఈ తీర్పు స్పష్టమైన సందేశాన్ని ఇచ్చిందని వర్మ తెలిపారు. పశ్చిమ ఢిల్లీ నియోజకవర్గ ఎంపి అయిన వర్మ మాట్లాడుతూ ఢిల్లీలో ఒక కొత్త అధ్యా యం ప్రారంభమైందని అన్నారు. 'మేం ఉజ్వల భవిష్యత్తును నిర్మిస్తాం' అని పర్వేష్‌వర్మ విశ్వాసం వ్యక్తం చే శారు. గత 11సంవత్సరాల కాలంగా కేజ్రీవాల్ ఢిల్లీ కోసం పనిచేసిందేమీలేదని ఆయన ఆరోపించారు. ఆతర్వాత ఆయన రా జౌరీ గార్డెన్ నుంచి గెలిచిన మంజీందర్ సింగ్‌తో పాటు కలిసి బంగ్లాసాహెబ్ గురుద్వారాను సందర్శించారు. పని అంతా పేపర్, అడ్వర్టైజ్‌మెంట్లపైనే. ప్రజలు మాత్రం మోదీపైనే విశ్వా సం ఉంచారు. ఢిల్లీలో, దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన పని సాధించిన విజయం ఈ ఢిల్లీ ఎన్నికల ఫలితాలు. మంచి మేనిఫెస్టోను తెచ్చినందుకు నేను నడ్డా, అమిత్‌షా, పార్టీ నాయ కత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. యమునానది, ఢిల్లీ కాలుష్యం స్థాయి,ఉద్యోగిత, ట్రాఫిక్ కష్టాలు, గ్రామాలు, కాలనీలలో పనిపై దృష్టి సారిస్తామని పర్వేష్‌వర్మ చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను బిజెపి అభ్యర్థి పర్వేష్‌వర్మ న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో 4,089ఓట్ల మార్జిన్‌తో ఓడించారు. కేజ్రీవాల్ ఈ స్థానం నుంచి 2013, 2015,2020 ఎన్నికలలో విజయం సాధించినప్పటికీ ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలలో ఓటమిని చవిచూడడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

# అలాస్కా మంచులో కూలిన విమానం

పదిమంది మృతి

**జునియో:** అలాస్కా సముద్రంలో పేరుకుపోయిన మంచులో ఒక చిన్న కంప్యూటర్ విమానం కూలిపోయింది. అందులో ప్రయాణం చేస్తున్న పదిమంది మరణించారు. శనివారం నాడు ఈవిమానాన్ని కనుగొని మృతులను బయటకు తీశారు. అమెరికా తీరప్రాంత గస్తీ దళంఅధికార ప్రతినిధి మైక్‌సలెర్నో మాట్లాడుతూ, పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ఈ ప్రాంతం మొతాన్ని గాలిస్తున్నట్లు చెప్పా రు. విమానం బయలుదేరిన గంట తర్వాత సిగ్నల్ కేంద్రంతో అనుసంధానాన్ని కోల్పోయింది.



# స్పాడెక్స్‌లో సమస్యల్లేవు..మీడియా వార్తలకు ఇస్రో ఖండన




బెంగళూరు : భారతదేశం అంతరిక్షంలో మొదటి సారి విజయవంతంగా నిర్వహించిన 'స్పాడెక్స్'( రెండు ఉపగ్రహాల అనుసంధానం) కార్యక్రమంలో ఎలాంటి సమస్యలూ అవాంతరాలూ లేవని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ ప్రకటించారు. కొన్ని పత్రికల్లో వచ్చినట్లుగా స్పాడెక్స్‌లో ఎలాంటి అవాంతరాలు లేవని, ఇస్రో ఈ విషయంలో ఒక్కొక్క అడుగూ ముందుకు వేస్తోందని చెప్పారు. అంతరిక్షంలో భారతదేశ భవిష్యత్ నిర్మాణ అవసరాల నిమిత్తం మొట్టమొదటిసారి రెండు ఉపగ్రహాల అనుసంధాన (డాకింగ్ ప్రయోగం) కార్యక్రమాన్ని ఈ ఏడాది జనవరి 16న విజయవంతంగా పూర్తిచేసింది.ఐతే ఇది అవాంతరాలు ఎదుర్కొంటున్నదని కొన్ని మీడియాల్లో వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. ఏరో ఇండియా ఇంటర్నేషనల్ 15వ ద్వైవార్షిక సదస్సు సందర్భంగా శనివారంనాడు ఆయన పిటిఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ, ఈ విషయం చెప్పారు. రెండు ఉపగ్రహాలను అంతరిక్షంలో వేరు వేరు ప్రదేశాలలో విడివిడిగా ప్రవేశపెట్టి ఆ తర్వాత వాటిని ఒకేచోటకు తీసుకువచ్చి విజయవంతంగా అనుసంధానం చేశారు. భవిష్యత్‌లో భారత అంతరిక్ష కేంద్రం నిర్మాణం చేపట్టడానికి , చంద్రుడు వేదికగా ఇతర గ్రహాలకు అంతరిక్ష ప్రయోగాలు చేయడానికి, మానవసహిత అంతరిక్ష వాహకనౌకలను పంపించి అనుసంధానాలు నిర్వహించడంతోపాటు అనేక అవసరాలు తీరాలంటే ఈ స్పేస్ డాక్ కార్యక్రమం ఎంతో ముఖ్యమైనది. ఈ ఉపగ్రహాలను తదుపరి కక్ష్య పెంచి మరింత ఎత్తులోకి తీసుకువెళ్లేందుకు సంబంధించిన తాజా పరిణామాలను ఈనెల రెండో తేదీన ఒక ప్రకటనద్వారా ఇస్రో తెలియజేసింది కూడా. క్రమక్రమంగా మనం ఒక్కొక్క అడుగూ పైకి వెళుతున్నామని ఇస్రో ప్రకటించింది. ఈ విషయాన్నే ఇప్పుడు నారాయణన్ మరోసారి పునరుద్ఘాటించారు. స్పేస్ డాకింగ్ కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నదని, ఎస్‌డిఎక్స్–01, ఎస్‌డిఎక్స్–02 లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని ఒకభాగం మీడియాలో వార్తలు వచ్చాయి. ఇవి రెండూ అనుసంధానం చేసుకునే దశలోనే ఉన్నాయన్న వార్తలను వ్యాప్తిచేయడంతో ఇస్రో ఈ వివరణ ఇచ్చింది. ఎంతో తక్కువ ఖర్చుతో ఇస్రో ఈ స్పేస్ డాకింగ్‌ను చేసింది. పిఎస్ఎల్‌వి రాకెట్ ద్వారా ఈ రెండు ఉపగ్రహాలను వేరు వేరు కక్ష్యలలోకి పంపి తర్వాత అనుసంధానం చేసింది.

### అంతరిక్ష వాహనాల రీస్టార్ట్‌కు సిఇ- 20 ఇంజన్ దోహదం

వాహకనౌకలను అంతరిక్షంలోకి పంపిన తర్వాత తుది దశ ప్రయోగాల్లో ఈ వాహనాల్లో ఇంధనాన్ని తిరిగి మండించడానికి సిఇ–20 క్రయోజనిక్ ఇంజన్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ చెప్పారు. ఈనెల ఏడో తేదీన ఇస్రో దేశీయంగా తయారు చేసిన అతి శక్తి శక్తిమంతమైన సిఇ–20 క్రయోజనిక్ ఇంజన్ ద్వారా వాహకనౌకను ప్రయోగఅవసరాల నిమిత్తం తదుపరి మరింత పైస్థాయికి ( ఎల్‌విఎం 3 అంటే సి–25 స్థాయికి)తీసుకువెళ్ళే క్రమంలో శూన్యస్థితిలో తిరిగి మంట మండించే ప్రక్రియను విజయవంతం చేసేందుకు ఈ క్రయోజనిక్ సిఇ–20 ఇంజన్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. భవిష్యత్‌లో చేపట్టబోయే ప్రయోగాలకు ఈ ఇంజన్లు చాలా ప్రయోజనకరంగా ఉంటాయని, దేశీయ అంతరిఓ ప్రయోజనాలు తీర్చేందుకు గ్యాస్‌తో నిండిన ఈ ఇంజన్ అతి తక్కువ ఉష్ణోగ్రతలు ఉన్నచోట్ల ఎంతోబాగా పనిచేస్తుందన్నారు. ఇది దేశ అంతరిక్ష సాంకేతికత అభివృద్ధికి, తదుపరి ప్రయోగాలకు, ఉపగ్రహాల డిజైనింగ్‌లో మార్పులకు ఎంతో దోహదం చేస్తుందని ఆయన చెప్పారు. రాబోయేకాలంలో ఇంకా పెద్ద పెద్ద ప్రయోగాలను ఇస్రో చేపట్టబోతోందని, అంతరిక్షంలో పై కక్ష్యలకు వెళ్ళేకొద్దీ ఈ ప్రయోగాల ప్రయోజనాలను ఈ సిఇ–20 సిఇ–22, సిఇ–25 ఇంజన్లు నెరవేరుస్తాయన్నారు.



## ప్రతీ ఎకరాకూ నీరందించేలా కృషి

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** చివరి భూముల్లోని ప్రతి ఎకరాకు నీరందించేలా తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మిర్యాలగూడ మండలంలోని చిల్లాపురం వజీరాబాద్ మేజర్ కాల్వను ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. వజీరాబాద్ మేజర్ ద్వారా విడుదల చేసిన నీరు వారబందీల వారీగా నిలిపివేయడం వల్ల కాల్వ చివరన ఉన్న గ్రామాలకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వారబందిని నిలిపివేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కాల్వలో పేరుకపోయిన చెత్తను పూర్తిగా తొలగించాలని, చెత్త వల్ల నీటి ప్రవాహం వేగం తగ్గడంతో చివరి భూములకు నీరందడం లేదన్నారు. రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి ప్రతి ఒక్క ఎకరాకు నీరందేలా నీటిని చేయిస్తానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పెద్దగట్టు జాతర గోడపత్రిక ఆవిష్కరణ



**ప్రజాపక్షం/చివ్వెంల:** తెలంగాణ రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద జాతరైన శ్రీశ్రీశ్రీ లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతర గోడపత్రికను శనివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ పోలేబోయిన నర్సయ్య యాదవ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవుల ఆరాధ్యదైవమైన శ్రీ లింగమంతులస్వామి జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 16 నుండి 20 వరకు జరిగే జాతరకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కుశలయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు కుర్ర సైదులు యాదవ్, వీరబోయిన సైదులు యాదవ్, సిరపంగి సైదమ్మ, మెంతబోయిన లింగస్వామి యాదవ్, చిన్న మల్లయ్య యాదవ్, దేవాదాయశాఖ అధికారులు గాలి నగేష్, శ్రీశైలం, సిబ్బంది పాల్గొన్నారు.

## 11న మోటర్ ట్రాన్స్‌పోర్ట్ విడి భాగాలకు వేలం




**ప్రజాపక్షం/ నల్లగొండ:** నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలోని మోటర్ ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి చెందిన పోలీస్ వాహనాల ఉపయోగించి వదిలేయబడిన ,కాలం చెల్లిన వివిధ రకాల పాత టైర్లు,బ్యాటరీస్, విడి భాగాలకు వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ శనివారం తెలిపారు. ఈ వేలం ఈనెల 11న ఉదయం 10.00 గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయంలో వేలం నిర్వహించడం జరుగుతుందని, ఈ వేలంలో పోలీస్ వాహనాలకు సంబంధించిన వివిధ రకాల పాత టైర్లు, ఆయిల్, స్పేర్ పార్ట్స్ తదితర విడి విభాగాలు వేలం వేయనున్నారని ఈ వేలంలో పాల్గొనేవారు తప్పక హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాల కొరకు మోటర్ ట్రాన్స్‌పోర్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సూరప్ప నాయుడు ని సంప్రదించి ఆయన ఫోన్ నంబర్ 8712670170కి తెలుసుకోవచ్చని సూచించారు.

## పరిశుభ్రతపై దృష్టి కేంద్రీకరించాలి

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** గ్రామపంచాయతీ పరిధిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు స్థానిక అధికారులు చర్యలు తీసుకోవాలని ఉండవెల్లి మండల అభివృద్ధి అధికారి తిరుపతన్న అన్నారు. శనివారం మండల అభివృద్ధి అధికారి తరుపతన్న అన్నారు. శనివారం మండల పరిషత్తు కార్యాలయంలో అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు లేకుండా నీటి సమస్య డ్రైనేజీలు చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉండే పనులు పరిశీలన చేయాలని వారు తెలిపారు. నర్సరీలనూ ప్యాకింగ్కు నింపి మొక్కలు పెంచేందుకు కృషి చేయాలని విత్తనా శుద్ధి మట్టిని నింపి ముక్కలను అభివృద్ధి చేయాలని వారు తెలిపారు. పనుల ఎంపిక చేపట్టాలని ఉపాధి సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టి ఏ లు జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎస్‌సి వర్గీకరణతో మాదిగలకు న్యాయం

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ : టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య

**ప్రజా పక్షం/ నల్లగొండటౌన్ :**30 ఎండ్ల ఎస్సీ వర్గీకరణ పోరాటానికి ఎట్టకేలకు కాంగ్రెస్‌తో న్యాయం జరిగిందని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య అన్నారు. శనివారం నల్గొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటన చేసి నిలబెట్టుకున్నాడని అన్నారు.ఎస్‌సి వర్గీకరణపై నలుగురు మంత్రులతో కమిటీ, హైకోర్టు జడ్జి షమీమ్ అక్తర్ తో ఏకసభ్య కమిషన్ వేసిందని తెలిపారు. కమిషన్ రిపోర్ట్ ఇచ్చిన వెంటనే ఈనెల 4న ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదం తెలిపి సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాడని అన్నారు.సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదట ఎస్సీ వర్గీకరణ అమలు చేసి సీఎం రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాడని అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి దామోదరం రాజనర్సింహకు, మంత్రివర్గానికి ఈ సందర్భంగా కొండేటి మల్లయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వర్గీకరణతో మాదిగలకు, మాదిగ ఉప కులాలకు విద్యా,ఉద్యోగ అవకాశాలలో న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.వర్గీకరణ సాధన కోసం మాదిగలు గత 30 సంవత్సరాలుగా ఎన్నో ఉద్యమాలు చేశారని అన్నారు.ఎన్ని అడ్డంకులు ఎదురైనా వర్గీకరణ సాధన కోసం పోరాటాలు చేశారని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో డిసిసి ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి జానయ్య, కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు పెరిక వెంకటేశ్వర్లు, తోలకోప్పుల గిరి, నాగార్జునసాగర్ నియోజకవర్గ నాయకుడు నకరేకంటి సైదులు, కొండ భాస్కర్, కొండేటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## బుద్ధవనం శిల్పాలలో... సిద్ధార్థుని జీవితం అద్భుతం!

శ్లాఘించిన దక్షిణాసియా బౌద్ధ భిక్షువులు
వివరించిన పురావస్తు శాస్త్రవేత్త ఈమని శివనాగిరెడ్డి



**ప్రజాపక్షం/నందికొండ:** తెలంగాణ ప్రభుత్వం నాగార్జున సాగర్ లో ఎంతో ప్రతి ష్టాత్మకంగా నిర్మించిన బుద్ధవనంలో శనివారం అంతర్జాతీయ బౌద్ధ భిక్షువులు కలయతిరిగి అక్కడ శిల్పాలను వీక్షించి కొనియాడారు. బుద్ధ వనములో జరిగిన అంతర్జాతీయ త్రిపిటక పఠనోత్సవంలో పాల్గొన్న 115 మంది బౌద్ధ బిక్షువులు లలో 27 మంది భారతదేశ బౌద్ధ బిక్షువులు, దక్షిణాసియా దేశాల భిక్షువులు శనివారం బుద్ధవనం ఎంట్రెన్స్ ప్లాజా నుండి ఊరేగింపుగా బయలుదేరి మహాస్తూపం లోని ఆచార్య నాగార్జున శిల్పం, మహస్తుపాన్ని అలంకరించిన శిల్పాలు ,బుద్ధ పాదాలు, బుద్ధచరిత వనం ,శ్రీలంక దేశం బహుకరించిన ఆవుకన బుద్ధుని శిల్పం, స్తూప వనంలోని 14 నమూనా స్థూపాలను సందర్శించారు. బుద్ధవనం కన్సల్టెంట్ చరిత్ర పరిశోధకులు , బౌద్ధ నిపుణులు శివనాగిరెడ్డి బౌద్ధ బిక్షులకు బుద్ధవనంలోని వివిధ విభాగాలను అక్కడి శిల్పాల విశేషాలను వివరించారు. బుద్ధవనంలోని సమావేశ మందిరంలో బుద్ధవనంపై రూపొందించిన వీడియో ప్రదర్శనను వీక్షించిన అనంతరం శివనాగిరెడ్డి వారికి ఆచార్య నాగార్జునని కాంస్య విగ్రహం వద్ద ఆయన రాసినటువంటి బౌద్ధ తాత్విక గ్రంథాలు, మాధ్యమిక ధన్యవాదాలు గురించి తెలియజేసిన అనంతరం బౌద్ధ భిక్షువులు శ్రీలంక ప్రభుత్వం బహుకరించిన గంటను మోగించి బుద్ధ వనం పర్యటనను ముగించారు. అనంతరం వీరు ప్రపంచ ప్రఖ్యాత బౌద్ధ స్థావరం నాగార్జున కొండను సందర్శించి అక్కడి కట్టడాలు, శిల్పాలను ఆసక్తిగా వీక్షించారు.నాగర్జున కొండలో ఆచార్య నాగార్జునడు నడయాడిన నేలపై తాము కూడా అడుగు పెట్టడం తమకెంతో ఆనందాన్నిచ్చిందని ఆచార్య నాగార్జునుని రచనలు ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందాయన్నారు. ఈ కార్యక్ర మంలో మహాబోధి బుద్ధ విహార అధ్యక్షులు కశ్యప బంతే, ఆనంద బంతే, సంఘపాల బంతే ,శ్రీలంక మయన్మార్ ,లావోస్ ,కంబోడియా ,వియత్నాం ,థాయిలాండ్ దేశాల బౌద్ధ భిక్షువులు, అంతర్జాతీయ త్రిపీటక పఠనమండలి వ్యవస్థాపకురాలు అమెరికాకు చెందిన వాంగ్మే డిక్షీ సభ్యులు నెల్సన్, బుద్ధవనం అధికారులు శ్యాంసుందర్రావు ,శాసన రక్షిత, రవి చంద్ర, శ్రీనివాస్ రెడ్డి ,నరసింహారావు ,స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలి



**ప్రజాపక్షం/యాదాద్రి :** వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రిసైడింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్, సెక్టార్ ఆఫీసర్స్‌కు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓటును ఎలా రికార్డు చేయాలో, ఓటు హక్కు వినియోగించుకునేవారి వివరాలు ఎలా నమోదు చేయాలో, తదితర విధి విధానాలు పిపిటి ద్వారా ప్రిసైడింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్, సెక్టార్ ఆఫీసర్స్‌కు అవగాహన కల్పించడం జరిగింది. ఎన్నికల నిబంధనలు పాటిస్తూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎక్కడ కూడా అవకతవకలు జరగకుండా విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో 17 పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా లెవల్ మానిటరింగ్ ట్రైనర్స్ (డిఎల్ఎంటి) కడారి నర్సిరెడ్డి, హరినాథ్ రెడ్డి, పిఓలు, ఏపిఓలు, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పిఒ, ఎపిఒలకు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌పై శిక్షణ

ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోపబడి పని చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు




**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఎన్నికల కమిషన్ నిబంధనలలకు లోబడి అధికారులు, సిబ్బంది పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఫిబ్రవరి 27న నిర్వహించే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పిఓ, ఎపిఓలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ అన్నికల విధుల్లో ఎవరికి మినహాయింపు లేదని ప్రతి ఒక్కరు హాజరు కావాలన్నారు. ఓటింగ్‌ను పింక్ కలర్ బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహిస్తామని, బ్యాలెట్ పెపర్‌లో ప్రాధాన్యత ప్రకారం ఎన్నికల కమిషన్ వారు ఇచ్చిన వయలేట్ స్కెచ్ పెన్‌తో మాత్రమే పోటీ చేసే అభ్యర్థుల పేర్లకు ఎదురుగా సీరియల్ ప్రకారం ప్రాధాన్యత క్రమంలో ఓటు వేయాలన్నారు. మధ్యలో అసంపూర్తిగా నెంబర్లు వేస్తే ఓటు చెల్లదని తెలిపారు. ఫిబ్రవరి 26న ఉదయం 7 గంటలకు సిబ్బంది బ్యాలెట్ పంపిణీ కేంద్రానికివచ్చి తమ పోలింగ్ సామాగ్రిని జాగ్రత్తగా పరిశీలించుకోని నిర్ధారణ చేసుకున్న తరువాతనే పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలన్నారు. 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ఏలాంటి రాజకీయ ప్రచారాలు చేయరాదని, 200 మీటర్ల దూరంలో పోలింగ్ స్లిప్‌లను ఇచ్చుకోవాలన్నారు. సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఉన్న వారందరికి ఓటు వేసే సిరియల్ నెంబర్లు ఇవ్వాలన్నారు. మధ్యాహ్నం 100శాతం పోలింగ్ పూర్తి అయిన కేంద్రాల్లో కూడా సాయంత్రం 4 గంటల వరకు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస రాజు, డిటి వేణు, ఎలక్షన్ ట్రైనర్స్ రమేష్, వెంకటేశ్వర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## స్థానిక ఎన్నికల్లో కలిసిపోదాం

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కలిసి పని చేద్దామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆలేరు నియోజకవర్గం 8 మండలాల కార్యదర్శులు కార్యవర్గ సభ్యుల అత్యవసర సమావేశం యాదగిరిగుట్టలోని సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హాజరయ్యారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు చర్చలు జరిగినాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రిజర్వేషన్స్ ప్రకటించిన తదుపరి సమావేశం ఏర్పాటు చేసుకొని ఎన్నికల్లో సిపిఐ పార్టీతో కలిసి పోవుటకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. పార్టీకి బలం ఉన్న ప్రాంతాల్లో పోటీ చేయడానికి సీట్లు సర్దుబాటు చేసుకుని ముందుకు వెళ్దామని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు పరిస్థితులపై ప్రసంగించారు. పార్టీ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యేకి అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరు రాజ య్య, బండి జంగమ్మ, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, మండల కార్యదర్శులు కలేపల్లి మహేందర్, చిగుళ్ల లింగం, మారుపాక వెంకటేష్, అన్నమైన వెంకటేష్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పెరబోయిన మహేందర్, సిపిఐ సీనియర్ నాయకులు సిపిఐ జిల్లా సమితి సభ్యులు శ్రీధర్, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, అధ్యక్షులు ఎల్లంకి మహేష్, మండల కార్యవర్గ సభ్యులు బంగారి తదితరులు పాల్గొన్నారు.

## చెరువుగట్టులో స్వామి వారి ఏకాంత సేవ



**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** మండలం పరిధిలోని చెరువుగట్టు గ్రామంలో శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారికి పూర్ణాహుతి కార్యక్రమం చేపట్టి అనంతరం పుష్పోత్సవం ఏకాంత సేవలను ప్రధాన అర్చకులు శ్రీ పోతులపాటి రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యనిర్వాన అధికారి నవీన్ కుమార్, ఎస్ ఐ క్రాంతికుమార్,అర్చకులు సతీష్ శర్మ, శ్రీకాంత్ శర్మ పాల్గొన్నారు.

## ప్రతి ఎకరాకూ సాగునీరందించాలి : సిపిఐ



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని మర్రిపడిగ గ్రామంలో శనివారం సిపిఐ గ్రామశాఖ సమావేశం నిర్వహించడం జరిగింది. బోయిని బక్కయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిధులుగా యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లెం కృష్ణ, కుసుమాని హరిచంద్రలు హాజరై మాట్లాడారు. నవాబు పేట రిజర్వాయర్, బిక్కెరు కాలువ ద్వారా సాగు,తాగు నీరు అందించేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తూచా తప్పకుండా అమలు చేయాలని, ఆరు గ్యారెంటీలలో భాగంగా మిగిలిన పథకాలను అమలు చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలను ప్రతి గ్రామంలో అమలు చేయాలని ప్రభుత్వం కేవలం కొన్ని గ్రామాలనే ఎంచుకొని పథకాలను ప్రవేశపెట్టిందని తక్షణమే అన్ని గ్రామాలలో పథకాలను అమలు చేసి నిరుపేదలను అదుకోవాలని వారు కోరారు. అనంతరం మర్రిపడిగ నూతన కార్యదర్శిగా యాదయ్య, సహాయ కార్యదర్శిగా సత్తయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకొని, 11మంది కార్యవర్గ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈసమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య, మండల సహాయ కార్యవర్గ సభ్యులు పడకంటి సత్యనారాయణ, బిక్షం, వెంకటయ్య, యాదమ్మ పాల్గొన్నారు.

## 10న ప్రజావాణి రద్దు

**ప్రజాపక్షం/యాదాద్రి :** వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరగదని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలంతా గమనించి సహకరించాలని, ఫిర్యాదులు ఇచ్చేందుకు రావద్దని తెలిపారు.

## లక్ష్మీ నరసింహస్వామి సేవలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మి నరసింహస్వామిని రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ కుటుంబ సమేతంగా శనివారం సందర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వారికి ఆలయంలోకి స్వాగతం పలికారు. ప్రత్యేక ఏర్పాట్ల నడుమ ఆయన గర్భాలయంలోని స్వయంభులను దర్శించుకుని స్వామి వారి ఆశీస్సులను పొందారు. అనంతరం ముఖ మండపంలో పండితులు వారికి వేద ఆశీర్వచనాన్ని అందజేశారు. ఆలయ ఇఒ భాస్వర్రావు స్వామి వారి ఫోటోను జస్టిస్‌కు అందజేశారు.



## ప్రారంభమైన శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

ఈ నెల 12న స్వామివారి తిరుకల్యాణం

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** నార్కట్ పల్లి మండల పరిధిలోని గోపలాయిపల్లి శ్రీవారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో పది రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలను శనివారం ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ ఉత్సవాలు ఈ నెల 17వ తేదీ వరకు జరుగనున్నట్లు ఆయన వెల్లడించారు.10 రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవస్థాన అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి అంబటి నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదిశేషు పడగ నీడన స్వయంభుగా వెలిసిన స్వామివారి ప్రధాన ఆలయంతో పాటు కొండపై గల ఇతర ఉప ఆలయాలు, ఆంజనేయస్వామి,శ్రీ రామలింగేశ్వరస్వామి, ఆలయాలను రంగులతో తీర్చి దిద్ది , విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ గుట్టను చుసినట్లయితే సేద తీర్చుకుంటున్న ఆవును పోలి ఉండడంతో ఈ గుట్ట కు శ్రీవారిజాల వేణుగోపాల స్వామి ఆలయంగా పేరుగాంచినట్లు చరిత్ర లు చెపుతున్నవి.

**రుగ్మతలను వైదొలగించే మంత్రి బావి**

శ్రీ వారిజాల వేణుగోపాల స్వామి దేవస్థానం గుట్టపైన గల కోనేరుకు, మంత్రి బావి లకు ప్రత్యేకత ఉంది. ఎండాకాలంలో సైతం కోనేరులో నీరు సమృద్ధిగా ఉండడం ఈ కోనేటి విశేషం విశేషం. కోనేరు నిండా తామర చెట్ల ఆకులు పరుచుకుని విరబూసిన తామర పూలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఫ్లోరిన్ నీరు ఇక్కడ భూగర్భంలో ఉన్నప్పటికీ ఈ కోనేటి నీరు మాత్రం రుచికరంగా ఉండడం విశేషం. అదేవిధంగా గుట్టపై ఉన్న మంత్రిబావి మూల స్వామి గుట్ట సమీపంలో ఉంది. ఈబావి నీటిని మహిమ గలదని భావిస్తారు. బావిలోని నీరు ఎటు నుంచి వచ్చి, ఎటు వైపు పోతుందనేది నేటికీ అంతుబట్టని విషయం. ఈ నీటిని తాగినట్లయితే మానసిక రుగ్మతులు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. గతంలో సమీప రైతులు ఈ నీటిని తమ పంట పొలాలపై చల్లుకుని సాగుచేసేవరని స్థానికులు చెప్పుకొచ్చారు.

**బ్రహ్మోత్సవాలు ఇలా...** ఆలయ బ్రహ్మోత్సవాలను శనివారం ఉదయం శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణంతో శ్రీకారం చుడతారు. 9న ద్రావిడ



ప్రబంధ పారాయణం, తీర్థగోష్టి 10న పరమ పదోత్సవం, 11న ధ్వజారోహరణ,గరుడముద్ద, చాత్మర అంకురార్పణ, దేవతాహ్వానం, 12న శ్రీ స్వామివారి తిరుకల్యాణోత్సవం,హోమం, బలిహరణ,13న గరుడ సేవ,బలిహరణం,14న హనుమంతసేవ,15న గోపాలాయపల్లి లో గ్రామోత్సవం, గుట్ట పైన రాత్రి రథోవ్సము, 16న ఉదయం పూర్ణాహుతి, చక్రతీర్థం, దోపోత్సవం, 17న శతకలశాభిషేకం, ధ్వజపట ఉద్వాసన, శ్రీ పుష్పయాగం, ఏకాంత సేవ, పవళింపు సేవలతో ఉత్సవాలు పరిసమాప్తి అవుతాయి.

**మౌలిక సదుపాయలు కల్పించాం : ఆలయ చైర్మన్ కె.మోహన్ రెడ్డి**

10 రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాల కోసం ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**రవాణా ఏర్పాటు : ఇఒ అంబటి నాగిరెడ్డి**

శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలోజరిగే బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఆలయానికి వచ్చే భక్తులకు నార్కట్పల్లి చిట్యాల రహదారిలో ఆలయం ఆర్చీ ఎదుట ఆటోలు ఏర్పాటు చేశాం.

## బిసి జనాభాను తగ్గించారు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కుల గణనలో రాహుల్ గాంధీ మెప్పు కోసమే బిసి జనాభాను తగ్గించారని మున్సిపల్ వైస్ చైర్మన్, మున్నూరుకాపు సంఘం నాయకులు పుట్ట కిషోర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన మున్నూరుకాపు సంఘం నాయకుల సమావేశంలో మాట్లాడారు. 2011లో నిర్వహించిన సమగ్ర కుల గణన సర్వేలో మున్నూరుకాపులు 25లక్షల మంది ఉంటే ప్రసుత్తం 13లక్షలగా చూపించడం సరైంది కాదన్నారు. త్వరలోనే బిసిలు బిసి ఉపకులాలు కలిసి జెఎసిగా ఏర్పడి బిసిల వాటపై పెద్ద ఎత్తున ఉద్యమాలను నిర్వహిస్తామన్నారు. వెంటనే బిసిల కులగణనను సవరించాలన్నారు. లేని పక్షంలో సూర్యాపేట నుంటే బిసి ఉద్యమాన్ని ప్రారంభింస్తామన్నారు. ఈ సమావేశంలో మున్నూరుకాపు సంఘం నాయకులు నల్లగుంట్ల అయోధ్య, డేగల జనార్ధన్, సముద్రాల మనోహర్, గోనే సందీప్, కడియం శ్రీను, సతీష్, వెంకటేశ్వర్లు, అశోక్, కొండల్ పాల్గొన్నారు.

## 20శాతం నిధులు కేటాయించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ సభ్యులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ సమీపంలో గతంలో ప్రభుత్వం అవలంభించిన తీరును పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల వీరన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు ముప్పాని కృష్ణారెడ్డి, టిడిఎఫ్ రాష్ట్ర అడిట్ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలేబోయిన కిరణ్‌లు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాకముందు విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని ప్రకటించి నేడు విస్మరించిందన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ రాష్ట్ర నాయకులు బండి రవి, డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పబ్బతి వెంకటేశ్వర్లు, కొచ్చెర్ల వేము, రాచూరి ప్రతాప్, పుప్పాల రవి కుమార్, రేపాక లింగయ్య, వెంకటేశ్వరరావు, వెంకటనారాయణ, రమణ,



# ఫార్మాసిటీని రద్దు చేయాలని కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా

## మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** ఫార్మాసిటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత రైతులు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఫార్మాకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటానికి కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలుపుతూ... సంచలన నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో రైతులు చేస్తున్న ఫార్మా వ్యతిరేక ఉద్యమానికి అధికార కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపి ధర్నాలో రైతులకు సంఘీభావం ప్రకటించారు. యాచారం మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటు వల్ల భూములు కోల్పోతున్న మేడిపల్లి, నానక్ నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు పాల్గొని తమ భూములను ఫార్మా సిటికి ఇవ్వబోమని స్పష్టం చేశారు. అంతేకాకుండా తమ భూములను బలవంతంగా లాక్కోవద్దని, ఈ వ్యవహారం కోర్టులో ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి రైతులను కలెక్టరేట్‌కు శనివారం రావాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న నాలుగు గ్రామాల రైతులంతా పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఈ సందర్భంగా రైతులు రాజ్యాంగాన్ని రక్షించండి ఓటు ఆదేశాలను పాటించండి, భూములు ఉన్న రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని కోరుతూ నినాదాలతో ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. కలెక్టర్ లేదని కలెక్టరేట్ కార్యాలయం వర్గాలు తెలపడంతో రైతులు ఆగ్రహంతో వెనుతిరిగి పోయారు. ఫార్మాసిటి గ్రామాల్లోని బాధిత రైతులంతా ఏకమవుతుండటంతో రానున్న పంచాయితీ ఎన్నికల్లో వారి మద్దతు అవసరమని భావించి కాంగ్రెస్ నాయకులు రైతులకు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. యాచారం మండలానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపిపి శ్రీనివాస్ రెడ్డి, నానక్‌నగర్ మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు స్వయంగా రైతులతో స్థానికంగా జరిగిన ధర్నాతో పాటు కలెక్టరేట్ చేరుకొని తమ మద్దతు తెలపడం గమనార్హం.

# ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

## సేంద్రియ సాగును ప్రోత్సహించాలి

## మెగా ఆర్గానిక్ మేళాను ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఆరోగ్యం పట్ల ప్రజలు శ్రద్ధ వహించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహారపు అలవాట్లు కూడా మారుతున్నాయని దాని వల్ల అనారోగ్యాల బారిన పడుతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలోని టిడిపి ఆఫీస్ పక్కన గల సమీకృత కూరగాయల మార్కెట్ ఆవరణలో గ్రామ భారతి, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఆర్గానిక్ మేళాను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. రసాయనాలు ఎక్కువగా వినియోగించిన ఆహార పంటలను తినడం వల్ల అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. ముఖ్యంగా గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు ప్రజలు గురవుతున్నారన్నారు. జంక్, ఫాస్ట్ ఫుడ్‌లకు బదులు సేంద్రియ పద్ధతిలో ఎటువంటి రసాయనాలు వాడకుండా పండించిన పంటలను ఉపయోగించడం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని మంత్రి తెలిపారు. మన పూర్వీకులు మనం తినే ఆహార పదార్థాలను ఇంటి పెరట్లోనో, చేలల్లోనో పండించుకుని తినేవారని అందువల్లనే ఆరోగ్యంగా ఉండేవారని మంత్రి తెలిపారు. ఇప్పుడు ప్రజలు కూడా అవి ధంగా సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన ఆహార పంటలను వినియోగించాలని తెలిపారు. ప్రభుత్వం తరుపున కూడా సేంద్రియ సాగును ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆర్గానిక్ మేళాను ఏర్పాటు చేసిన నిర్వాహకులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. అనంతరం మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లమల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత నెలలో నిర్వహించిన ఆర్గానిక్ మేళాకు అపూర్వ స్పందన లభించిందని ఆయన తెలిపారు. వినియోగదారుల స్పందన మేరకు ప్రతి నెల రెండవ శనివారం, ఆదివారం ఆర్గానిక్ మేళాను గ్రామభారతి, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేళాలో సేంద్రియ పద్ధతిలో సాగు చేసి పండించిన కూరగాయలు, పండ్లు, చిరు ధాన్యాలు, దంపుడు బియ్యం, దేశవాళి ఆవు నెయ్యి, గానుగ నూనెలు, వనమూలికల పొడులు, పసుపు, బెల్లం, తేనె, చేనేత వస్త్రాలు, జూట్ బ్యాగులు వంటివి లభిస్తాయని తెలిపారు. ఆదివారం కూడా ఆర్గానిక్ మేళా ఉంటుందని ఆయన తెలిపారు. ప్రజల ఆరోగ్యం కోసం సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పంటలను ఉ పయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల నరేందర్, చావా నారాయణరావు, ఎఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రామభారతి బాధ్యులు కుతుంబాక మాధవి, రైతులు పాల్గొన్నారు.

## తెలంగాణలో బిజెపికి చోటు లేదు

### టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాజకీయ ముఖ చిత్రంలో బిజెపికి చోటు లేదని టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ బిజెపి నేతలు పగటికలలు మానుకోవాలి అని చురకలంటించారు. కెటిఆర్ ఒక పక్క మింగలేక కక్కలేక సతమతం అవుతుంటే.. బిజెపి గెలుపుతో ఆయన ఊహల్లో విహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కెసిఆర్ శకం ముగిసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో మరోసారి అధికారంలోకి తాము రావడం ఖాయం అని పేర్కొన్నారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలకు తెలంగాణకి ఏం సంబంధం ఉందని బిజెపి నేతలు సంబరపడుతున్నారు అని ప్రశ్నించారు. రాజకీయ పరిస్థితుల దృష్ట్యా తెలంగాణ ప్రజలు ఎప్పటికీ బిజెపి పార్టీని ఆదరించరు అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తితో ఉన్నారన్నారు. ఆరు గ్యారంటీలతో తెలంగాణ ప్రజల హృదయాల్లో కాంగ్రెస్ పార్టీ చిరస్థాయిగా నిలిచిపోతుందని స్పష్టం చేశారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలపై బిజెపి మేధోమథనం

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ఢిల్లీ ఎన్నికల పార్టీ విజయం పార్టీ శ్రేణుల్లో మరింత నైతిక స్థైర్యాన్ని నింపిందని, తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర మంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో శనివారం బిజెపి పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపి డి.కె.అరుణలతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలతో పాటు ఎమ్మెల్సీ అభ్యర్థులు, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల గెలుపు కోసం ప్రచార కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు వివరించేలా ప్రచారాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించారు.

## కెటిఆర్ మతిస్థిమితం కోల్పోయారు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.తారక రామరావు మతి స్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్ అన్నారు. హైదరాబాద్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పదవి కోల్పోయిన రోజు నుంచి కెటిఆర్ సిఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వాన్ని అస్థిరపర్చాలని కుట్రలకు పాల్పడుతున్నారని రామచంద్ర నాయక్ ఆరోపించారు. ఢిల్లీ ఫలితాలకు సిఎం రేవంత్ రెడ్డికి ఏం సంబంధమని, ఢిల్లీలో గత పదేళ్ల నుంచి కాంగ్రెస్ బలహీనంగా ఉందని, అక్కడ సిఎం రేవంత్ రెడ్డి ప్రచారం కూడా చేయలేదన్నారు. రేవంత్ రెడ్డిని నిందించడం కెటిఆర్ అవివేకానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కెటిఆర్ సోదరి ఎమ్మెల్సీ కవిత తన అవినీతి దాహంతో చివరికి ఆమ్ ఆద్మీ పార్టీని అస్తవ్యస్తం చేసిందని, ఆ పార్టీ గెలవకపోవడానికి కారణం కల్వకుంట్ల కవితనే అన్నారు. తెలంగాణ ప్రజలు చైతన్య వంతులని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు మరోసారి బుద్ధి చెప్పడం ఖాయమని రామచంద్ర నాయక్ పేర్కొన్నారు.

## నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యుత్తు లైన్ల మరమ్మతుల నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్తు సరఫరా నిలిచిపోనున్నట్టు సిబిడి సి–2 ఎడిఇ జి.నాగేశ్వర్‌రావు ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా బసంత్‌కాలనీ, లింగంపల్లి, వైశ్యహాస్టల్, వెంకట రమణ థియేటర్, జైన్‌మందిర్, కాచిగూడ ఎక్స్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని పేర్కొన్నారు. ఏక్‌మినార్ మసీదు, కృష్ణకాలనీ, శివాలయం, ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా జరగబోదని వివరించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించగలరని కోరారు.

## అమీర్‌పేట్‌లో గంజాయి అమ్మకాలు.. ఒకరి అరెస్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమీర్‌పేట్‌లో బైక్‌పై గంజాయి అమ్మకాలు నిర్వహిస్తున్న వ్యక్తిపై ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ టీం అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ దాడిలో 1.132 కేజీల గంజాయి, ఒక సెల్ ఫోను బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అమీర్‌పేట్‌కు చెందిన సయ్యద్ వాజిద్ రుమాన్, ఎండి అజార్‌లు గత కొంత కాలంగా గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే శనివారం అమీర్‌పేట్‌లో వీరిద్దరు అమ్మకాలు జరుపుతున్నారనే సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్ సిఐ బిక్షారెడ్డి, ఎస్‌ఐలు బాలరాజు, సధ్యలు వారిపై దాడి చేయగా రుమాన్ పట్టుబడగా అజార్ పరారయ్యాడు.

# బిసిలపై వైఖరి వెల్లడించాలి

## టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి కులగణనపై బిఆర్ఎస్, బిజెపిలు తమ వైఖరిని వెల్లడించాలని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవి బిసిలకు ఇచ్చే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. బిసి కులగణన చేసి సిఎం రేవంత్‌రెడ్డి బిసిల బాంధవుడు అయ్యారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల పార్టీ అనడానికి నిదర్శనం బిసి కులగణన అని అన్నారు. బిసి కులగణన పారదర్శకంగా జరిగిందని స్పష్టం చేశారు. బిసిలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం చారిత్రకమైన నిర్ణయం అని పేర్కొన్నారు. పది ఏళ్లు పాలించిన బిఆర్ఎస్ పార్టీ ఎందుకు ఈ పని చేయలేక పోయిందని ప్రశ్నించారు. బిజెపి పార్టీకి బిసిల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీలు బిసిలపై మొసలి కన్నీరు కారుస్తూ నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. బిసిలకు ద్రోహం చేసింది ఈ రెండు పార్టీలేనన్నారు. దేశ చరిత్రలో కులగణన జరగలేదని, తెలంగాణ రాష్ట్రంలో జరగడం గమనార్హం అన్నారు. పదేళ్లు పాలించి బిసిల కోసం ఏమి చేశాడో కెటిఆర్ చెప్పాలన్నారు. అసెంబ్లీలో కెటిఆర్ బిసిల గురించి మాట్లాడితే సిగ్గుగా ఉందని అన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. ఎస్‌సి వర్గీకరణ, బిసి కులగణనలతో కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిందన్నారు. బిసి కులగణనకు అమలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమా ర్ గౌడ్ ,మంత్రులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా రెసోనెన్స్ గురుకుల స్కూల్ వార్షికోత్సవం



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని రెసోనెన్స్ గురుకుల స్కూల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. 'రెసో దర్పణ్' పేరిట నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా సంగారెడ్డి డిఇఒ ఎస్ వెంకటేశ్వర్లు, పటాన్‌చెరు ఎంఈఒ నాగేశ్వర్ నాయక్, ప్రత్యేక అతిథులుగా నటుడు తనికెళ్ల భరణి, సిఐ స్వామి గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రెసోనెన్స్ విద్యాసంస్థల ఎండి ఎన్.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులను విద్యాపరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా ఎదగడానికి ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రేరణ, సంరక్షణ అనేవి తమ విద్యావిధానంలో అంతర్భాగాలని పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షకులను అలరించాయి. కార్యక్రమంలో సంస్థ తెలంగాణ అకడమిక్ డీన్ విద్యాసాగర్, ఎంజి మార్కండేయు లు, జిఎం మల్లేశ్, జోనల్ ఇన్‌ఛార్జ్ వాణి, ప్రిన్సిపాల్ రామకృష్ణ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ పోలీసులకు 122 పతకాలు



**ప్రజాపక్షం/ హైదరాబాద్:** కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో హైదరాబాద్ సిటీ పోలీసులు అద్భుతంగా రాణించారు. హైదరాబాద్ సిటీ పోలీస్‌కు చెందిన దాదాపు 236 మంది పోలీసు సిబ్బంది 26 విభాగాల్లో పోటీపడి 9 ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిళ్లతో పాటు 67 బంగారు, 32 రజత, 23 కాంస్య పతకాలను సాధించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ శుక్రవారం పతక విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా సివి ఆనంద్ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది ఎంత పని ఒత్తిడిలో ఉన్న క్రీడల్లో పథకాలు సాధించడం ఆషామాషీ కాదని పేర్కొన్నారు. క్రీడల్లో రాణించాలంటే క్రీడాకారులకు పట్టుదల అవసరమని అన్నారు. అంకితభావంతోపాటు కఠినమైన శిక్షణ అవసరం అన్నారు. క్రీడాకారులు దృఢత్వాన్ని కలిగి ఉండాలని తెలిపారు. తన పాఠశాల, కళాశాల సంవత్సరాలలో అథ్లెట్‌గా తన స్వంత అనుభవాలను గుర్తు చేశారు. రాబోయే ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో రాణించేలా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, వారికి పూర్తి పరిపాలనా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమములో అదనపు డిసిపిలు భాస్కర్, బి.కిష్టయ్య, కిషన్ రావు, ఎసిపి (సిఎఆర్ స్పోర్ట్స్ ఆఫీసర్), ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 11న టిజిఎస్ఆర్‌టిసి జెఎసి సమావేశం

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఆర్‌టిసిలో జరుగుతున్న పరిణామాలను సమీక్షించేందుకు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు టిజిఎస్ఆర్‌టిసి జెఎసి అత్యవసర సమావేశాన్ని ఈ నెల 11వ తేదీన ఉదయం 10 గంటలకు హైదరాబాద్ విద్యానగర్‌లోని టిఎంయు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు టిఎంయు చైర్మన్ ఇ.అశ్వత్థామరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జెఎసి భాగస్వామ్య సంఘాలు టిఎంయు, ఎన్ఎంయు, బిఎంఎస్, ఎస్‌టిఎంయు అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, ముఖ్య నేతలు, ఇతర అన్ని యూనియన్ల నాయకులు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

## డిఎంకెదే తూర్పు ఎరోడ్ సీటు

### ఉప ఎన్నికలో అధికార పార్టీ హవా




**ఎరోడ్ :** తూర్పు ఎరోడ్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో అధికార డిఎంకె ఘన విజయం సాధించింది. డిఎంకె అభ్యర్థి వి.సి.చందిరకుమార్ సమ ఎన్‌టికె పార్టీకి చెందిన ఎం.కె.సీతాలక్ష్మి పై 91,558 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. వచ్చే యేడాది అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ విజయం డిఎంకె పార్టీకి నూతానోత్సాహాన్ని అందించింది. చంద్రకుమార్‌కు 1,15,709 ఓట్లు దక్కించుకోగా, సీతాలక్ష్మికి 24,151 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికలో పలువురు స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేయగా, నోటా(నన్ ఆఫ్ ది ఎబౌ) 6,109 ఓట్లతో మూడో స్థానంలో నిలవడం గమనార్హం. మొత్తంగా 67.97 శాతంమంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

# ఇ-కామర్స్ వ్యాపారంలో మధ్యప్రదేశ్ కళాకారులు



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ఇ కామర్స్ కంపెనీ డెల్బెర్టో అందించిన శిక్షణ ద్వారా మధ్యప్రదేశ్ కళాకారులు తయారు చేసిన సావనీర్లను ప్రపంచ మార్కెట్‌కు తీసుకురావాలనే లక్ష్యంతో మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డు (ఎంపిటిబి) చేతివృత్తుల వారికి ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డు అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బిదిషా ముఖర్జీ మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డు చేతివృత్తులవారికి ఈకామర్స్ వ్యాపార శిక్షణ ఇచ్చిందని చెప్పారు. ఈ వేదికలో చేరడం ద్వారా, తమ చేతిపనులను ప్రపంచానికి తీసుకురావడమే కాకుండా, 'లోకల్ ఫర్ వోకల్' యొక్క ప్రాముఖ్యతను ప్రోత్సహించగలుగుతారు, అదే సమయంలో స్వయం సమృద్ధి సాధించి, స్వయం ఉపాధి అవకాశాలను అభివృద్ధి చేసుకో గలరని అన్నారు. ఆన్‌లైన్ ఈకామర్స్ కంపెనీ డెల్బెర్టో సహకారంతో ఎంపిటిబి రవీంద్ర భవన్‌లో జరిగిన లోక్రాంగ్ ఉత్సవం సందర్భంగా ఈ శిక్షణ ఇవ్వబడింది.ఆన్లైన్ మార్కెట్, ఈకామర్స్ వెబ్‌సైట్లలో తమ చేతివృత్తులు, సావనీర్లను నమోదు చేయడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా తమ మార్కెట్ పరిధిని విస్తరించవచ్చని కళాకారులను ప్రోత్సాహం అందిస్తున్నారు. శిక్షణలో, డెల్బెర్టో కంపెనీ శిక్షకులు ప్రతీక్, ప్రజ్ఞ కళాకారులతో సంభాషించారు. ఆన్‌లైన్, ఇకామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో క్రాఫ్ట్ ఉత్పత్తుల రిజిస్ట్రేషన్, అమ్మకం, బ్రాండింగ్ మొదలైన అంశాలపై వారికి శిక్షణ ఇచ్చారు. మధ్యప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుండి చేతివృత్తులవారు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

# పల్లెల్లో 'పంచాయతీ' సందడి

**రిజర్వేషన్ల కోసం ఆశావహుల ఎదురుచూపులు**

**ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నాయకులు**






**ప్రజాపక్షం / జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** స్థానిక ఎన్నికల సమరానికి ప్రభుత్వం సమాయత్తం అవుతుంది. రాష్ట్రంలో ఎన్నికల సంఘం ఏర్పాట్లలో వేగం పెంచడంతో పల్లెల్లో పండగ వాతావరణం మొదలవుతుంది. జిల్లా వ్యాప్తంగా ఆశావాహులతో వివిధ పార్టీల నాయకులతో రాజకీయం వేడెక్కింది. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలు, బూత్‌లెవల్ అధికారులు, బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేస్తుంది. మరోవైపు ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో పాటు సహాయ రిటర్నింగ్ అధికారులు సిబ్బందిని నియమించడానికి ఎన్నికల కమిషన్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఎప్పుడు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన ఎన్నికలు నిర్వహించే విధంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లలో వేగం పెంచారు. దీంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 11 మండలాలలో ఉన్న 240 గ్రామపంచాయతీలలో సర్పంచ్ ఎన్నికలు జరగనున్నా యి. పంచాయతీ పోరుతో పల్లెల్లో, గ్రామాలలో సందడి వాతావరణం నెలకొన్నది. అట్లాగే రిజర్వేషన్ల కోసం ఆశావహులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ నాయకుల్లో ఆశావహులు ఎక్కువగానే ఉన్నారు. అలాగే బిఆర్ఎస్, బిజెపి పార్టీలలో సైతం ఆశావహులు ఎక్కువగానే ఉన్నారు. కాని రిజర్వేషన్లు ఎలా వస్తాయి అనేదానిపై నాయకులు గందరగోళ వాతావరణంలో ఉన్నారు. రిజర్వేషన్లు వెలువడటంతో ఇంకా నాయకులు గ్రామాలలో తమ సత్తా చాటాలని ఈసారైన మళ్లీ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని పోటీలలో ఉండటానికి సిద్ధంగా ఉన్నారు. ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో నాయకులంతా గ్రామాల బాట పట్టారు. శుభ, అశుభకార్యక్రమాలకు హాజరై ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నాయకులు నిమఘ్నమయ్యారు. గ్రామంలో ఉన్న యూత్ కమిటీలు, ప్రజాసంఘాలు, కుల సంఘాలను కలిసి ఊరికి కావలసిన అవసరాలు తీరుస్తామని వారితో మంతనాలు జరుపుతూ పల్లెల్లో ప్రత్యేకంగా ప్రజలను ఆకర్శించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నోడల్ అధికారుల నియామకంతో పాటు సర్పంచ్, వా ర్డు సభ్యులకు సంబంధించిన గుర్తులను, బ్యాలెట్ పేపర్లను కేటాయించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2లక్షల 95వేల 246 మంది ఓటర్లకు గాను 2,0 44 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశారు.240 స్పంచ్ స్థానాలకు 2,044 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

**జిల్లాలో నోడల్ అధికారుల నియామకం :** జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అధికారులను నియమించారు.కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, భూపాలపల్లి ఆర్‌డిఒ రవి, జిల్లా మత్స్యశాఖ అధికారి, బ్యాలేట్ బాక్స్‌ల మేనేజ్‌మెంట్ జిల్లా పరిశ్రమల అధికారి సిద్దార్థ రెడ్డి, ట్రాన్స్‌పోర్టుకు జిల్లా రవాణ అధికారి ఎండి సంధాని, శిక్షణ కార్యక్రమాలు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం రాజేందర్, వ్యవసాయశాఖ అధికారి విజయ భాస్కర్, మెటిరియల్ మేనేజ్ మెంట్ జిల్లా ఎస్‌సి అభివృద్ధి అధికారి సునీత, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖర్చులు డిఆర్‌డిఒ సురేష్, వ్యయ నిర్వహణ జిల్లా అడిట్ అధికారి మానస, ఎన్నికల పరిశీలన జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్, బ్యాలెట్ పత్రాలు సిపిఒ బాబురావు, మీడియ కమ్యూనికేషన్ డిపిఆర్ఒ శ్రీనివాస్, హెల్ప్‌లైన్ పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాధ్, ఎన్నికల రిపోర్టులు జిల్లా బిసిఅభివృద్ధి కారి శైలజను నియమించారు.

**మండలాల వారీగా ఓటర్ల వివరాలు:** భూపాలపల్లి మండలం 26 మంది సర్పంచ్‌లు, 216 వార్డులకు 30, 364 ఓటర్లు, గణపురం మండలంలో 17 సర్పంచ్, 106 వార్డులు, 33580 ఓటర్లు, రేగొండ 35 సర్పంచ్‌లు, 314 వార్డులు, 47462 ఓటర్లు, మొ గుళ్లపల్లి 26 సర్పంచ్‌లు, 212 వార్డులు, 30, 547 మంది ఓటర్లు, చిట్యాల 24 సర్పంచ్‌లు,204 వార్డులు, 28,767 ఓటర్లు, 23 సర్పంచ్‌లు, 182 వార్డులు, 20, 053 ఓటర్లు ఉండగా కాటారం 24 సర్పంచ్, 210 వార్డులు, 30,672 ఓటర్లు, మహదేవ్‌పూర్‌లో 18 స ర్పంచ్‌లు 162 వార్డులు 25,232 ఓటర్లు ఉన్నారు. మల్హర్‌లో 15 మంది సర్పంచ్‌లకు 128 వార్డులు ఉం డగా 22,328 మంది ఓటర్లు,మహాముత్తారంలో 24 గ్రామాలు 196 మండి వార్డులు పలిమెలలో 8 సర్పంచ్‌లు 62 వార్డులు ఉండగా 5,536 మంది ఓటర్లు కలిగి ఉన్నారు.

## మోడల్ స్కూల్ ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/కల్వకుర్తి : వెల్దండ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను శనివారం అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలను సందర్శించి విద్యార్థుల, ఉపాధ్యాయుల రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్న సమయంలో పరీక్ష ఫలితాలను వందకి వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్స్ స్థాయిని పెంచాలన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి విద్యా ధికారి చంద్రుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



ప్రజాపక్షం/కల్వకుర్తి :వెల్దండ మండలపరిధిలోని అజిలాపూర్ గ్రామానికిచెందిన కేశమోని రాములయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బిఆర్ఎస్ నాయకుడు సిద్ధగొని రమేష్‌గౌడ్ ద్వారా సమాచారం తెలుసుకున్న రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్టుచైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొప్పు కృష్ణయ్య, ఆర్కేగౌడ్, మల్లేష్, బంగారు జంగయ్య,పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో కొండ చిలువ కలకలం



ప్రజాపక్షం/నాగర్ కర్నూల్ ప్రతినిధి : కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో కొండచిలువలు కలకలం రేపింది. గ్రౌండ్‌ఫ్లోర్‌లోని జి8 కార్యాలయం వెనుకభాగంలో చెట్లపొదల్లో రెండు కొండచిలువలు ఉద్యోగుల కంటపడ్డాయి. శనివారం ఉద్యోగులు కార్యాలయానికి వచ్చిన అనంతరం వెనుకభాగంలో ఏదో కదులుతున్నట్లుగా గమనించి వెంటనే స్నేక్‌క్యాచర్‌కు సమాచారం ఇవ్వడంతో వెంటనే వాటిని పట్టుకొని బంధించారు. ఆరు అడుగులపైనే ఉన్న రెండు కొండచిలువలు కనిపించడంతో ఉద్యోగులంతా ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.

## కల్లుగీత కార్మికుడు మృతి



ప్రజాపక్షం/నాగర్ కర్నూల్‌ప్రతినిధి: నాగనూలు గ్రా మాని కిచెందిన శ్రీనివాస్‌గౌడ్ (58) రోజు మాదిరిగానే తమ కులవృత్తిలో భాగంగా కల్లు గీసేందుకు తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాడు. ఈత చెట్టు పైకిఎక్కి కల్లుతీస్తున్న సమయంలో ఒక్కసారిగా చెట్టుపైనుంచి కిందపడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో శ్రీనివాస్ గౌడ్‌ను హుటాహుటిన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శ్రీనివాస్ గౌడ్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం నాగర్ కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడు శ్రీనివాస్‌గౌడ్‌కి భార్య, కుమార్తె, కొడుకు ఉన్నారు.

## దేశవిచ్ఛిన్నకర శక్తులను ఢిల్లీ ప్రజలు ఊడ్చేశారు



ప్రజాపక్షం/కల్వకుర్తి : దేశరాజధాని ఢిల్లీలో జరిగిన ఎన్నికలలో బిజెపి భారీ విజయం సాధించిన సందర్భంగా పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో బిజెపి నాయకులు స్వీట్లు పంచుకొని టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగామాజీ జాతీయ బిసి కమీషన్ మెంబర్ తల్లోజు ఆచారి పాల్గొని మాట్లాడుతూ దేశరాజధాని ఢిల్లీలో దేశవిచ్చిన్న శక్తులైన ఆమ్‌ఆద్మీపార్టీ, కాంగ్రెస్‌పార్టీలను ఢిల్లీప్రజలు తరిమేశారన్నారు. గతకొంతకాలంగా దేశరాజధానిని పీడిస్తున్న రెండు పార్టీలను పక్కకుపెట్టి ఢిల్లీకి రక్షణగానిలిచే బిజెపిపార్టీని గెలిపించారన్నారు. రానున్న స్థానికసంస్థల ఎన్నికలలో స్థానిక నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా గల్లీలో బిజెపి, ఢిల్లీలో బిజెపినినాదాన్ని నిజం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కల్వకుర్తి కన్వీ నర్ ఎన్నంశేఖర్‌రెడ్డి, రాష్ట్రనాయకులు బండల రామచందర్‌రెడ్డి, రాష్ట్రకౌన్సిల్ మెంబర్ దుర్గాప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య కృష్ణగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రాఘవేందర్‌గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నరేంద్ర శేఖర్‌రెడ్డి,పాల్గొన్నారు.

## బిజెపి నాయకుల సంబరాలు



ప్రజాపక్షం/జడ్చర్ల : దేశ రాజధాని ఢిల్లీలో బిజెపి గెలిచిన సందర్భంగా జడ్చర్ల పట్టణంలో బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో టపాకాయలు కాల్చి స్వీట్లు పం చడం జరిగింది. ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు కాబోతున్న సందర్భంగా గెలుపు సంబరాలు జరుపుకున్నట్లు తెలిపారు. బిజెపి నేతలు మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రజలకు అందుబాటులో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో దేశంలో అన్ని రాష్ట్రాలలో బిజెపి గెలుపు బాటలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యాక్షులు ఎంబీ బాలకృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ముచ్చర్ల కృష్ణయ్య, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్ గౌడ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు సాహితీరెడ్డి, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా యాదయ్య జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/జడ్చర్ల: జిల్లా జెడ్‌పి వైస్ చైర్ పర్సన్ కోడుగల్ యాదయ్య జన్మదిన వేడుకలను ఆయన నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. శనివారం జడ్చర్ల మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత ఆధ్వర్యంలో వార్డు కౌన్సిలర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున చేరుకుని కేకు కట్ చేసి పంపిణీ చేశారు. ముందుగా ఆయనకు శాలువాలు కప్పి పూల మాలలు వేసి ఘనంగా సత్కరించారు. వేరేస్పాటి మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, ప్రనిల్ చందర్, సుదర్శన్ గౌడ్, శంకర్ నాయక్, కర్ణ శ్రీను, బికే రెడ్డి, ఇంతియాజ్, సురేష్, కర్ణే శ్రీను, గిరి యాదవ్ పాల్గొన్నారు.

## నేడు మాదిగ ఉద్యోగుల సమాఖ్య

ప్రజాపక్షం/జడ్చర్ల : జడ్చర్లలో నేడు మధ్యాహ్నం 1 గంటలకు అంటే అంబేద్కర్ కళాభవనం నందు మాదిగ ఉద్యోగుల సమాఖ్య జడ్చర్ల గౌరవ అధ్యక్షులు కొంగలి మోహన్‌రాజ్ అసిస్టెంట్ కమిషనర్ జిఎస్‌టి డిఈపిటి యొక్క పదవి విరమణ అభినందన సభను పదవీ విరమణ విజయవంతం చేయడానికి సంఘం నిర్ణయించిందని ఈ సందర్భంగా తెలిపారు.

# క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

### ఎమ్మెల్యే మేఘారెడ్డి



ప్రజాపక్షం/వనపర్తిటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా క్రీడల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని యువత, ఉన్నత చదువులతో పాటు క్రీడలపై కూడ దృష్టి సారించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి పట్టణం 22వ వార్డు బాలాజీ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ క్రీడా ప్రాంగణాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఇంత పెద్ద బాక్స్ క్రికెట్ ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి క్రీడా శిక్షణను ఇస్తున్న యువకులు చంద్రకాంత్, సాయికాంత్, భాను ప్రకాశ్, గిరీష్‌లను ఎమ్మెల్యే అభినందించారు. ఆసక్తిగల క్రికెట్ క్రీడాకారులు ఈ క్రీడా ప్రాంగణాన్ని సద్వినియోగం చేసుకో వాలని ఎమ్మెల్యే సూచించారు. క్రీడల వలన జాతీయ అంతర్జాతీయ స్థాయిలోను గుర్తింపు పొందవచ్చునని దాంతో జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, సొంత గ్రామానికి పేరు ప్రఖ్యాతలు చేకూరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్ , వనపర్తి పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ య్య, వనపర్తి మండల మాజీ ఎంపీపీ కిచ్చా రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి గొల్ల వెంకటయ్య, మాజీ కౌన్సిలర్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సమయం వృథా చేయవద్దు

### గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : విలువైన సమయం వృథా చేయవద్దని, పదవ తరగతి వార్షిక పరీక్షలకు కేవలం 40 రోజులు సమయం మాత్రమే ఉందని, ఈ విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి విద్యార్థులకు సూచించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని సరస్వతి శశు మందిర్, ప్రియదర్శిన్ హైస్కూల్ కలాం ఇస్లామిక్ ఉన్నత పాఠశాల, ఎన్ పి సుబ్బారెడ్డి హైస్కూల్ లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే ఆత్మీయ కానుకగా డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ ను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు వారు విద్యార్థులకు ఆదేశాలమేరకు వారు విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ కు ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చేయుటకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, అందుకే పాలమూరు యూనివర్సిటీ లో నూతనంగా ఇంజనీరింగ్, లా కళాశాల ను మంజూరు చేయించారని మహబూబ్‌నగర్ ను ఎడ్యుకేషనల్ హబ్ గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఉన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడర్ రఘు, భరత్ కుమార్ ఎల్లంగారి, కైసర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులకు పాల్గొన్నారు.

## ఇవిఎం గోడౌన్ వద్ద భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన ఈవీఎం గోడౌన్ వద్ద భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల ఈవీఎంలు భద్రప రిచిన గోదాముల తనిఖీలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఈవీఎం గోదామును, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఐడిఓసి ఆవరణలో ఉన్న ఈవియం గోదాం ను భద్రపరిచిన గదుల సీల్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఈవీఎం గోదాము భద్రతకు నియమించిన సిబ్బంది హాజరు అదే విధంగా పోలీసు బందోబస్తు తదితర అంశాలను ఈవీఎం ఆవరణను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి కెవివి రవికుమార్, ఎన్నికల విభాగం డిటి జాఫర్ తదితరులు ఉన్నారు.

# స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి

### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్





ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : జిల్లాలో గ్రామీణ మహిళలకు మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్లు ప్రణాళికాబద్ధంగా అవగాహన కల్పించే పని చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలో మహిళాసంఘాల బలోపేతానికి పనిచేసే గ్రామ స్థాయి కమ్యూనిటీ రీసోర్స్‌పర్సన్లు , నూతనంగా జిల్లాకు కేటాయించిన సిఆర్పిలకు ఒకరోజు శిక్షణ తరగతులను జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి వచ్చి నాగర్‌కర్నూల్ జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు నాయకత్వ, పారిశ్రామిక, ఆర్థికస్వావలంభన దిశగా అడుగులుపడేలా కృషి చేయాల్సిన బాధ్యత, ఉందన్నారు. జిల్లాలో మహిళా సంఘాల ఏర్పాటు, ప్రోత్సాహం బలోపేతం చేయడానికి నాగర్‌కర్నూల్ జిల్లాలో కేటాయించిన మండలాల్లోని ఆయా గ్రామాలకువెళ్లి అవగాహన, శిక్షణ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. వారికి రుణాలను అందించివారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌తోపాటు, స్వయం సహాయక సంఘాలకు క్యాంటీన్ ఏర్పాటు చేసి మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రతి మహిళా సంఘాలు క్రమం తప్పకుండా సమావేశాలు, పొదుపు, అప్పుల మంజూరు, అప్పుల వసూళ్లు, శిక్షణ పొందిన బుక్ కీపర్ చేత సమర్థవంతంగా పుస్తకనిర్వహణ అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ శిక్షణ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధిసంస్థ జిల్లా అధికారి చిన్న ఓబులేసు, డిఆర్‌డిఎ అదనపుపిడి లక్ష్మి నారాయణ, గ్రామీణాభివృద్ధిసంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణానికి మార్కింగ్

### లబ్ధిదారులకు అవగాహన కల్పించే దిశగా అడుగులు



ప్రజాపక్షం/మఖ్తల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా లబ్ధిదారులకు అవగాహ కల్పించేందుకు ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదేశాలతో హౌసింగ్ అధికారులు స్థల పరిశీలన చేశారు. నియోజకవర్గ కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం ప్రాంగణంలో నమూనా ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.45 గజాల్లో ఒక బెడ్ రూమ్, హాల్, కిచెన్, బాత్ రూమ్, టాయిలెట్ ఉంటాయని చెప్పారు.నిర్మాణం పూర్తయిన తర్వాత లబ్ధిదారులకు ఇంటిని చూపించి, ఇదే తరహాలో కట్టుకునేలా ఎమ్మెల్యే సూచన మేరకు ప్రతి మండల కేంద్రంలో ఇలాంటి నమూనా ఇంటిని నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు శంకర్ పిడి, హరికృష్ణ డిఈ, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ ఏ. రవి కుమార్, రమేష్ పాల్గొన్నారు.

## నేతన్న' పొదుపు పథకానికి చేనేత కార్మికులు దరఖాస్తులు

ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి : నేతన్న పొదుపు పథకము (త్రిఫ్ట్ ఫండ్ ) కొరకు చేనేత కార్మికులు ఈ నెల 15 లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికులకు నేవన్న పొదుపు పథకం(త్రిఫ్ట్ ఫండ్ ) పునః ప్రారంభము చేసి నూతన మార్గదర్శకాలు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ పథకం యొక్క గడువు (24) నెలలుగా నిర్ణయించినట్లు తెలిపారు. చేనేత కార్మికులు, చేనేతకు అనుబంధమైన పనులలో ఉన్న (డైయింగ్ / డిజైనింగ్/వార్పింగ్/వైండింగ్), 18 సంవత్సరాల వయస్సు నిండి వారు ఆ పథకానికి అర్హులని తెలిపారు. కనీసం 50 % వార్షిక ఆదాయం చేనేత వృత్తి ద్వారా పొంది ఉండాలని, చేనేత కార్మికులు మగ్గము యొక్క జియో టాగ్ నెంబర్ను కలిగి ఉండాలని అన్నారు. దరఖాస్తు దారుడు తమ దరఖాస్తుతో ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్ కాపీ, ఆర్‌డి–1, ఆర్‌డి – 2 దరఖాస్తు ఫారములు, (6) పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు జతచేసి సహాయ సంచాలకులు, చేనేత జాళి శాఖ, రూం నెంబర్ 222, రెండవ అంతస్తు, జిల్లా కలెక్టర్ కార్యాలయం, మహబూబ్ నగర్ నందు సమర్పించాలని ఆయన తెలిపారు. చేనేత కార్మికుడు ఏ జాతీయ బ్యాంకులో తన అకౌంట్‌ను కలిగియున్నాడో అదే బ్యాంకులోనే చేనేత కార్మికుడు ఆర్‌డి – 1అకౌంట్‌లో ప్రతి నెల 15 లోగా జమచేస్తే ప్రభుత్వం (16%) వాటాను ఆర్‌డి– 2 అకౌంట్ లో జమచేయటానికి ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుందని ఆయన ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

# నూతన న్యాయ చట్టాలపై అవగాహన



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : నూతన చట్టాల ప్రకారం కేసుల దర్యాప్తు, విచారణలో పాటించవలసిన నూతన, విధానాల మీద క్రింది స్థాయి సిబ్బంది నుండి ఉన్నత స్థాయి అధికార మేరకు అందరు సంపూర్ణ సమజ్ఞానం, అవగాహన కలిగి ఉండాలని ఎస్‌పిడి.జానకి పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచించారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా పోలీస్ అధికారులకు కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త చట్టాల ద్వారా కేసుల విచారణ వేగంగా పూర్తవుతుందని, న్యాయ వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. సమాజంలో శాంతిభద్రతలు కాపాడటంలో నూతన చట్టాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. లీగల్ అడ్వైజర్ ఈపూరి రాములు నూ తనంగా అమలులోకి వచ్చిన భారత న్యాయ నియమావళి (బిఎన్ఎస్) భారత సాక్ష్య నిబంధన (బిఎస్ఎన్), భారత న్యాయ పరమైన భద్రతా నిబంధన (ఎన్ఎస్ఎస్) గురించి వివరించారు. ఈ చట్టాల ప్రకారం పోలీసు బాధ్యతలు, దర్యాప్తులో మార్పులు, న్యాయ పరమైన చర్యలు ఎలా ఉండాలనే అంశాలపై స్పష్టత ఇచ్చారు. డిజిటల్ నేరాలు, మహిళల భద్రత, పిల్లలరక్షణ, సైబర్‌నేరాలపై కొత్తచట్టాలు ఎలాసహాయపడతాయో వివరించారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ ఈపూరి రాములు ని జిల్లా ఎస్‌పి శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రాములు, డిఎస్‌పి వెంకటేశ్వర్లు, డిసిఆర్‌బి డిఎస్‌పి రమణరెడ్డి, డిటిసి డిఎస్పి గిరిబాబు, టూటౌన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓ పాల్గొన్నారు.

### జిల్లా ఎస్‌పి ఆధ్వర్యంలో ప్రజావాణి



మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌పి డి.జానకి సోమవారం జడ్చర్ల రూరల్ సర్కిల్ ఆఫీసు నందు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొననున్నారు. జిల్లా ప్రజలందరూ తమ సమస్యలు, ఫిర్యా దులు, వినతిపత్రాలను ప్రజావాణి కార్యక్రమం ద్వారా అధికారికంగా సమర్పించుకో వడానికి సర్కిల్ ఆఫీసుకు హాజరుకావాలన్నారు. అనం తరం ఫిర్యాదులు సకాలంలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారని ఈ సందర్భంగా తెలిపారు.

## స్థానిక ఎన్నికల్లో బిసి జెండా ఎగరేద్దాం

### జనరల్ సీట్లలో బిసి అభ్యర్థులను బరిలో దించుతాం

### బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



ప్రజాపక్షం/పెద్దమండడి : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి జెండా ఎగరేయాలని బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ పిలుపు నిచ్చారు. శనివారం పెద్ద మందడి మండలం వెల్టూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం వచ్చే ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. అన్ని జనరల్ సీట్లలో బిసి అభ్యర్థులను బరిలో దించుతామని , రాజ్యాధికారానికి మూలం స్థానిక సంస్థలని, వాటిని చేజిక్కించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బిసిలు ఏకమైన బిసిఅభ్యర్థులు గెలిచేందుకు బిసి కులాలు ఐక్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జేఏసి మండల అధ్యక్షుడు రమేష్ సాగర్ , నాయకులు మ్యాదరి రాజు, కురువ నర్సింహ, బోయ చెంద్రాయుడు, కుర్మరి రాజు, చాకలి సాయులు, తిరుపతయ్య, దిండు శివసాగర్ , మూలమల్ల రాజు, కృష్ణయ్య, ఉప్పరి చెంద్రాయుడు, నవీన్ , సత్యన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కుట్టు శిక్షణ కేంద్రం పరిశీలన



ప్రజాపక్షం/వనపర్తి : వనపర్తి పట్టణంలోని 22వ వార్డు బాలాజీనగర్‌లో గల కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సందర్శించారు. ఆయన నిర్వాహకురాలు హసీనాతో శిక్షణ కేంద్ర వివరాలను అడిగి తెలుసు కున్నారు. గతంలో రామానంద తీర్థ స్వచ్ఛంద సంస్థ వారు ఈ కేంద్రంను ఏర్పాటు చేశారని తదనంతరం తామే కొనసాగిస్తూ నేటి వరకు 2 నుంచి 3వేల మంది మహిళళకు కుట్టు శిక్షణను ఇచ్చామని ప్రస్తుతం ఈ కేంద్రంలో 30 కుట్టుమిషన్లు ఉన్నాయని తెలిపారు. తమకు ప్రభుత్వ సహాయ సహకారాలు ఉండేలా చూడాలని వారు ఎమ్మెల్యేని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కొత్త శిక్షణ కేంద్రాన్ని బలోపేతం చేసేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని మహిళలకు హామీనిచ్చారు.

## వేంకటేశ్వర స్వామి ఆలయంలో చిన్నారెడ్డి పూజలు



ప్రజాపక్షం/పెద్దమండడి : మండల జంగమయ్య పల్లి గ్రామంలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారిని రాష్ట్ర ప్రణాళికి సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి, కొమ్మలగట్టు లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయంలో చిన్నారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, చిన్నారెడ్డిని శాలువాతో సన్మానించారు. జంగమయ్యపల్లి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బాలచందర్ , పెద్దమండడి మండల బీసీ సెల్ అధ్యక్షుడు రఘు, నిలేందర్ , నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిల్వ రేషన్ బియ్యం పట్టివేత



ప్రజాపక్షం/నారాయణపేట :నారాయణపేట జిల్లా కేంద్రంలో అప్పిరెడ్డిపల్లికి చెందిన అనంతయ్య అనే వ్యక్తి చుట్టు పక్కల ఇళ్ల నుండి రేషన్ బియ్యం సేకరించి సుభాష్ రోడ్‌లో రేకుల షెడ్డులో నిల్వ చేసిన బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ , నారాయణపేట పోలీసులు దాడులు నిర్వహించారు. దాడులలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కి తరలించినట్లు అధికారులు తెలిపారు. డిటి కాలప్ప పంచనామా అనంతరం అనంతయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అంజిలయ్య తెలిపారు. నారాయణపేట జిల్లాలో అక్రమంగా పిడిఎస్ రైస్ నిల్వ ఉంచిన, రవాణా చేసిన, ఇతరుల అమ్మిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

## ఇందిరమ్మ మోడల్ ఇండ్లకు శంకుస్థాపన



ప్రజాపక్షం/మాగనూర్ : ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం కోసం మాగనూర్ మండల కేంద్రం ఎంపిడిఓ కార్యాలయం ఆవర ణలో శనివారం అధికారులు భూమి పూజ చేశారు. ఎమ్మార్వో బి. సురేష్ కుమార్ టెంకాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి జి.శంకర్, డిఈ ఎం.హరికృష్ణ, ఎంపిడిఓ రహ్మాతుద్దీన్, కాంగ్రెస్ పార్టీ మాగనూరు మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్ , నాయకులు వాకిటి శ్రీనివాసులుతో పాటు ఎంపిడిఓ , ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్‌ను కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి



ప్రజాపక్షం/మక్తల్: రాష్ట్ర నీటిపారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని మఖ్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. సోదరుడు వాకిటి శేషగిరితో కలిసి మంత్రిని కలిసిన ఎమ్మె ల్యే నియో జకవర్గ పరిధిలో నీటిపారుదల, పౌర సరఫరాల శాఖకు సంబంధించిన పెండింగు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖకు సంబం ధించిన పెండింగు విషయాలపై చర్చించారు. సంగంబండ ప్రాజెక్టు పరిధిలో దశాబ్దాల నుంచి పెండింగులో ఉన్న బండరాయి సమస్యను అడిగిన వెంటనే పరిష్కరించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు సైతం చేపట్టాలని కోరారు.

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది : శంకర్

ప్రజాపక్షం/వనపర్తి : ఉపాద్యాయ వృత్తి అన్నిటికన్నా పవిత్రమైనదని సాహితి కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. గతవారం పదవీ విరమణ చేసిన గోపాల్ పేట గెజిటెడ్ హెడ్మాస్టర్ టి. రమాకాంత్ ను సాహితి కళా వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. వనపర్తి రేడియంట్ హై స్కూల్ లో జరిగిన కార్యక్రమంలో రమాకాంత్ దంపతులను వేదిక సభ్యులు శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళా వేదిక ప్రతినిధి జనజ్వాల, కందూరు నారాయణరెడ్డి, డిసిఈబి జిల్లా సెక్రటరీ సూరచంద్రశేఖర్ , దేశ్ రాములుయాదవ్ , సత్తార్ , వ్యాఖ్యాత భైరోజు చంద్ర శేఖర్ , బండారి శ్రీనివాసులు, నందిమల్ల రాములు, గంధం నాగరాజు, బాలస్వామి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

ఫోకస్


'సుగర్' రేపై బలమైన లెఫ్ట్ ఇన్నర్ కప్ పంచ్ విసురుతున్న నోరిస్ (ఎడమ)

## 33 ఏళ్ల క్రితం... ఇదే రోజు

అమెరికా బాక్సర్ 'సుగర్' రే లియోనార్డ్ కెరీర్‌కు సరిగ్గా 33 ఏళ్ల క్రితం ఇదే రోజు (ఫిబ్రవరి 9) దాదాపుగా తెరపడింది. ఆ తర్వాత అతను ఒక ఫైట్‌లో పాల్గొని మరింతగా పరువు పోగొట్టుకున్నాడు. ప్రపంచ హెవీవెయిట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో ఉన్న టెర్రీ 'టెరిబుల్' నోరిస్‌నుతో తలపడే సాహసం 'సుగర్' రే చేశాడు. 1991 ఫిబ్రవరి 9న న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరిగిన ఫైట్ దాదాపు ఏకపక్షంగా కొనసాగింది. రెండో రౌండ్ ముగియడానికి కేవలం 10 సెకన్ల సమయం ఉన్నప్పుడు, నోరిస్ విసిరిన బలమైన పంచ్‌ని తట్టుకోలేక 'సుగర్' రే కింద పడిపోయాడు. అతి కష్టం మీద నిలబడిన అతనిపై నోరిస్ బలమైన పంచ్‌తో మరోసారి దాడి చేశాడు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించవద్దని రిఫరీ అతనిని హెచ్చరించాడు. మరోసారి అలాంటి పొరపాటు చేస్తే, పోటీకి అనర్హుడిగా ప్రకటిస్తానని నోరిస్‌కు స్పష్టం చేశాడు. అనంతరం నాలుగు రౌండ్లు హోరాహోరీగా ముగిశాయి. ఏడో రౌండ్‌లో 'సుగర్' రేపై లెఫ్ట్ హుక్‌ను సంధించిన నోరిస్, ఆ తర్వాత లెఫ్ట్‌రైట్ కాంబినేషన్‌తో విరుచుకుపడ్డాడు. అప్పటికి 23 సంవత్సరాల 7 నెలల వయసుగల నోరిస్ బలమైన పంచ్‌లను తట్టుకోవడం 35వ ఏట అడుగుపెట్టనున్న 'సుగర్' రేకు సాధ్యం కాలేదు. కాన్వాస్‌పై కుప్పకూలిన అతను మళ్లీ లేవలేకపోయాడు. నోరిస్ తన హెవీవెయిట్ బాక్సింగ్ టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. ఫైట్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ బాక్సింగ్ కెరీర్‌కు గుడ్‌బై చెప్తున్నట్టు 'సుగర్' రే ప్రకటించాడు. కానీ, మనసు మార్చుకొని, 1997లో, హీక్టర్ కామచోతో పోటీకి సిద్ధమయ్యాడు. కానీ, ఆ ఫైట్‌లోనూ అతను తన ప్రత్యర్థికి గట్టిపోటీ ఇవ్వలేకపోయాడు. రెండో రౌండ్‌లోనే కామచో విసిరిన పంచ్ వల్ల అతని కంటి పైభాగంలో తీవ్రగాయమైంది. కానీ, పట్టుదలతో పోరును కొనసాగించాలనే నిర్ణయించుకున్నాడు. కానీ, మరో ఐదు రౌండ్ల తర్వాత 'సుగర్' రే నెత్తురోడుతుండడంతో రిఫరీ ఫైట్‌ను నిలిపివేశాడు. ఫైట్‌లో ఫలితాన్ని ప్రకటించలేదు. కాగా, ఈ ఫైట్ అనంతరం 'సుగర్' రే బాక్సింగ్ కెరీర్‌కు తెరపడింది. 1998 ఫిబ్రవరి 15న టోనీ మెనెఫీతో పోరు ఖరారు చేసుకున్నప్పటికీ, చివరి క్షణాల్లో ఆ పోటీ నుంచి వైదొలిగాడు. 'సుగర్'రే తన కెరీర్‌లో 38 ఫైట్స్‌లో పాల్గొనగా 36 విజయాలు సాధించాడు. వాటిలో 25 నాకౌట్ ద్వారా సంపాదించినవే కావడం గమనార్హం. ఒక ఫైట్‌లో పరాజయాన్ని ఎదుర్కొన్నాడు. ఒక ఫైట్‌లో ఫలితం తేలలేదు.

# చరిత్ర పుటల్లో గాలే టెస్టు

గాలే వేదికగా ఆస్ట్రేలియా, శ్రీలంక జట్ల మధ్య ఈనెల ఒకటో తేదీన ముగిసిన మొదటి టెస్టు చరిత్ర పుటల్లో నిలిచిపోనుంది. అందుకు మొదటి కారణం శ్రీలంక తరఫున కేవలం నలుగురు బౌలర్లు మాత్రమే బౌలింగ్ చేయగా, ఆస్ట్రేలియా ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా లేటు వయసులో తన తొలి టెస్టు డబుల్ సెంచరీ సాధించడం. వివరాల్లోకి వెళితే, టాస్ గెలిచిన ఆస్ట్రేలియా 154 ఓవర్లలో ఆరు వికెట్లకు 654 పరుగులు సాధించగా, ఖవాజా 352 బంతులు ఎదుర్కొని, 16 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 232 పరుగులు చేశాడు. టెస్టు కెరీర్‌లో అతనికి ఇదే తొలి డబుల్ సెంచరీ. అతను 38 సంవత్సరాల 43 రోజుల వయసులో ఈ ఫీట్ సాధించాడు. 38 సంవత్సరాలు దాటిన తర్వాత డబుల్ సెంచరీ చేసిన 12వ బ్యాట్స్‌మన్‌గా ఖవాజా గుర్తింపు సంపాదించాడు. డాన్ బ్రాడ్‌మన్, వినూమన్కడ్ వంటి గొప్పగొప్ప ఆటగాళ్లు ఈ జాబితాలో ఉన్నారు. కాగా, టెస్టుల్లో డబుల్ సెంచరీ చేసిన అత్యంత ఎక్కువ వయసు ఆటగాడు ఎరిక్ రోవన్ (దక్షిణాఫ్రికా). 1924లో, లార్డ్‌లో జరిగిన టెస్టులో, ఇంగ్లాండ్‌పై తన తొలి, ఆఖరి డబుల్ సెంచరీ నమోదు చేసినప్పుడు అతని వయసు 42 సంవత్సరాల 236 రోజులు. ఆ మ్యాచ్‌లో 211 పరుగులు చేసిన అతను, టెస్టుల్లో డబుల్ సెంచరీ సాధించిన ఎక్కువ వయసుగల బ్యాట్స్‌మన్‌గా అతని పేరు రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించింది. రోవన్ మాదిరిగానే టెస్టు కెరీర్‌లో తొలి డబుల్ సెంచరీ చేసినప్పుడు ఇంగ్లాండ్ ఆటగాడు పాట్సీ హెండ్రెన్ వయసు 41 సంవత్సరాలు. పోర్ట్ ఆఫ్ స్పెయిన్ వేదికగా 1930లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్టులో అతను 'డబుల్' సాధించాడు. 40 ఏళ్ల వయసులో, టెస్టు డబుల్ సెంచరీ చేసిన ఆటగాళ్ల జాబితాలో డూడ్లీ నార్సే (దక్షిణాఫ్రికా), వినూ మన్కడ్ (భారత్), ఆండీ సంధామ్ తదితరులు ఉన్నారు. వీరంతా ఖవాజా కంటే ఎక్కువ వయసులో తమతమ తొలి టెస్టు డబుల్ సెంచరీని నమోదు చేశారు. ఏదిఏమైనా 38 ఏళ్లు పూర్తి చేసుకున్న తర్వాత కెరీర్‌లో ఖవాజా తొలి టెస్టు డబుల్ సెంచరీ సాధించడం విశేషం.ఇక ఒక టెస్టు ఇన్నింగ్స్‌లో కేవలం నలుగురు బౌలర్లను మాత్రమే బరిలోకి దించడం అరుదైనప్పటికీ, గతంలోనూ పలు సందర్భాల్లో చోటు చేసుకున్నదే. అయితే, శ్రీలంక కేవలం నలుగురు బౌలర్లతో మాత్రమే బౌలింగ్‌ను కొనసాగించగా, ఆస్ట్రేలియా


ఉస్మాన్ ఖవాజా

6 వికెట్లకు 654 పరుగులతో కొత్త చరిత్ర సృష్టించింది. 1981లో, అడెలైడ్‌లో భారత్ కూడా ఇదే విధంగా నలుగురు బౌలర్లతో మాత్రమే ఆటను కొనసాగించినప్పుడు, ఆస్ట్రేలియా 528 పరుగులు చేసింది. ఆ రికార్డు ఇప్పుడు బద్దలైంది. ఫస్ట్ క్లాస్ క్రికెట్ కూడా ఆసీస్ స్కోరు రికార్డుగానే ఉంది. 1987లో, పోర్ట్ ఎలిజబెత్‌లో జరిగిన అనధికార టెస్టులో దక్షిణాఫ్రికాపై ఆస్ట్రేలియా ఎలెవెన్ జట్టు 533 పరుగులు సాధించింది. ఆ రికార్డును కూడా అధిగమించడం వల్లే, గాలే టెస్టులో ఆస్ట్రేలియా ప్రదర్శన సరికొత్త రికార్డు సృష్టించింది. ఆ మ్యాచ్‌లో శ్రీలంక తరఫున నలుగురు బౌలర్లు, అసిత ఫెర్నాండో (15 ఓవర్లలో 77 పరుగులు), నిషాన్ పైరిస్ (41 ఓవర్లలో 89 పరుగులు), ప్రశాంత జయసూర్య (60 ఓవర్లలో 193 పరుగులకు 3 వికెట్లు), జెఫ్రె వాండర్సే (38 ఓవర్లలో 182 పరుగులకు 3 వికెట్లు) బౌల్ చేశారు. ఆస్ట్రేలియా 654 పరుగుల భారీ స్కోరుకు సమాధానంగా శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 165, రెండో ఇన్నింగ్స్‌లో 247 పరుగులకే ఆలౌటైంది. ఇన్నింగ్స్ 242 పరుగుల భారీ తేడాతో పరాజాన్ని ఎదుర్కొంది.


రోవన్

## మీకు తెలుసా?

క్రికెట్ చరిత్రలోనే అధికారిక బంతి వేయకుండా, తొలి వికెట్ సాధించిన ఏకైక ఆటగాడు విరాట్ కోహ్లీ. కోల్‌కతాలోని ప్రతిష్టాత్మక ఈడెన్ గార్డెన్స్ మైదానంలో 2011 అక్టోబర్ 29న జరిగిన టి20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లో కోహ్లీ తన తొలి ఓవర్ తొలి బంతిని వైడ్‌గా వేశాడు. వైడ్‌ను ఓవర్‌లో ఒక అధికారిక బంతిగా గుర్తించరు. కాగా, ఇంగ్లాండ్ బ్యాట్స్‌మన్ పీటర్సన్ క్రీజ్ వెలుపలికి దూసుకొచ్చి, భారీ షాట్ కొట్టడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. వికెట్‌కీపింగ్ చేస్తున్న మహేంద్ర సింగ్ ధోనీ స్టంప్ చేయడంతో పీటర్సన్ అవుటయ్యాడు. దీనితో '0' బంతులకే ఒక వికెట్ పడగొట్టిన ఏకైక ఆటగాడిగా కోహ్లీ పేరు రికార్డు పుటల్లో చేరింది. క్రికెట్‌కు సంబంధించిన ఏ ఫార్మాట్‌లోనూ ఇలాంటి రికార్డు లేదు. మొత్తం మీద ఆ మ్యాచ్‌లో కోహ్లీ 2.4 బంతులు వేసి,



13 పరుగులిచ్చాడు.

### నాద్‌కర్ణి మెయిడెన్ల రికార్డు

అంతర్జాతీయ స్థాయి క్రికెట్‌లో ఒకటి రెండు మెయిడెన్ ఓవర్లు వేయడమే కష్టం. కానీ, అభిమానులు 'బాపూ' నాద్‌కర్ణిగా పిలుచుకునే రమేశ్‌చంద్ర గంగారామ్ నాద్‌కర్ణి ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా, వరుసగా 21 మెయిడ్ ఓవర్లు బౌల్ చేసి, రికార్డు నెలకొల్పాడు. 1964లో ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టులో సాధించిన ఈ ఫీట్‌ను ఇప్పటి వరకూ ఎవరూ ఛేదించలేకపోయారు. మొత్తం మీద ఆ మ్యాచ్‌లో నాద్‌కర్ణి 32 ఓవర్లు బౌల్ చేశాడు. వాటిలో 27 మెయిడిన్లు. 5 పరుగులిచ్చాడు. అతనికి వికెట్ లభించలేదు. ఈ జాబితాలో రెండో స్థానం కూడా భారత క్రికెటర్‌కే దక్కడం విశేషం. 2015లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో రవీంద్ర జడేజా వరుసగా 15 మెయిడిన్లు బౌల్ చేశాడు. ఆ ఇన్నింగ్స్‌లో అతను 46 ఓవర్లు వేయగా, అందులో 33 మెయిడిన్లు. 26 పరుగులకు రెండు వికెట్లు సాధించాడు. కాగా, వెస్టిండీస్‌కు చెందిన జోయ్ కారీ 1968లో ఇంగ్లాండ్‌పై 15 వరుస మెయిడిన్లతో, ఈ జాబితాలో మూడో స్థానాన్ని ఆక్రమించాడు. అతను ఆ ఇన్నింగ్స్‌లో 25 ఓవర్లు వేశాడు. వాటిలో 18 మెయిడిన్లు. 23 పరుగులకు ఒక వికెట్ పడగొట్టాడు.



# సింగరేణిలో పెరిగిన రాజకీయ జోక్యం

- స్ట్రక్చర్ మీటింగ్‌లో నిర్ణయాల అమలులో నిర్లక్ష్యం
- నూతన బొగ్గు గనులు రాకుంటే సింగరేణి మనుగడ ప్రమాదం
- సింగరేణి అభివృద్ధికి దశలవారీగా పోరాటాలు
- ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్




ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : గత ఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.30 వేల కోట్లు సింగరేణికి బకాయి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.33 వేల కోట్ల బకాయి పెరిగిందని, సింగరేణిలో గతం కంటే రాజకీయ జోక్యం ఎక్కువైందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఆరోపించారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో భూపాలపల్లి బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాజ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ, సింగరేణిలో కార్మిక సమస్యలపై యాజమాన్యం జవాబుదారితనంగా పనిచేయడం లేదన్నారు. స్ట్రక్చర్ మీటింగ్‌లో నిర్ణయాలు అలవెన్స్‌లు, క్యాడర్ స్కీం, మారుపేర్లు, డిస్మిస్లు స్ట్రక్చర్ మీటింగ్‌లో జరిగిన ఫలాలను అమలు చేయడంలో యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. సింగరేణిలో ఇద్దరు డైరెక్టర్ల పదవి కాలం ముగిసిన మళ్లీ నియమించలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని అన్నారు. వారి పదవి కాలం ఎక్స్టెండ్ చేయకుండా కాలయాపన చేశారని అన్నారు. దీంతో సింగరేణి సమస్యలు పెండింగ్ పడుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇంకా రాజకీయ జోక్యంతో అనేక పైరవీలు ట్రాన్స్‌పర్లు విచ్చలవిడిగా డబ్బులు తీసుకొని పైరవీలు చేస్తున్నారని అన్నారు. కోడ్ ఆఫ్ డిసిప్లేన్ పేరుతో అనేక స్కీములను వాయిదా వేస్తున్నారని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం కంటే రెట్టింపు పైరవీలు జరుగుతున్నాయని అన్నారు. అట్లాగే నూతన బొగ్గు గనులు ఏర్పాటు చేయకపోవడమే కాకుండా ప్రైవేటు సంస్థల చేతుల్లోకి ఉత్పత్తి, ఉత్పాదకాలను అప్పజెప్పి సింగరేణిని నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతుందని అన్నారు. సింగరేణికి నూతన గనులు రాకుంటే భవిష్యత్తు లేదని, సింగరేణి అభివృద్ధి కోసం కొత్త బావుల ఏర్పాటు కోసం ముఖ్యమంత్రిని, సిఎండిని కలిసి కార్మిక సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యంపై ఒత్తిడి తేవడానికి ఎఐటియుసి దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. భవిష్యత్తులో సింగరేణి అభివృద్ధి కోసం చేసే ప్రయత్నంలో ఇతర సంఘాలు కూడా కలిసి రావాలని, ఒక ఏఐటీయూసీని బాధ్యులుగా చేసి ఇతర సంఘాలు ఆరోపించడం సరైనది కాదని, సింగరేణి అభివృద్ధిలో మాతోపాటు కలసి రావాలని ఆయన ఇతర సంఘాలకు విజ్ఞప్తి చేశారు. లేకుంటే రాబోయే రోజుల్లో కార్మికుల్లో మీకు చుక్క ఎదురవుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామ్ చందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గురుజపెల్లి సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్ నాయక్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల సాధనకై రాజీలేని పోరాటాలకు సిద్ధం

ఎఐటియుసి కేంద్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి



ప్రజాపక్షం/కాసిపేట : సింగరేణిలో పనిచేసే కార్మికులకు పనిచేసే ప్రదేశాల్లో సరైన పనిముట్లు లేక అధిక పనిభారంతో మానసిక ఆవేదనకు గురవుతున్నారని, కోల్ మైన్స్ రెగ్యులేషన్ ప్రకారంగా వర్క్ నామ్స్ అమలు పరచాలని ఎఐటియూసి కేంద్ర ఉపాధ్యాక్షులు మిట్టపల్లి వెంకటస్వామి డిమాండ్ చేశారు. శనివారం సింగరేణి కాలర్స్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో కాసిపేట 2వ ఇంక్లైన్ పై ఫిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్ అధ్యక్షతన ద్వార సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్ర ఉపాధ్యాక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి, బెల్లంపల్లి బ్రాంచ్ ఇంచార్జ్ చిప్ప నర్సయ్య, బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్‌లు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పని చేస్తున్న కార్మికులకు పని ప్రదేశాల్లో సరైన పనిముట్లు, డబుల్ స్టాఫ్ రేకులు, డ్రిల్ రాడ్స్ సేఫ్టీ గ్లౌజులు, బూట్లు లేక కార్మికులు అధిక పని భారంతో మానసిక ఆవేదనకు గురి అవుతున్నారని అన్నారు. కూల్ మెంట్స్ రెగ్యులేషన ప్రకారం వర్క్ నన్స్ అమలు పరచాలని, బొగ్గు ట్రాన్స్‌పోర్ట చేసే లారీలు సమయానికి అందుబాటులో లేక డంపింగ్ చేయడం వలన బొగ్గు నాణ్యత తగ్గి సంస్థకు నష్టం కలుగుతుందన్నారు. వెంటనే పైస్థాయి అధికారులు ట్రాన్స్‌ఫర్ విషయంలో చర్యలు తీసుకోవాలని అన్నారు. గుర్తింపు సంఘంగా స్ట్రక్చర్ మీటింగ్ జరపాలి కానీ స్ట్రక్చర్ మీటింగ్ జరపడం లేదని, ఒకసారి జరిగిన స్ట్రక్చర్ మీటింగ్‌లో జరిగిన ఇంప్లిమెంట్ జరగడం లేదని అన్నారు. సింగరేణిలో పైస్థాయి డైరెక్టర్లు లేక కార్మిక సమస్యలపై డైరెక్టర్ సమావేశాలు నిర్వహించలేకపోతున్నారని, దాని వల్ల అనేక సమస్యలు పేరుకుపోతున్నాయని విమర్శించారు. సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం పెరిగిపోవడం వల్లనే డైరెక్టర్లు అలాగే సిఅండ్ఎండిని నియమించే విషయంలో ఆలస్యం జరుగుతుందని వెంటనే డైరెక్టర్లను అలాగే పూర్తిస్థాయి సిఅండ్ఎండిని నియమించాలని పేర్కొన్నారు. పారిశ్రామిక విధి విధానాలపై కార్మికుల యొక్క హక్కుల సాదన కోసం రానున్న రోజుల్లో సింగరేణి వ్యాప్తంగా సేవ్ సింగరేణి అనే నినాదంతో కార్మికులందరిని చైతన్య పరిచి రాజకీయ జోక్యాన్ని అడ్డుకుంటామని అన్నారు. కొన్ని జాతీయ సంఘాలు కుట్రపూరితంగా అర్థంలేని తప్పుడు ఆరోపణలతో ఎఐటియూసి పై నిందలు వేస్తున్నారని అన్నారు. ఈ ఆరోపణలను ఎఐటియూసి ద్వారా ఖండిస్తున్నామని అన్నారు. అనంతరం ఎఐటియూసి యూనియన్‌లో 13 మంది ఉద్యోగులకు కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో ఫిట్ కమిటి ఉపాధ్యాక్షుడు కొండపల్లి నర్సయ్య, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరి బొద్దుల వెంకటేష్, వర్క్‌మెన్ ఇన్స్‌పెక్టర్ సుభాష్, చంద్రబోష్, జోగు కేతన్, రాజ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## లింగ వివక్షలేని సమాజం కోసం పోరాడాలి

ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన



ప్రజాపక్షం/సూర్యాపేట: లింగవివక్ష లేని సమాజం కోసం మహిళలు పోరాటం చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్‌డబ్ల్యు) రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో సంఘం ప్రాంతీయ కౌన్సిల్ సమావేశాన్ని దంతాల పద్మరేఖ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా మహిళా సమాజాన్ని జాగృతం చేసి ఆర్థిక, సామాజికంగా ఎదిగేలా కృషి చేయాలన్నారు. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. స్త్రీ, పురుష బేదం లేకుండా సమాన హక్కుల కోసం జరిగే పోరాటాల్లో మహిళలు భాగస్వాములు కావాలన్నారు. అనంతరం 11 మంది సభ్యులతో ప్రాంతీయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రాంతీయ అధ్యక్షురాలిగా దేశగాని హేమలత, కార్యదర్శిగా పొదిల వెంకటమ్మ, గౌరవ అధ్యక్షురాలిగా అనంతుల మల్లేశ్వరి, ఉపాధ్యక్షురాలిగా ఖమ్మంపాటి నాగమణితో పాటు సభ్యురాళ్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్, ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, జాతీయ మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉపతల కోటమ్మ, దేవర మల్లేశ్వరి పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి : బాగం



ప్రజాపక్షం/చింతకాని : త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో నిలిచేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి చింతకాని మండలం నేరడ సిపిఐ గ్రామశాఖ 15వ మహాసభ గోగుల ఆది, పెరిక ప్రభాకర్‌ల అధ్యక్షతన జరిగింది. తొలుత సీనియర్ నాయకులు గోనుగుంట్ల వెంకన్న పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ జెడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో అధిక స్థానాల్లో పోటీ చేసేలా సమాయత్తం కావాలన్నారు. గతంలో అధికారం చేపట్టిన గ్రామలతో పాటు కొత్తవాటిని గెలుపొందేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. అభివృద్ధి కోసం రాజీలేని పోరాటాలు చేయాలన్నారు. 30ఏండ్ల సుదీర్ఘపోరాటమైన ఎస్‌సి వర్గీకరణను ఆమోదిస్తూ తెలంగాణ అసెంబ్లీలో చేసిన ఆమోదాన్ని స్వాగతిస్తున్నామని, అట్టి ఆమోదాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్‌లో చట్టం చేసి ఈవర్గాలకు న్యాయం చేయాలన్నారు. అదేవిధంగా కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అర్హులందరికీ ఇవ్వాలన్నారు.అనంతరం గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా దస్తగిరి, సహాయ కార్యదర్శులుగా మట్టా రవి, కె మహేష్‌తో పాటు 19మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, సీనియర్ నాయకులు దూసరి శ్రీరాములు, మండల కార్యదర్శి పావులూరి మల్లిఖార్జున్,సహాయ కార్యదర్శి దూసరి గోపాలరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి


ఎఐటియుసి జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు

ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు గత ఏడు నెలలుగా పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి అని ఎఐటియుసి ఖమ్మం జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు పేర్కొన్నారు. ఎఐటియుసి అధ్వర్యంలో శనివారం నేలకొండపల్లి కమ్యూనిటీ హెల్త్ హాస్పిటల్ వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కు షరతులతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నెలలు గడుస్తున్నా తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో ఏడు నెలలా నుంచి వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికులందరూ పేద కుటుంబాలకు సంబంధించిన కార్మికులు ఉన్నందున జీతాలు రాకపోవడంతో కుటుంబాల నిర్వహణ భారంగా మారాయన్నారు. గత ఏడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు కొద్ది నెలల జీతం ఇచ్చి అనంతరం చేతులెత్తేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టర్లకు, ప్రభుత్వానికి మధ్యలో కార్మికులు నలిగిపోతున్నారని అన్నారు. క్రితం పిలిచిన టెండర్‌లో వీరి జీతాలు 13600 రావాల్సి ఉండగా కేవలం 11000 మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు జీతాలను వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో రాబోవు రోజుల్లో నిరవధిక సమ్మెను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి ఖమ్మం జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీనారాయణ, ఆసుపత్రి కార్మికులు విరలాల్, కమల, సాయి, సైదా, అనిత, తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేయాలి : ధనుంజయ



ప్రజాపక్షం/ నల్లగొండ (దామరచర) : బిసిల అభివృద్ధి కొరకు కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల కోట్లతో ప్రత్యేక బడ్జెట్ రూపొందించాలని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నా యుడు డిమాండ్ చేశారు. శనివారం ఆయన నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలో ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ బిసిలను అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి పాలకులకు ఉంటే తక్షణమే కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం బిసిలకు రిజర్వేషన్లు కేటాయించాలని బిసిలకు ప్రైవేటు రంగంలో ప్రత్యేక కోటా కేటాయించాలని, బిసి అట్రాసిటీ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణనలోని ఆయా కులాల వివరాలను ప్రజలకు వివరించాలని, తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాలలో రెండు ఎకరాల విస్తీర్ణంలో బిసి భవన్‌లు నిర్మించాలని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బిసి గురుకుల పాఠశాలకు కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలని అన్ని సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని ముఖ్యంగా బాలికల హాస్టల్లకు సరిపోను మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.ఆయన వెంట సాధన సమితి నాయకులు చిలకరాజు శ్రీను,దామరచర్ల మండల సిపిఐ కార్యదర్శి డి.లింగా నాయక్ ఉన్నారు.

## బండి వంశీగౌడ్‌కు నివాళి



ప్రజాపక్షం/శామీర్‌పేటః శామీర్‌పేట మండలం బాబాగూడకు చెందిన బండి వంశీగౌడ్ దశదినకర్మకు మేడ్చల్ ఎంఎల్‌ఎ చామకూర మల్లారెడ్డి శనివారం విచ్చేసి నివాళులర్పించారు. వంశీగౌడ్ చిత్రపటాని కి పూలమాల వేశారు. బిఆర్‌ఎస్ యువజన నాయకుడుగా నిబద్ధతతో పనిచేశారని గుర్తు చేశారు. వంశీగౌడ్ కుటుంబీకులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, మేడి రవి, దీపక్‌రెడ్డి, వంగ వెంకట్‌రెడ్డి, వంశీగౌడ్ కుటుంబీకులు పాల్గొన్నారు.

# మహానగరి

## బిజెపి నాయకుల విజయోత్సవ సంబరాలు

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : ఢిల్లీ బిజెపి గెలుపుతో వికారాబాద్ లో బిజెపి నాయకులు విజయోత్సవ సంబరాలు జిల్లా కేంద్రంలో ని ఎన్‌ఆర్ చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాధవరెడ్డి మాట్లాడుతూ ఢిల్లీ గెలుపుతో స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని గల్లి నుండి ఢిల్లీ దాకా బిజెపి విజయ డంఖా మోగిస్తుమన్నారు. ఈ కార్యక్రమంలో శివరాజ్, వడ్ల నందు, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీదర్‌రెడ్డి, శిరీష, చరణ్‌రెడ్డి, నరోత్తంరెడ్డి తదితరులు పాల్గోన్నారు.



## విద్యతోపాటు క్రీడలు, కళలను ప్రోత్సహించాలి

ప్రజాపక్షం/చర్లపల్లి : విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, కళలు లాంటి విషయాలలో వారి ఆసక్తికి అనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సరస్వతీ విద్యాపీఠం మేడ్చల్ జిల్లా కార్యదర్శి ధూళిపాల కాశీ విశ్వనాథ్ అన్నారు. కుషాయిగూడలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఖేల్‌కూడ్ పేరిట జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీ ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాల నుండి నాణ్యమైన విద్యను దేశ సంప్రదాయ విలువలయుక్తంగా తమ పాఠశాలల్లో బోధిస్తున్నామన్నారు. కబడ్డీ, కోకో, రన్నింగ్,లాంగ్ జంప్, హైజంప్, షార్ట్ పుట్ తదితర క్రీడా పోటీల్లో కూకట్‌పల్లి, ఆల్విన్ కాలనీ, దుండిగల్, ఫతేనగర్ తదితర పాఠశాలలకు చెందిన 150మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో విజేతలు ఈ నెల 17,18 తేదీల్లో నాదర్‌గుల్‌లో జరిగే భాగ్య నగర్ విభాగ్ జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, పాఠశాల కమిటీ సభ్యుడు ప్రభాకరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## విఆర్‌ఎస్‌విజె స్కూల్ విద్యార్థికి అరుదైన గౌరవం

ప్రజాపక్షం/ నిజాంపేట్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలోని విఆర్‌ఎస్‌విజె స్కూల్ విద్యార్థికి అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లీలో జనవరి 1 నుండి 28వ తేదీ వరకు జరిగిన రిపబ్లిక్ డే క్యాంపులో భాగంగా జూనియర్ డివిజన్ నేవీ విభాగంలో విఆర్‌ఎస్ వీజే స్కూల్ విద్యార్థి మేఘాంశ్ అఖిల భారత నాల్గవ స్థానం సాధించారు. ఈ సందర్భంగా మేఘాంశ్ ప్రధానమంత్రి నివాస సందర్శనతో పాటు ప్రధానితో ప్రత్యేక సమావేశంలో పాల్గొనే అవకాశాన్ని పొందాడు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాసాన్ని మేఘాంశ్ సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభినందించారు. పాఠశాల ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ రమణశ్రీ మేఘాంశ్‌ని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా రమణ శ్రీ మాట్లాడుతూ ఇలాంటి అరుదైన గౌరవం తమ పాఠశాల విద్యార్థికి దక్కడం సంతోషకరమని అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సాంస్కృతిక ప్రతినిధిగా ప్రాతినిధ్యం వహించి మన ప్రాంత సాంప్రదయ వైభవాన్ని జాతీయ స్థాయిలో ప్రదర్శించడం జరిగిందని అన్నారు.



## యువత ప్రైవేట్ రంగాల్లో ఉపాధిని ఎంచుకోవాలి : డిఆర్‌డిఒ సాంబశివరావు

ప్రజాపక్షం/శామీర్‌పేట : యువత ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డిఆర్‌డిఒ సాంబశివరావు అన్నారు. శనివారం శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి, ఇజిఎం ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత ప్రభుత్వం ద్వారా అందించే పథకాలవైపు ఆకర్షితులు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మమతబాయి, జిల్లా జాబ్స్ మేనేజర్ దివాకర్, శివప్రసాద్, ఎపిఎం సురేష్‌రెడ్డి, జాబ్స్ ట్రైనర్ సంధ్య, హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు. ఈ జాబ్‌మేళాలో మొత్తం 142 మంది యువతీయువకులు హాజరయ్యారు.



## విశ్వవిశ్వాని కళాశాలలో పుస్తకావిష్కరణ

ప్రజాపక్షం/శామీర్‌పేట :తూంకుంట మున్సిపాలిటిలోని విశ్వవిశ్వాని కళాశాలలో శనివారం ఆధ్యాపకులు రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ పుస్తక ప్రదర్శన కార్యక్రమం విశిష్ట అతిథులు, నిర్వహణ అధ్యాపకులను ఎంతగానో ఆకర్షించింది. ఫైనాన్స్ మార్కెటింగ్ సప్లై, చైన్ మేనేజ్‌మెంట్, ఇన్సూరెన్స్ బిజినెస్‌లా, ఇంగ్లీష్ లాంగ్వేజ్ బ్యాంకింగ్‌లకు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు. విద్యార్థులు, పరిశోధకులు, నిపుణులకు సమగ్ర జ్ఞానం ఆచరాణాత్మక అంతర్దృష్టులు, వాస్తవ ప్రపంచ ఉదాహరణలను ఈ పుస్తక ప్రదర్శన లక్ష్యంగా పెట్టుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిశ్వాని కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల తనిఖీ చేసిన, ఎంఇఒ

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధిః దోమ మండల పరిధిలోని లింగంపల్లి , ఎల్లారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలను శనివారం మండల విద్యాధికారి వెంకట్ తనీఖీ చేసి రికర్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అయాన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ,విద్యార్థులు వంతశాతం పాఠశాలకు వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డ్రాప్‌అవట్ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చే విధంగా తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. విద్యార్థుల ల్లో ఉన్న సృజనాత్మకత పెంపోందించి ఉపాధ్యాయుల విద్యాభోధన చేపట్టాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గోన్నరు.

# అక్రమ నిర్మాణాలు కూల్చివేత

### కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించం
### మేడిపల్లి తహసీల్దార్ హసీనా

ప్రజాపక్షం/బోడుప్పల్ : ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అమాయక ప్రజలకు అమ్మకాలు చేస్తున్నారని వాటిని సహించేది లేదని మేడిపల్లి తహసీల్దార్ హసీనా అక్రమార్కులను హెచ్చరించారు.

మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్ నగర్, గౌతమ్ నగర్ కాలనీలలో శనివారం మేడిపల్లి రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించారు. 13వ డివిజన్ సర్వే నెంబర్ 63/1 దేవేందర్ కాలనీ ఫేస్ టు లో డబల్ బెడ్ రూమ్ పక్కన నిర్మాణాలను నేలమట్టం చేశారు.

కార్పోరేషన్ జరుగుతున్న అక్రమ కట్టడాలు, అనుమతిలేని నిర్మణాలపై ఏమాత్రం ఉపేక్షించబోమని రెవిన్యూ అధికారులు హెచ్చరించారు. కూల్చివేతల్లో రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు రాకేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు. అక్రమంగా ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించమన్నారు.



వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పిడి యాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. దళారులను నమ్మి ప్రభుత్వ భూముల్లో స్థలాలు కొనవద్దని తెలిపారు.

## ఎనిమిది మంది బిజెపి ఎంపిలు, ఇద్దరు కేంద్ర మంత్రులు తెలంగాణకు ఏమి తెచ్చారు?

### నవాబుపేట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలారి శేఖర్

ప్రజాపక్షం/నవాబుపేట్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివక్ష ఫలితంగా బడ్జెట్ లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని నవాబుపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలారి శేఖర్ అన్నారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా వివక్ష చూపడంపై కాంగ్రెస్ రాష్ట్ర యూత్ అధ్యక్షులు జక్కటి శివ చరణ్ రెడ్డి పిలుపు మేరకు నవాబుపేట మండల కేంద్రంలోని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..8మంది బిజెపి ఎంపిలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ప్రతినిత్యం వాయిస్తున్న బడ్జెట్‌లో రాష్ట్రానికి గుండుసున్నా మిగిలిందని అన్నారు. కులగణన చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని, చట్టసభలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ చారితాత్మకం, ఎస్‌సి కుటుంబాలలో వెలుగులు నింపిన ఏకైక సిఎం రేవంత్ రెడ్డి అని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆదాని అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల కోసమే కేంద్ర బడ్జెట్ అన్నట్లుగా ప్రవేశపెట్టి రైతులను కూలీలను కార్మికులను, మహిళలను సామాజిక తరగతులను విస్మరించారని కనీసం గతంలో కేటాయించిన విధంగానైనా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా కోతలు విధించి ప్రజా వ్యతిరేక బడ్జెట్‌గా దోపిడి వర్గాల పాలకులుగా నిరూపించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



వ్యవసాయ రంగాన్ని సంక్షేమం నుంచి గట్టెక్కించేందుకు నిధులు పెంచాల్సింది. పోయి సబ్సిడీలు తగ్గించారని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి దొరకకుండా బడ్జెట్‌లో కోత విధించాలని పంటల ధరల నియంత్రణకు బడ్జెట్ కేటాయింపులే లేవని ఈ బడ్జెట్ పేదలపై భారాలు కార్పొరేట్ శక్తులకు వరాలు అన్న మాదిరిగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తలారి శేఖర్, సీనియర్ నాయకులు శివప్రసాద్, యాదగిరి యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎజాస్, బసవ రెడ్డి, ఎన్ఎస్ యుఐ ప్రెసిడెంట్ టిప్పు సుల్తాన్, యూత్ కాంగ్రెస్ మండల సెక్రటరీ పాండు రంగారెడ్డి, జాఫర్ మైనార్టీ సెల్, యూత్ కాంగ్రెస్ నాయకులు మల్కయ్య, నాగిరెడ్డిపల్లి వెంకట్, పరమేష్, తదితరులు పాల్గొన్నా రు.

## మహిళా స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి కృషి

### కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధిః మహిళ స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి నిరంతర కార్యక్రమాలు నిర్వహించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిఆర్‌పి మహిళలతోమాట్లాడారు. మహిళా సంఘాల బలోపేతంకు సిఆర్‌పి వ్యూహం కార్యక్రమం జిల్లాలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సిఆర్‌పిలు మహిళా సంఘాలను గ్రామాల్లో బలోపేతం చేయాలని తెలిపారు. ఒక




గ్రూప్‌లో ముగ్గురు చొప్పున 15 బృందాలను 45 మంది మహిళలను ధారూర్, దోమ, వికారాబాద్, మర్పల్లి, మండలాల్లోని మహిళా సంఘాలకు సిఆర్‌పిలు జిల్లాల్లో మహిళ సంఘాల ఏర్పాటు,ప్రోత్సాహం బలోపేతం చేయుటకు 8 రోజులు కేటాయించిన గ్రామాలకు వెళ్లి మహిళలకు అవ గాహన, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.

జార్ఖండ్, త్రిపుర, గోవా ఇతర రాష్ట్రాల్లో మహిళా సంఘాల ఏర్పాటుపై శిక్షణ నిచ్చారని, వికారాబాద్ జిల్లాలో కూడా మహిళల కు అవగాహన కల్పించాలని అన్నారు. కార్య క్రమంలో గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివా స్, అడిషనల్ డిఆర్ డిఒసరోజ తదితరులు పాల్గొ న్నారు.

# ఢిల్లీలో బిజెపి గెలుపుతో సంబరాలు

ప్రజాపక్షం/దుండిగల్ః భారతీయ జనతా పార్టీ దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఇంచార్జి అధ్యక్షులు డా॥ ఎస్.మల్లారెడ్డి ముఖ్య అతిథిగా ఢిల్లీలో బిజెపి విజయఢంకా మోగించిన సందర్భంగా గండిమైసమ్మ చౌరస్తాలో టపాకాయలు కాల్చి మిఠాయిలు పంచుకుని విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రంలో ఎలక్షన్ పెట్టిన మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్, రాజస్థాన్, హర్యానా ఈ రోజు ఢిల్లీ ఇలా ప్రతి రాష్ట్రంలో మోడీ పాలనకు పట్టం కడుతున్నారు. అంటే ప్రధాని చేపడుతున్న అనేక సంక్షేమ పతకాలు, దేశ భద్రత, మొన్న పెట్టిన జనరంజకమైన బడ్జెట్ మధ్యతరగతి పదిలక్షలలోపు ఇన్‌కం టాక్స్ మాఫీ చేసిన సందర్భంగా ముందుగా నరేంద్ర మోడీగారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు శ్యాంరావ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ మల్లేష్ యాదవ్, బౌరంపేట్ మాజీ సర్పంచ్ కొమ్ము మంగమ్మ, శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు ఎస్.సత్యనారాయణ రెడ్డి, సత్తిరెడ్డి, ఆకుల మల్లేష్, పిట్ల లక్ష్మణ్, మేడోజు రమేష్ చా, యువమోర్చ కన్వినర్ ఆకుల విజయ్,ఎస్టీ మోర్చా నాయకులు ఎం. వెంకటేష్ నాయక్, సోషల్ మీడియా కన్వినర్ భానుప్రసాద్ గౌడ్, యశ్వంత్ రెడ్డి, అనిల్, జి.మోహన్ రెడ్డి,



ఢిల్లీ బిజెపి విజయోత్సవ బౌరంపేట్ సంబరాలలో మున్సిపల్ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ మంగమ్మ, జిఎస్‌ఆర్ నర్సింహా చారి, డి.సీతారాంరెడ్డి, ఎస్.సత్తిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, కొమ్ము ప్రశాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి సంబరాలు


దుండిగల్‌లో


చర్లపల్లిలో


నవాబుపేటలో




## మహిళా ఖైదీల 'హక్కులు—చట్టాల'పై ఇష్టాగోష్టి

ప్రజాపక్షం/శామీర్‌పేటఃజైళ్లలో శిక్షలు అనుభవిస్తున్న మహిళా ఖైదీల హక్కు లు, చట్టాలపై శామీర్‌పేట నల్సార్‌లో శనివారం ఇష్టాగోష్టిని నిర్వహించారు. జాతీయ మహిళా కమిషన్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమానికి నల్సార్ వైస్ చాన్సలర్ శ్రీకృష్ణదేవరావు స్వాగతోపన్యాసం చేశారు. నల్సార్ ప్రొఫెసర్, రిజిష్ట్రార్ వాసంతి అధ్యక్షత వహించగా, నేషనల్ యూనివర్శిటి, అస్సాం జ్యుడిషియల్ అకాడమీ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ కే. వి. ఎస్ శర్మ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. జాతీయ మహిళా కమిషన్ సహకారంతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో పలు రాష్ట్రాలకు చెందిన ప్రొఫెసర్ లు, జాతీయ కమిషన్ సభ్యులు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. జాతీయ మహిళా కమిషన్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, కేంద్ర పాలిత ప్రాంతాలైన పుదుచ్చేరి రాష్ట్రాల్లో జైళ్లలో మహిళలకు సంబంధించిన చట్టాలపై ఒకరోజు సుదీర్ఘ దక్షణ ప్రాంత న్యాయ సమీక్ష సంప్రదింపుల కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రారంభ సెషన్‌లో నల్సార్ వైస్ చాన్సలర్ శ్రీకృష్ణదేవరావు మహిళలకు సంబంధించిన న్యాయపరమైన అంశాలపై క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, ప్రొఫెసర్‌లు, తదితరులు పాల్గొన్నారు.



## శివరాజ హరిహర దేవస్థాన చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/శామీర్‌పేట :మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని శివరజా హరిహర దేవస్థానానికి దేవాదయ ధర్మదాయ చైర్మన్‌గా వంగ శ్రీనివాస్‌రెడ్డి నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజి ఎంఎల్‌ఎ సుదీర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, డిసిసి అధ్యక్షుడు మారివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్‌లు విచ్చేసి ప్రమాణ స్వీకరోత్సవంలో పాల్గొని దేవతామూర్తులను దర్శించుకున్నారు.



## పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ వరం : మర్రి

ప్రజాపక్షం/మల్కాజిగిరి : పేదలకు వైద్యం కోసం సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం ఓ వరంలాంటిందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి అన్నారు. దీని కోసం వైద్యులు ఇచ్చే రిక్విజేషన్ పత్రాలు, ఆధార్ కార్డులతో తనను సంప్రదించాలని ఆయన తెలిపారు. మల్కాజిగిరి డివిజన్ బాల సరస్వతినగర్ ప్రాంతానికి చెందిన శరన్ ఎవెలిన్ గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ అవసరమైన శస్త్ర చికిత్సల కోసం సిఎం రిలీఫ్ ఫండ్ స్కీమ్ కింద మంజూరైన రూ.2 లక్షల చెక్‌ను శనివారం అందచేసారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ శ్రేణులు జగదీష్‌గౌడ్, ఉపేందర్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## యుఎల్సీ సమస్య పరిష్కరించాలి

### మల్లికార్జుననగర్ కాలనీవాసులు వినతి

ప్రజాపక్షం/మల్కాజిగిరి : చిరకాలంగా అపరిష్కృతంగా ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యుఎల్సీ) సమస్యను ఇకనైనా పరిష్కరించాలంటూ గౌతం నగర్ డివిజన్‌లోని మల్లికార్జుననగర్ కాలనీవాసులు కోరారు. శనివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డిని కాలనీకి చెందిన అచ్యుతారావు, వెంకటయ్య, గోపాల్‌రెడ్డి,పసుమర్తి శేషుబాబు, వాసుదేవరావు, దత్తాత్రేయలు కల్సి వినతి పత్రం సమర్పించారు. ప్రతిసారి ఎన్నికల సమయంలో ఈ విషయంలో హామీలిస్తున్నారే తప్ప ప్రజా ప్రతినిధులు గత పదేళ్లుగా పట్టించుకోవటం లేదని వాపోయారు. దీనికి సంబంధించి తాను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చానని, త్వరలో సమస్య పరిష్కరించే దిశగా సహకరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాపక్షం/మర్పల్లిః మర్పల్లి మండల కేంద్రానికి సంబంధించిన పలిపురం శ్రీనివాస్ అనారోగ్యంతో మరణించారు. విషయం తెలియడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామేశ్వర్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం ఐదువేల రూపాయలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాలను హుగ్గెల్లి రవీందర్‌రెడ్డి, తలారి రాజు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌ను పరామర్శించిన అరవింద్‌శర్మ



ప్రజాపక్షం/ సరూర్‌నగర్ : బిఆర్ ఎస్ ఉద్యమకారుడు ముచ్చింతల జగన్ గుండెపోటుతో ఆసుప్రతిలో చికిత్స పొందుతున్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ అపో లో ఆసుపత్రిలో చికిత్స పొంతుదున్న జగన్‌ను కలిసి పరామర్శి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో బాలుశ్రీ, జాహెద్, మహేష్ పాల్గొన్నారు.

# మహానగరి

## 'మూడు గ్రూప్‌లు సామాజిక న్యాయానికి విరుద్ధం'

ప్రజాపక్షం/ ఖైరతాబాద్: ఎస్‌సి వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదించి, మూడు గ్రూప్‌లుగా ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఇది సామాజిక న్యాయానికి విరుద్ధమని సమంతా సైనిక్ దళ్ నేత దిగంబర్ కాంబ్లే, మాల సంక్షేమ సంఘం నేతలు బత్తుల రాంప్రసాద్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారితోపాటు మాల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో అసెంబ్లీలో ఈ నెల 4న కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబించిన విధానాన్ని నిరసిస్తూ వర్గీకరణ బిల్లు పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా దింగబర్ కాంబ్లే, రాంప్రసాద్ మాట్లాడుతూ త్వరలోనే సామాజిక విద్రోహం దినం పేరిట బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు.

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా గోవింద్



ప్రజాపక్షం/ సరూర్‌నగర్ : రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా బడంగ్‌పేటకు చెందిన ముదావత్ గోవింద్‌ను నియమిస్తూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి నియామకపత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలోని పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి సంక్షేమమే అజెండాగా పనిచేస్తుందన్నారు. తనపై నమ్మకంతో జిల్లా ప్రధా కార్యదర్శి నియామకానికి సహకరించిన టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, డిసిసి అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, పార్టీ ప్రధాన కార్యధర్శి తమలపాకుల హర్షలత ఇతర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపేందర్‌గుప్త సేవలు అభినందనీయం



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : సమాజంలో మొగుళ్ళపల్లి ఉపేందర్ గుప్త సేవలు అభినందనీయం అని టిపిసిసి ప్రచార కమిటి రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫేడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. శనివారం కొత్తపేటలోని నాగేశ్వరపురం సాయిబాబా దేవాలయంలో ప్రముఖ సంఘ సేవకులు, తెలంగాణ సెంట్రల్ సెన్సార్ బోర్డు మెంబర్ డా.మొగుళ్ళపల్లి ఉపేందర్‌గుప్త ఆధ్వర్యంలో పేద బ్రహ్మణులు సాయి కృష్ణ, శివాణి దంపతులకు ఉచిత వివాహం జరిపించారు. అనంతరం ఆయ న మాట్లాడుతూ ఇప్పటి వరకు 218 మంది పేద జంటలకు ఉచిత వివాహాలను జరిపించిన ఉపేందర్ సేవలు అభినందనీయం అని అన్నారు.

## సేవాలాల్ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : ఈ నెల 19న హస్తినాపురంలోని కాటం పార్వతమ్మ పార్కులో నిర్వహించే గిరిజన ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాల పోస్టర్‌ను హస్తినాపురం డివిజన్ కార్పోరేటర్ బానోత్ సుజాత నాయక్ శనివారం వారి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల కోసం హింసా మార్గాన్ని వదిలి అహింసా మార్గాన్ని పాటించాలని దేశ వ్యాప్తంగా గిరిజనులను ఏకం చేసిన గొప్పమహనీయుడు సేవాలాల్ మహారాజ్ అని ఆమె కోనియాడారు. భారత దేశంలో బంజార జాతి ఔన్నత్యాన్ని దేశానికి చాటి చెప్పిన్న నాయకుడు సేవాలాల్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాటం పార్వతమ్మ కాలనీ అధ్యక్షులు ఎన్. జానకిరాం నాయక్, వాసురాం నాయక్, ధంజిలాల్ నాయక్, కాంగ్రెస్ నాయకులు గొపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో ఎగిరిన కాషాయం జెండా



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : భారతదేశం రాజధాని ఢిల్లీలో కాషాయం జెండా ఎగరడం పట్ల బిఎన్‌రెడ్డి డివిజన్‌లోని ఎస్‌కెడి నగర్ చౌరస్తాలో స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం బాణాసంచాలు పేల్చి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్వీట్లు ప్రజలకు పంచిపెట్టారు. సందర్భంగా మోడీని ప్రజలు ఆదరిస్తున్నారని, మోడీనే దేశ వ్యాప్తంగా చూడాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని ఆయన తెలిపారు. 26 సంసవత్సరాల తరువాత ఢిల్లీపై కాషాయం జెండాను ఎగరవేయడం దేశ ప్రజలకు చాలా సంతోషంగా ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు కొంతం నవ కిషోర్‌రెడ్డి, నాయకులు శంకరయ్య గౌడ్, సుధాకర్‌రెడ్డి, శ్రీధర్ రావు, ప్రభాకర్‌రెడ్డి, నందకిషోర్, రవిశంకర్, మహేష్ గౌడ్, చందు, చిన్న యాదవ్, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

బిసి సంక్షేమశాఖ ఉప సంచాలకులు బి.కేశురామ్

ప్రజాపక్షం/ కొందుర్గు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని అప్పుడే విజయాలు వెన్నంటే ఉంటాయని బిసి సంక్షేమ శాఖ రంగారెడ్డి జిల్లా ఉప సంచాలకులు బి.కేశురామ్ అన్నారు. శనివారం పట్టణంలోని చటాన్‌పల్లి గురుకుల పాఠశాలలో 10వ తరగతి వసతి గృహ విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు సాధించుటకై శిక్షణ నిర్వహించడం జరిగింది. యాచారం వసతి గృహానికి చెందిన విద్యార్థి కుమారి అక్షిత రాష్ట్ర స్థాయిలో పార అథ్లెటిక్‌లో ప్రథమ స్థానంలో మూడు బంగారు పథకాలు సాధించినందుకు విద్యార్థిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేశురామ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించడంతోపాటు భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందని పేర్కొన్నారు. చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే ఉన్నతమైన స్థానానికి చేరుకునేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంక్షేమ అధికారులు మాధవరెడ్డి, రమేష్, వసతి గృహ సంక్షేమ అధికారులు, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ప్రీతిలు హాజరయ్యారు.



## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

ప్రజాపక్షం/గండిపేట్ : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం నార్సింగిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటిస్తూ వారికి అందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు.పిల్లలకు స్వచ్ఛమైన, రుచికరమైన ఆహారం అందించాలని,ఆహారం వండే సిబ్బంది పరిశుభ్రంగా ఆహార పదార్థాలను సిద్ధం చేయాలని,ఆహార పదార్థాలు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.డైనింగ్ హాల్,క్లాస్ రూమ్‌లు, పరిసరాలు, స్టోర్ రూమ్‌లో నిలువ ఉంచిన ఆహార పదార్థాలు, కూరగాయలు,ఇతర సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. విద్యార్థులకు ఏ సబ్జెక్టులో ఎలాంటి సందేహాలు ఉన్న సమాధానాలు చెబుతూ విద్య బోధనలు అందించాలనే విషయంలో కలెక్టర్ పలు సూచించనలు చేశారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున సిలబస్ పూర్తి చేసి పునఃశ్చరణ తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. వివిధ సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని చెప్పారు.పదవ తరగతిలో నూటికి నూరు శాతం విద్యార్థులందరూ అత్యుత్తమ గ్రేడ్‌లతో ఉత్తీర్ణత సాధించేలా నాణ్యమైన బోధన అందించాలని అన్నారు.ఈ కార్యక్రమలో నార్సింగ్ మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ రంగం కీలకమైనది



భవన నిర్మాణరంగ జిల్లా సభలను విజయవంతం చేయండి : కె.రామస్వామి

ప్రజాపక్షం/షాబాద్: భవన నిర్మాణ రంగ రంగారెడ్డి జిల్లా మహాసభలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి కోరారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ ఈనెల 16వ తేదిన బంజారహిల్స్ లోటస్‌పాండ్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ రంగం మూడవ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు భవన నిర్మాణ రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. భారతదేశంలో భవన నిర్మాణ రంగం చాలా కీలకమైనది అని దేశవ్యాప్తంగా 10కోట్లకు పైగా కార్మికులు పని చేస్తున్నారని వివరించారు. ఈ రంగంలో పనిచేసే కార్మికులకు 60ఏళ్లు దాటిన తర్వాత పెన్షన్‌తో సహా అన్ని సదుపాయాలు కల్పించాలని, ఐదు రూపాయాలకే భోజన వసతి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, బిజిసి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం షాబాద్ మండల కన్వీనర్ శేఖర్, కోకన్వీనర్ అంజయ్య, షాబాద్ మండల పార్టీ కార్యదర్శి నక్క జంగయ్య, ఎఐటియుసి షాబాద్ మండల కార్యదర్శి నారాయణ, రఘు, మధు, రాములు, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## తప్పుడు ఆరోపణలు చేస్తే తగిన మూల్యం తప్పదు

బిఆర్‌ఎస్ నేత రాజావరప్రసాద్‌ను హెచ్చరించిన కాంగ్రెస్ నేతలు



ప్రజాపక్షం/షాద్‌నగర్: బడుగు బలహీన వర్గాల శ్రేయస్సే లక్ష్యంగా పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై తప్పుడు ప్రచారం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కాంగ్రెస్ శ్రేణులు గోదా మాధవులు, బుద్ద నర్సింహులు, నెహ్రూనాయక్‌లు హెచ్చరించారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించాల్సిన నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 1995 నుండి క్రియాశీల రాజకీయాల్లో ఉన్న సిఐటియు రఘు అంటే అందరికి తెలుసని, పే రు మారుకోవడం వ్యక్తిగత విషయమని, ప్రశ్నించేందుకు నీవు ఎవరని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఏ జిల్లాకు చెందిన వ్యక్తి..ఉమ్మడి పాలమూరు జిలా లో పార్లమెంట్ స్థానానికి పోటీ చేసి విజయం సాధించలేదా అని వివరించారు. రాజకీయాల్లో అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టాలే తప్పా నోరు ఉందని ఇష్టం ఇచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. బిసి కులగణన విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎలాంటి తప్పు చేయలేదని, నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించారని, దాని ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు బిసిలకు కల్పించినట్లు తెలిపారు. ఇది చూపి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీల నేతలు వ్యక్తిగత దుషనలకు దిగుతున్నారని వాపోయారు. మైకులు ఉన్నాయని నోటిక వచ్చినట్లు మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని, తప్పు చేసినట్లు చూపి స్తే తగిన ఆధారాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. రాజావరప్రసాద్‌కు ధైర్యంగా ఉంటే రాజకీయంగా విమర్శించాలని, వ్యక్తిగతంగా విమర్శిస్తే దేహశుద్ధి తప్పదని హెచ్చరించారు. ఎమ్మెల్యే గురించి ఏం తెలుసని మాట్లాడుతున్నావని, వీలైదే అభివృద్ధి గురించి చర్చించేందుకు రావాలని సవాల్ చేశారు.

## తనయుడి వేధింపుల నుంచి రక్షించండి

సిఎం రేవంత్‌రెడ్డికి ఓ వృద్ధ దంపతుల విజ్ఞప్తి




ప్రజాపక్షం/ ఖైరతాబాద్: ఆస్తికోసం కొడుకు, కోడలు చేస్తున్న వేధింపుల నుంచి తమను రక్షించాలని ఓ వృద్ధ దంపతులు మీడియా ముందు తమ గోడును వెళ్ళబోసుకున్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హయత్‌నగర్‌కు చెందిన బలరాం, మంగమ్మలు తమ కష్టాలను మీడియాకు వివరించారు. భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసి, సంపాదించిన ఆస్తిపాస్తులతో ఇద్దరు ఆడపిల్లలకు వివాహం చేయగా, మిగిలిన వాటిని సమానంగా పంచినట్టు వారు తెలిపారు. క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న తన పెద్ద కుమారుడు సంతోష్, కోడలు రేణుకలు తమకు మరింత డబ్బులు ఇవ్వాలంటూ వేధింపులకు గురిచేశారని కన్నీరుపెట్టుకున్నారు. తమపై అకారణంగా కేసులు బనాయించి న్యాయస్థానాల చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకునే దుస్థితి నెలకొన్నదని వాపోయారు. సిఎం రేవంత్ రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించి, తమకు రక్షణ కల్పించి, న్యాయం చేయాలని వారు కోరారు.

## పద్మశాలీల లెక్కలను పక్కాగా తేల్చాలి : వల్లకాటి




ప్రజాపక్షం/ ఖైరతాబాద్: కులగణన సర్వేను మళ్లీ నిర్వహించి, పద్మశాలీల లెక్కలను పక్కాగా తేల్చాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. 30లక్షలకుపైగా జనాభా ఉన్న పద్మశాలీలు మొత్తం 11 లక్షల మందే ఉన్నారని సర్వేలో చెప్పడం విడ్డూరంగా ఉన్నదని పేర్కొన్నది. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఈ తప్పుడు లెక్కలతో వచ్చే పదేండ్లు పద్మశాలీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తీరని అన్యాయం జరుగుతుందన్నారు. జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకెళ్లిన వారిని లెక్కిస్తే పద్మశాలీల సంఖ్య పెరుగుతుందన్నారు. ప్రభుత్వం తమ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాస్ , కోశాధికారి నవీన్, గౌరవాధ్యక్షులు బాలరాజు, బురా మల్లేష్, ఉపాధ్యక్షుడు వి.శంకర్, చంద్రుడు, నగేష్, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎన్నికల్లో యువతదే కీలకపాత్ర

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్



ప్రజాపక్షం/షాద్‌నగర్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత కీలక పాత్ర పోషించే విధంగా చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ముదిరాజ్ సూచించారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పులిమామిడి రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ శ్రేణులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అందె మోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను సవాల్‌గా తీసుకొని విజమే లక్ష్యంగా పని చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళి వివరించాలని సూచించారు. యువత సత్తా చూపించే సమయం అసన్నమైందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి ఇంటికి వెళ్ళాలని పేర్కొన్నారు. స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ ఆదేశాల మేరకు తాము శాసన సభ ఎన్నికల్లో పూర్తి స్థాయిలో పనులు చేశామని, అందుకే విజయం సాధించామని, అదే తరహాలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపుపై పట్టు సాధించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో జవసత్వాలు నింపి పార్టీ అభివృద్ధికి మనుగడకు ఆజ్యం పోయాలని కోరారు. తెలంగాణలో ఎస్‌సి వర్గీకరణ అంశాన్ని అసెంబ్లీలో ఆమెదించడం, బిసి కులగణన చేపట్టడం లాంటి మహత్తరమైన పనులు చేపట్టామని వివరించారు. ఈ విషయాలను గ్రామాల్లో యువజన కాంగ్రెస్ నేతలు ఇంటింటికి తీసుకువెళ్ళాలని, విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పులిమామిడి రాజేష్‌గౌడ్, జిల్లా కమిటి నాయకులు ప్రేమ్‌నాయక్, సాజిద్, శ్రీనాథ్, అందె శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు సాయివంశీ, వివిధ మండలాల అధ్యక్షులు శ్రీకాంత్, వెంకట్‌చారి, అనిల్, శివశంకర్, అమర్నాథ్, రమేష్, శివలు పాల్గొన్నారు.

## దేవాలయ అభివృద్ధికి సహకారం



ప్రజాపక్షం/కొత్తూరు: దేవాలయ అభివృద్ధికి ప్రజలందరు సహకరించాలని అప్పుడే పురోగతి సాధిస్తాయని కొత్తూరు మాజీ ఎంపిపి పిస్నింటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం కొత్తూరు మండల పరిధిలోని మల్లాపూర్ తండాలో హనుమాన్ దేవాలయ గోపుర నిర్మాణానికి రూ.10లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా పిస్నింటి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ భగవంతుడి కృషకు భక్తులు పాత్రులు కావాలని, దైవభక్తిని ప్రజలందరు అలవర్చుకోవాలని సూచించారు. భగవంతుడి కృపతో ముమ్మందు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు సిద్దంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కొత్తూరు మండలే కాకుండా షాద్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నిర్మిస్తున్న దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అంధించేందుకు తాను సిద్దంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు రవినాయక్, కట్న రాజు, రాందాస్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ దయ్యాల మల్లేష్, నరసింహారెడ్డి, జయేందర్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి



ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో శాస్త్రా గార్డెన్‌లో బిఆర్‌ఎస్ మండల విస్తృత స్థాయి సమావేశానికి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్ని విస్మరించందని విమర్శించారు. ప్రజావ్యతిరేఖ విధనాలు అవలంభిచే కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. రాష్ట్రంలో 60 లక్షల మంది రైతులు ఉంటే కేవలం 21లక్షల మంది రైతులకు రైతు భరోసా ఇచ్చి మిగతా 49 లక్షల మంది రైతులకు మొండి చెయ్యి చూపిందన్నారు. నియోజకవర్గం కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచ్చుకోక ప్రజా భవనం దిష్టి బొమ్మలాగ దర్శనమిస్తుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే నియోజక వర్గంలో లక్ష రుపాయల అభివృద్ధి పనులు చేపట్టక పోవటం సిగ్గు చేటని విమర్శించారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ మండల నాయకులు కృపేష్,సిఎచ్ బుగ్గరాములు,భాస్కర్ రెడ్డి,ప్రతాప్ రెడ్డి,నిట్టు జగదీష్.చంద్రయ్య కార్యకర్తలు పాల్గోన్నారు.

## విద్యార్థులతో భోజనం చేసిన చేవెళ్ల ఆర్‌డిఒ



ప్రజాపక్షం/గండిపేట : మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చిల్కూర్ గ్రామ రెవెన్యూ మున్సిపాలిటీ గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను తనిఖీ చేసిన చేవెళ్ల ఆర్‌డిఒ చంద్రకళ విద్యార్థులతో ముచ్చటించిన అనంతరం మాట్లాడుతూ ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థుల పైన స్మార్ట్ ఫోన్ ప్రభావం పడకుండా విద్యార్థి తల్లిదండ్రులకు సూచన చేశారు. వాళ్లు బాగా చదువుకునే విధంగా తల్లిదండ్రులు గురువులు ప్రోత్సహించాలని తెలంగాణ రాష్ట్రంలోనే గురుకులకు మంచి గుర్తింపు ఉందన్నారు. విద్యార్థులను కాస్మటిక్ చార్జీలు క్రమం తప్పకుండా వస్తున్నాయా అన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. భోజనం ఎలా ఉంది అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు, ఈ కార్యక్రమంలో పాఠశాల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ దేవేందర్ రెడ్డి వైస్ ప్రిన్సిపాల్ శౌరి రాజు, సత్యం, పందరి, రమేష్ పిటి గురువయ్య,వీఆర్వో మధుసూదన్, మండల విద్యాధికారి వెంకటయ్య,ఆర్‌ఐ సుజిత్ రెడ్డి, చిలుకూరు గురుకుల పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు బేగరి రాజు,ఉపాధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాపక్షం/షాబాద్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో ఎన్‌జీవో సంస్థ వారి ఆధ్వర్యంలో రైతు వేదిక ప్రాంగణంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగస్తులతో కలిసి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో హైతాబాద్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ అధికారి రాజేశ్వరీ, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్‌లో ప్రారంభమైన అన్కట్ ఆభరణాల ప్రదర్శన



ప్రజాపక్షం/సరూర్‌నగర్: దిల్‌షుఖ్‌నగర్ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్ షోరూం అన్కట్ ఆభరణాల ప్రదర్శనను శనివారం ముఖ్యఅతిధిగా విచ్చేసిన మెనేజ్‌మెంట్, ఉన్నతాధికారులు శ్రేయోబిలాషుల సమక్షంలో ప్రారంభించినట్లు స్టోర్ హెడ్ రధీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆభరణాలు కళానైపుణ్యతతో, అంతులేని హుందాతనంతో కూడినవి అన్నారు. నగిషి చెక్కిన ప్రతీఆభరణం తయారుచేసిన వారి అనుభవం ఇంకా కళాత్మకతకి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈ ప్రదర్శన ఫిబ్రవరి 08 నుండి 16వ తేది వరకు ఉంటుందని వెల్లడించారు. ప్రత్యేక ఆకర్షణలుగా మలబార్ గోల్డ్ బ్రాండుల సమాహారం, వివాహ, పార్టీ సంబరాల కోసం 'ఎరా' అన్కట్ వజ్రాలతో పొదిగిన విశిష్ట శేణి, సమకూర్చినట్లు తెలిపారు.

## నేడు బిఅర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం

ప్రజాపక్షం/యాచారం : నేడు యాచారం మండల కేంద్రంలోని సాయిశరణం గార్డేన్‌లో బిఆర్‌ఎస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఉదయం 11 గంటలకు ఉంటుందని బిఅర్‌ఎస్ పార్టీ యాచారం మండల అధ్యక్షులు కర్నాటి రమేశ్‌గౌడ్, అన్నారు. శనివారం యాచారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ కాంగ్రెస్ 14 నెలల పాలనలో కాంగ్రెస్ ప్రజలకు మేలు చేసింది ఏమిలేదని అన్నారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిధులుగా ఇబ్రహింపట్నం మాజీ ఎంఎల్ఏ మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, యువనాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిధులుగా హాజరవుతున్నారని అన్నారు.

క్రీడ

# గెలవడం కాదు.. భారత్‌ను ఓడించాలి!

## పాక్ ప్రధాని





**ఛాం**పియన్స్ ట్రోఫీ 2025లో విజేతగా నిలవడం కంటే భారత్‌ను ఓడించడమే తమ జట్టు అసలు కర్తవ్యమని పాకిస్థాన్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ అన్నారు. ఈ విషయంతో యావత్ దేశం తమ జట్టుకు అండగా నిలుస్తోందని తెలిపారు. అప్‌కమింగ్ ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్, పాకిస్థాన్ జట్లు ఫిబ్రవరి 23న తలపడనుంది. లండన్ వేదికగా జరిగిన గత ఎడిషన్ ఫైనల్లో భారత్‌ను ఓడించి పాకిస్థాన్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కరోనా, వన్డే, టీ20 ప్రపంచకప్ టోర్నీలతో ఐసీసీ.. ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహించలేదు.

8 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో పాకిస్థాన్ ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి ఆతిథ్యం ఇస్తోంది. పాకిస్థాన్ వెళ్లేందుకు భారత్ ససేమిరా అనడంతో ఇరు దేశాల క్రికెట్ బోర్డుల పరస్పర అంగీకారంతో ఛాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేందుకు పాకిస్థాన్ ఒప్పుకుంది. దాంతో భారత్ మ్యాచ్‌లన్నీ దుబాయ్ వేదికగా జరగనున్నాయి. ఈ టోర్నీ కోసం భారీగా ఖర్చు చేసిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు.. స్టేడియాలను పునరుద్దరించింది. శనివారం లాహోర్‌లోని గడ్డాఫి స్టేడియాన్ని పాకిస్థాన్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత్‌పాక్ మ్యాచ్‌ను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'మాకు మంచి జట్టు ఉంది. ఇటీవల కాలంలో మా ఆటగాళ్లు మెరుగ్గా రాణిస్తున్నారు. అయితే మా జట్టు అసలు కర్తవ్యం ఛాంపియన్స్ ట్రోఫీని గెలవడమే కాకుండా దుబాయ్ వేదికగా జరిగే దాయాదుల పోరులో చిరకాల ప్రత్యర్థిని భారత్‌ను ఓడించడం. ఈ విషయంలో దేశం మొత్తం పాకిస్థాన్ జట్టుకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. 29 ఏళ్ల తర్వాత ఐసిసి టోర్నీకి ఆతిథ్యం ఇస్తుండటం పాకిస్థాన్‌కు గొప్ప విషయం. ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో మా జట్టు యావత్ దేశం గర్వించేలా ఆడుతుందనే నమ్మకం నాకుంది.'అని షెహ్‌బాజ్ షరీఫ్ అన్నారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. దాయాదుల పోరుపై మరింత హైప్‌ను క్రియేట్ చేశాయి. ఈ స్టేడియం ప్రారంభ కార్యక్రమానికి పాకిస్థాన్‌లోని పలువురు రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు హాజరయ్యారు. పాకిస్థాన్ చివరిసారిగా 1996లో ఛాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇచ్చింది.



## అదే టీమిండియాకు సమస్యగా మారింది : కపిల్ దేవ్

**కె**ప్టెన్ రోహిత్ శర్మ వైఫల్యమే టీమిండియాకు సమస్యగా మారిందని దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్ అన్నాడు. కెప్టెన్ విఫలమైతే ఆ ప్రభావం జట్టుపై పడుతుందని అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం జట్టు అన్‌సెటిల్‌గా ఉందని, ఛాంపియన్స్ ట్రోఫీ 2025 సమయానికి కుదురుకోవాలన్నాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. గత 6 నెలలుగా రెండు ఫార్మాట్లలో కలిపి రోహిత్ శర్మ 16 ఇన్నింగ్స్‌ల్లో 166 పరుగులు చేశాడు. గత 10 ఇన్నింగ్స్‌ల్లో హిట్ మ్యాన్ ఒక్క హాఫ్ సెంచరీ కూడా నమోదు చేయలేదు. అతను చివరిసారిగా గతేడాది అక్టోబర్‌లో అర్థ శతకం సాధించాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలోనూ తీవ్రంగా నిరాశపరిచాడు. 2 పరుగులే చేసి అనవసర షాట్‌తో పెవిలియన్ చేరాడు.

**రోహిత్ ఫామ్‌లోకి రావాలి..**

తాజాగా ఛాంపియన్స్ ట్రోఫీ 2025 గురించి మాట్లాడిన కపిల్ దేవ్.. రోహిత్ శర్మ ఫామ్‌పై ఆందోళన వ్యక్తం చేశాడు. అప్‌కమింగ్ ఐసీసీ టోర్నీలో బరిలోకి దిగే భారత జట్టుకు కపిల్ దేవ్ బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. మెరుగైన ప్రదర్శన చేసి జట్టును విజేతగా నిలబెట్టాలని ఆకాక్షించారు. 'రోహిత్ శర్మ స్టార్ ఆటగాడు. అతను త్వరగా ఫామ్ అందుకోవాలి. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు కూడా గుడ్ లక్. జట్టు సెట్ అవ్వడానికి కాస్త సమయం పడుతోంది. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 నాటికి అంతా సెట్ అయిపోవాలి.

## తైక్వాండోలో తెలంగాణకు రజతం!



**నే**షనల్ గేమ్స్‌లో తెలంగాణకు తొలి మెడల్ సిల్వర్ మెడల్ లభించింది. మహిళల తైక్వాండోలో పాయం హర్షప్రద రజత పతకం సాధించింది. డెహ్రాడూన్ వేదికగా జరుగుతున్న 38వ జాతీయ క్రీడల్లో శుక్రవారం ముగిసిన తైక్వాండో 73 కిలోల కియోర్గి విభాగం ఫైనల్లో చండీగఢ్ అమ్మాయి ఇతీషా దాస్ 20తో తెలంగాణ ప్లేయర్న్ ఓడించింది. దాంతో హర్షప్రద రన్నరప్‌గా నిలిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది.

అంతకుముందు జరిగిన సెమీఫైనల్లో ఉత్తరాఖండ ప్లేయర్‌పై గెలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. రజత పతకం సాధించిన హర్షప్రదను తెలంగాణ తైక్వాండో సంఘం అధ్యక్షుడు డి.సతీష్ గౌడ్, సాట్స్ ఛైర్మెన్ శివసేనారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. పతకాల పట్టికలో తెలంగాణ ప్రస్తుతం ఒక స్వర్ణం సహా మొత్తం ఆరు పతకాలతో 28వ స్థానంలో ఉంది. 4 స్వర్ణాలు, ఒక రజతం, 5 కాంస్యాలతో ఆంధ్రప్రదేశ్ 18వ స్థానంలో కొనసాగుతోంది. 38 స్వర్ణాలతో సహా 64 పతకాలతో సర్వీస్ స్పోరట్స్ కంట్రోల్ బోర్డ్ అగ్రస్థానంలో ఉండగా.. 30 స్వర్ణాలతో కర్ణాటక, 21 స్వర్ణాలతో మధ్యప్రదేశ్, 19 స్వర్ణాలతో హర్యానా టాప్5లో కొనసాగుతున్నాయి. ఒలింపిక్ కాంస్య పతక విజేత, భారత స్టార్ బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్ స్వర్ణ పతకం సాధించింది. శుక్రవారం జరిగిన మహిళల 75 కేజీల విభాగం ఫైనల్లో లవ్లీనా 5 0తో ప్రన్షు రాథోడ్‌చండీగఢ్)ను ఓడించింది.



## 'అఖండ 2'లో అడుగుపెట్టిన హీరో ఆది

**నం**దమూరి బాలకృష్ణ, మాస్ చిత్రాల దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వచ్చిన 'అఖండ' బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేసిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఈ బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రానికి సీక్వెల్‌ను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ మొదలుపెట్టిన 'అఖండ 2 – తాండవం' చిత్రం ప్రస్తుతం కొన్ని కీలక యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తుంది. అయితే, ఈసారి 'అఖండ 2' బోలెడన్ని సర్‌ప్రైజ్‌లు ప్లాన్ చేశాడు బోయపాటి. ఇప్పటికే ఈ సినిమాలో యంగ్ బ్యూటీ సంయుక్త మీనన్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించనున్న సంగతి తెలిసిందే. ఇక తాజాగా ఈ సినిమాలో మరో యంగ్ హీరో, విలక్షణ యాక్టర్ ఆది పినిశెట్టి కూడా నటిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా జరుగుతున్న 'అఖండ 2' యాక్షన్ సీక్వెన్స్ షూటింగ్‌లో ఆది పినిశెట్టి జాయిన్ అయ్యాడట. ఫైట్ మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్ నేతృత్వంలో తెరకెక్కుతున్న ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌లో ఆది కూడా కనిపిస్తాడని తెలుస్తోంది. ఇక 'అఖండ 2' మూవీని బోయపాటి శ్రీను అత్యంత ప్రెస్టీజియస్ చిత్రంగా తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమాకు థమన్ మరోసారి హై వోల్టేజ్ మ్యూజిక్ అందించనుండగా ఈ చిత్రాన్ని 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ప్రొడ్యూస్ చేస్తున్నారు. సెప్టెంబర్ 25న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

రీల్



## 'ఓజి' మ్యూజిక్‌పై థమన్ కాన్ఫిడెంట్..

**ప**వర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో 'ఓజి' కూడా ఒకటి. ఈ సినిమాను దర్శకుడు సుజిత్ డైరెక్ట్ చేస్తుండగా పూర్తి గ్యాంగ్‌స్టర్ మూవీగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, వీడియో గ్లింప్స్ ఈ మూవీపై అంచనాలను నెకట్స్ లెవెల్‌లో క్రియేట్ అయ్యాయి. ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తుండటంతో ఈ సినిమా మ్యూజిక్ ఏ రేంజ్‌లో ఉండబోతుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, తాజాగా 'ఓజి' చిత్రానికి థమన్ అందించే మ్యూజిక్‌పై ఆయన తాజాగా స్పందించారు. ఈ సినిమా మ్యూజిక్ ప్రేక్షకులను ఖచ్చితంగా ఆకట్టుకుంటుందని.. ఈ మ్యూజిక్ రిలీజ్ అయ్యేసరికి తాను గడ్డం, మీసం పెంచుకుంటానని.. ఈ చిత్ర మ్యూజిక్ రిలీజ్ తర్వాత తాను మీసం మెలేస్తానని ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. ఈ సినిమా కోసం సుజిత్ అండ్ టీమ్ ఎంతో కష్టపడుతున్నారని.. దీని ఔట్‌పుట్ ప్రేక్షకులను మెస్మరైజ్ చేయడం ఖాయమని ఆయన అన్నారు. ఇక ఈ సినిమాలో పవన్ లుక్స్ పరంగా కూడా ప్రేక్షకులను స్టన్ చేస్తారని.. ఈ సినిమాలో అందాల భామ ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాను డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ ప్రొడ్యూస్ చేస్తుండటంతో ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## చరణ్ 16 పై ఇంట్రెస్టింగ్ లీక్ !



**గ్లో**బల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న భారీ సినిమా కోసం అందరికీ తెలిసిందే. ఇది చరణ్ కెరీర్ లో 16వ సినిమాగా తెరకెక్కిస్తుండగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక షూటింగ్ అంతా ఫుల్ స్వింగ్ లో జరుగుతూ ఉండగా ఈ సినిమాని దర్శకుడు బుచ్చిబాబు ఒక సాలిడ్ స్పోరట్స్ డ్రామాగా తెర కెక్కిస్తున్నారు అని తెలిసిందే. అయితే ఇది వరకు పలు రూమర్స్ ఈ సినిమా ఆ ఆట మీద ఈ ఆట మీద అంటూ రూమర్స్ వచ్చాయి కానీ ఇపుడు ఈ సినిమా పై క్రేజీ లీక్ బయటకి వచ్చింది. ఈ సినిమా సినిమాటోగ్రఫీ అందిస్తున్న రత్నవేలు షూట్ పై అప్డేట్ ఇస్తూ పవర్ క్రికెట్ అంటూ ఒక లైన్ కూడా ఇవ్వడం జరిగింది. దీనితో ఈ సినిమా క్రికెట్ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతోంది అని చెప్పాలి. అలాగే ఈ సినిమాలో రామ్ చరణ్ రోల్ తాలూకా క్రికెట్ బ్యాటింగ్ పవర్ కూడా మామూలు లెవెల్లో ఉండదని తెలుస్తోంది. కొడితే బాల్ ఎక్కడికో వెళ్లి పడాల్సిందే అట. అంతటి పవర్ ఉన్న బ్యాట్స్ మెన్ లా కనిపిస్తాడని కూడా ఇలాంటి సీన్ ఒకటి ఆల్రెడీ షూట్ చేసినట్టు కూడా తెలుస్తోంది. మరి చూడాలి ఈ క్రేజీ ప్రాజెక్ట్ ఎలా ట్రీట్ చేస్తుంది అనేది.

# కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా 10న మహా ధర్నా

### తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్. వీరయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఈనెల 10న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్. వీరయ్య పిలుపునిచ్చారు. ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్‌లోని రైతుసంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన పోస్టర్ విడుదల సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ అదాని, అంబానీలకు మేలు చేకూర్చే విధంగా రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలు, మైనారిటీలు, మహిళలకు వ్యతిరేకంగా ఉందని, దీనిని సవరించే వరకు ఐక్యంగా పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. రమ తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్‌లోని కెఎల్ సిసి కన్వెన్షన్‌లో శనివారం జరిగిన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి మనవరాలు సంజనరెడ్డి, రామ్‌నితిన్‌రెడ్డిల వివాహానికి హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు , జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి,రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు తదితరులు.

## డీప్ సీక్ దెబ్బ

**(మొదటి పేజీ తరువాయి)**

రూపొందిస్తారు. చైనా అంకుర సంస్థ డీప్ సీక్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పూర్వరంగంలో సదస్సు జరుగుతున్నది. ఇంతకుముందులా కాకుండా ఐదు ప్రధాన అంశాలపై సదస్సు చర్చిస్తుంది. కృత్రిమ మేధ, ప్రజా ప్రయోజనాలు, నిత్యజీవితంలో కృత్రిమ మేధ, కృతిమ మేధలో నవ కల్పనలు, కృత్రిమ మేధలో నైతిక విలువలు, విశ్వసనీయత, ప్రపంచస్థాయిలో నిర్ణీత నియంత్రణలు వంటి అంశాలపై ప్రధానంగా చర్చిస్తారు. మానవాళిలో ఎఐ పాత్ర, అడ్వాన్స్‌మెంట్, నియంత్రణ వంటి అనేక ముఖ్య విషయాలక సంబంధించిన విధానపరమైన అంశాలను ఈ సదస్సు శాసిస్తుందని అందరూ అంచనావేస్తున్నారు. ఈ సదస్సులో జరిగే చర్చలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ చర్చలు, వాటి సారాంశం, ఫలితాలు ఎలా ఉంటాయా? అని ప్రపంచ వేశాలు చాలా ఉత్కంఠతో నిశితంగా దీనిపైనే దృష్టి సారిస్తున్నాయి. ప్రధానంగా ఈ ఏడాది సాంకేతికరంగంలో అత్యంత ప్రధానాంశాలు చోటుచేసుకున్నాయి. టెక్ రంగం ఈ ఏడాది ఇంకా వరుస పరిణామాలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్న తరుణంలో ఈ సదస్సు జరుగుతున్నది. ఈ శిఖరాగ్ర సదస్సు అనంతరం ప్రపంచ నాయకులు ఎ ఐ పై కీలక నిర్ణయాలు తీసుకునేందుకు ఒక్కచోట చేరే అవకాశాలు ఉంటాయి.

## సంక్షోభంలో సాగు

**(మొదటి పేజీ తరువాయి)**

ఏడువేల రూపాయల వరకు ధర పలికిన పత్తి ఈ ఏడాది నాలుగు వేల రూపాయలకు మించి ధర పలక లేదు. అతి వృష్టి కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గింది. ఖమ్మంజిల్లాలో సగటున 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పత్తి ఈ ఏడాది సగటు దిగుబడి నాలుగు క్వింటాళ్లకు మించలేదంటే అతిశయోక్తి కాదు. ఒక పక్క దిగుబడి తగ్గి మరో పక్క గిట్టుబాటు ధర లేక ఈ ఏడాది పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయం. పత్తి పరిస్థితి ఈవిధంగా ఉంటే మిర్చి అయిన ఆదుకోకపోతుందా అని రైతులు ఆశగా చూశారు. కాని మిర్చి రైతుకు మరో రెండేళ్లు కోలుకోలేనివిధంగా ఎదురు దెబ్బ తగిలింది. గతేడాది రూ. 20వేల పైబడి పలికిన మిర్చి ధర ఈ ఏడాది రూ. 13వేలకు మించి కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. ఆదిలో అధిక వర్షాల కారణంగా రెండు మూడు సార్లు మిర్చి మొక్కలను నాటాల్సి వచ్చింది. ఆ తర్వాత తెగుళ్లు, ఇతరత్రా కారణాలతో పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. పెరిగిన రసాయనిక ఎరువుల ధరలు, క్రిమిసంహారక మందుల ధరల కారణంగా రైతులు అప్పులు తీసుకువచ్చి సాగు చేయాల్సి వచ్చింది. తీరా మార్కెట్‌కు వస్తే గతేడాది తాలు మిర్చి పలికిన ధర కూడా ఈ ఏడాది మొదటి కోత మిర్చికి కూడా ఆ ధర రాలేదు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించడం లేదు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు గత మూడేళ్లలో చూసినప్పుడు కనిష్ట స్థాయికి పడిపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. వ్యవసాయ రంగంలో రైతుల పరిస్థితి చూస్తుంటే ఒక ఏడాది కలిసి వస్తే మూడేళ్లు నష్టాలు వస్తున్నాయి. ఈ ఏడాది ప్రకృతిపరంగా కాస్త ఫర్వాలేదనుకుంటే వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పతనమై మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరల విషయంలో అనుసరిస్తున్న వైఖరి రైతుల పాలిట శాపంగా మారింది. పెట్టుబడి ఆధారంగా మద్దతు ధరను నిర్ణయించాలని మూడు నాలుగేళ్లుగా జరుగుతున్న రైతాంగ ఉద్యమాన్ని పూర్తిగా విస్మరిస్తుంది. మద్దతు ధర లేకపోవడమే ఈ దుస్థితికి కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 50 శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని విస్మరిస్తే భవిష్యత్తులో దేశ ఆర్థిక రంగంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికే వ్యవసాయ రంగం నుంచి లక్షలాది కుటుంబాలు ప్రతి యేటా వైదొలిగి ప్రత్యామ్నాయ రంగాల వైపు వెళ్తున్నారు. యువ రైతులు గ్రామాల్లో మచ్చుకు కూడా కనిపించడం లేదు. పట్టణ కూలీలు పెరగడానికి, పట్టణీకరణ పెరగడానికి కూడా వ్యవసాయ రంగ సంక్షోభమే కారణమవుతుంది. ఇప్పటికే నిరుద్యోగం పెరిగి ఉపాధి కల్పన రంగాలు వట్టిపోయిన తరుణంలో మరంత విస్మరిస్తే పెను ప్రమాదమన్న వాస్తవాన్ని పాలకులు గ్రహించాల్సి ఉంది. వ్యవసాయ రంగ సంక్షోభ నివారణకు, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేందుకు తక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. ఆ దిశగా పాలకులు ఆలోచన చేయకపోతే పెను ప్రమాదాన్ని ఎదుర్కొనక తప్పదు.

## సమ్మె చేయటానికి ఆర్‌టిసి ఎండి నిరంకుశ చర్యలే కారణం

### ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసిలో కార్మికులు సమ్మె చేయటానికి టిజిఎస్‌ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ దుందుడుకు చర్యలే కారణమని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు తెలిపారు. ఆర్‌టిసి ప్రైవేటీకరణకు ఆస్కారం ఉండదని, ఎలక్ట్రిక్ బస్సులపై అపోహలు వద్దని, ఒక్క ఉద్యోగిని కూడా తొలగించబోమని పత్రికా ముఖంగా తెలంగాణ ఆర్‌టిసి ఎండి సజ్జనార్ ప్రకటనలు ఇవ్వటాన్ని ఎంప్లాయీస్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఎలక్ట్రిక్ బస్సులు కూడా డీజిల్ అద్దె బస్సుల లాంటివే అని ఒక వైపు చెబుతూ, మరో వైపు ఈ బస్సులు ఆర్‌టిసివే అనడంలో ఎండి చతురత కనిపిస్తోందని బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీజిల్ అద్దె బస్సులు ఒక ప్రైవేట్ వ్యక్తివి అయినప్పుడు ఎలక్ట్రిక్ అద్దె బస్సులు ఆర్‌టిసి యాజమాన్యానివి ఎలా అవుతాయని, ఎలక్ట్రిక్ అద్దె బస్సులు డిపోలకు వస్తున్న సందర్భంగా డిపోలో ఉన్న సిబ్బందిని బదిలీ చేయడం లేదా? ఇది దేనికి సూచన అని ఎస్.బాబు ప్రశ్నించారు. బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ సాంకేతిక లోపాలతో కూడుకున్న మిషన్లతో మద్యం సేవించని వారిని కూడా మద్యం తాగినట్లుగా చూపిస్తూ రిమూవల్ ఫ్రమ్ సర్వీస్ చేయటానికి కారణం ఎండి అధికారులకు ఇస్తున్న సూచనలు కాదా అని ప్రశ్నించారు. సంస్థలో పారిశ్రామిక అశాంతికి పూర్తి బాధ్యుడు ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టరే అని ఆయన అన్నారు. యూనియన్లు సమ్మె నోటీసులు జారీ చేసి దాదాపు 2 వారాలు గడుస్తున్నా ఇంతవరకు కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించకపోవడంలోనే ఆయన ఆంతర్యం ఏమిటో అర్థమవుతోందని అన్నారు.

## మిర్చి రైతు పరేషాన్

**(మొదటి పేజీ తరువాయి)**

లేదు. దీంతో క్రమంగా సాగు తగ్గుముఖం పడుతున్నది. వరంగల్ జిల్లాలోని దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లో పలు గ్రామాల్లో చపాట రకం మిర్చి అంతర్జాతీయ మార్కెట్ లో అత్యంత డిమాండ్ వున్న రకం. ఈ రకం మిర్చి సాగు త తగ్గుతుండడం విశేషం. 2020–21లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2.30లక్షల ఎకరాల్లో మిర్చిని సాగు చేశారు. 2023–24లో 1 లక్షా 37వేల ఎకరాల్లో మిర్చి సాగు చేయగా, ఈ ఏడాది కేవలం 1లక్ష ఎకరాల్లో మాత్రమే మిర్చిని సాగు చేస్తుండడం గమనార్హం. ఐదేళ్లలో భారీగా విస్తీర్ణం తగ్గడం విస్మయాన్ని కలిగిస్తున్నది. వరంగల్ జిల్లాలో మాత్రమే గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 508 ఎకరాల్లో సాగు చేసినట్టు కనిపిస్తుంది. మిగిలిన 5 జిల్లాల్లో మిర్చి సాగు గణనీయంగా తగ్గింది. వరంగల్ ఎనుమాముల మార్కెట్లో శుక్రవారం మిర్చి 18వేల బస్తాలు వచ్చాయి. ఇందులో 10వేల తేజ రకం మిర్చి ఎగుమతులకు పంపించేదే కావడం గమనార్హం. ఇక్కడి నుండి చైనా, థాయిల్యాండ్ కు ఈ మిర్చి రకాన్ని వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. దిగుబడులు పడిపోవడంతో సాగును తగ్గించారు. ఇండోనేషియా ప్రభుత్వం మిర్చి దిగుమతులకు అనుమతులు ఇవ్వలేదని వ్యాపారులు చెబుతున్నారు. ఒకవేళ ఆ ప్రభుత్వం అనుమతులు ఇస్తే ఇండోనేషియాకు తేజరకం మిర్చిని ఎగుమతి చేస్తామంటున్నారు..

**ఏటేటా తగ్గుతున్న మిర్చి ధరలు:** మార్కెట్లో గణనీయంగా మిర్చి ధరలు తగ్గుతుండడం వల్ల రైతులు మిర్చి సాగుకు వెనుకంజ వేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. వరంగల్ ఎనుమాముల మార్కెట్లో మిర్చి ధర ప్త అధికంగా 2021 నుండి 2025 కు ధరల పతనం స్పష్టంగా కనిపిస్తుంది. 2021 ఫిబ్రవరిలో మిర్చి ధరలు రూ.8 వేల నుండి 12 వేలుంటే, 2022 ఫిబ్ర వరిలో 11వేల నుండి 18వేల ధర వుం ది. 2023 ఫిబ్రవరిలో 13 వేల నుండి 17వేలు, 2024 ఫిబ్ర వరిలో రూ.14 వేల నుండి రూ.18వేలు ధర వుండగా, 2025 ఫిబ్రవరిలో రూ.12వేల నుండి రూ.13 వేల ధర వుంది.

**మిర్చి పంటపై చీడపీడల ప్రభావం :** మిర్చిని ఆశిస్తున్న వైరస్, నల్లతామర చీడపీడలతో తు పెద్ద ఎత్తున నష్టాలబారిన పడి మిర్చి సాగుకు స్వస్తి చెప్పి ప్రత్యా మ్నాయంగా వరి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తు న్నారు. దీతో మిర్చి సాగు ఉమ్మడి వరంగల్ జిల్లాలో గణనీయంగా తగ్గింది. ముడుత, నల్లతామర వంటి తెగుళ్లు పెద్ద మొత్తంలో ఆశించడంతో దిగుబడి గణనీ యంగా తగ్గింది. ఈ క్రమంలో తు చీడ, పీడల నివారణకు బయో పెస్టిసైడ్సున్లు విరివిగా వాడి తీవ్రంగా నష్టపోయారు. మిర్చిపై పెట్టు బడులు పెరిగాయి. ఈ క్రమంలో ఈ నష్టాలను అధిగ మించడానికి తు మిర్చిని వదిలి ప్రత్యా మ్నాయంగా వరి, మొక్కజొన్న సాగుకు మొగ్గారు. ఈ క్రమం లోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలో మిర్చి సాగు గణనీయంగా తగ్గింది.ఉమ్మడి వరంగల్ జిల్లాలో మిర్చి సాగు వరంగల్ జిల్లా లో మినహా మిగతా 5జిల్లాల్లో సాగు గణనీయంగా తగ్గింది. వరంగల్ జిల్లాలో మాత్రమే గత ఏడాదితో పోల్చితే ఈసారి 508 ఎకరాల్లో మిర్చి సాగు జరుగుతుంది. హన్మకొండ జిల్లాలో ఏకంగా 5వేల 700ఎకరాల సాగు తగ్గింది. ఈ జిల్లాలో 14 మండలాల్లో కేవలం మూడు మండలాలు పరకాల, నడికూడ, శాయంపేట మండలాల్లో మాత్రమే మిర్చి సాగు చేస్తుండడం గమనార్హం. జనగామ జిల్లాలోనూ 919ఎకరాల్లో మిర్చి సాగు తగ్గింది.

**మహబూబాబాద్‌లో గణనీయంగా తగ్గిన మిర్చి సాగు :** మహబూబాబాద్ జిల్లాలో గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 22 వేల ఎకరాల్లో మిర్చి సాగు తగ్గింది. ఐదేళ్లలో ఈ జిల్లాలో 2లక్షల ఎకరాల మిర్చి సాగయింది. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంతంలో వున్న ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ఒకప్పుడు మిర్చిని పెద్ద ఎత్తున తు సాగు చేసే వారు ఇప్పుడు ఈ రెండు జిల్లాల్లోనూ మిర్చి సాగు తగ్గిపోవడం గమనార్హం. ములుగు జిల్లాలో తాడ్వాయి, ఏటూరానాగారం, మంగపేట మండలాలతో పాటు వాజేడు, వెంకటాపురం మండలాల్లో మిర్చిని గణనీయంగా సాగు చేస్తారు. ఈ జిల్లాలోనూ ఈ సారి 5వేల 800 ఎకరాల్లో సాగు తగ్గడం విస్మయాన్ని కలిగిస్తుంది. భూపాలపల్లి జిల్లాలో 4వేల 300 ఎకరాల్లో మిర్చి సాగు తగ్గింది. ఈ జిల్లాలో భూపాలపల్లి, కాటారం, మహాముత్తారం, మహదేవ్ పూర్, మొగుళ్లపల్లి, చిట్యాల మండలాల్లో మిర్చిని గణనీయంగా పండించేవారు.

**నల్లతామరతో పడిపోయిన దిగుబడులు ;** గత రెండు, మూడేళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో నల్లతామరతో మిర్చి దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. ఫలితంగా సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టింది. నల్లతామరను నివారించడానికి పెద్దఎత్తు న మందులు పిచికారి చేయడంతో మిర్చిపై పెట్టుబడులు అమాంతం గణనీయంగా పెరిగిపోయి అప్పులుపాలై మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడిన రైతులు జిల్లాలో వున్నారు. రాయపర్తి మండలంలో గత రెండేళ్లలో రైతులు నల్లతామర నష్టాలతో దిగుబడి క అప్పులు తీర్చే దారిలేక పురుగు మందు తాగి తనువు చాలించిన సంఘటన చోటు చేసుకుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com